
మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. బ్యాంకుల ద్వారా రుణాలు అందిస్తూ చేయూత తనిస్తోంది. అయితే కొందరు ఆర్పీలు అక్రమాలకు పాల్పడుతున్నారు. పొదుపు సంఘాలను అడ్డుపెట్టుకుని బోగస్ గ్రూపులను తయారు చేసి సొమ్ము చేసుకుంటున్నారు. ఇలా జరిగిన భారీ కుంభకోణంపై 'ఆంధ్రజ్యోతి' గతేడాది మార్చి 5 నుంచి వరుస కథనాలు ప్రచురించి వెలుగులోకి తీసుకొచ్చింది. అప్పట్లో అధికారులు స్పందించి కొందరు ఆర్పీలను బాధ్యతల నుంచి తొలగించారు. మరికొందరు మాత్రం కొనసాగుతూ నేటికీ పాత పంథాలోనే నడుస్తున్నారు. తొలగించిన వారిలో ఇద్దరు, ముగ్గురు ఆర్పీలుగా చెలామణి అవుతూ అదే బోగస్ బాగోతాన్ని నడుపుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి.

మళ్లీ బోగస్ రుణ మోసం





- తీసుకున్న లోన్లు చెల్లించాలని గ్రూపు సభ్యులపై బ్యాంకర్ల ఒత్తిడి
- కొందరు ఆర్పీల బురిడీతో రోడ్డెక్కిన బాధితులు
- మూడు నెలల్లో 350కు పైగా రుణాలు.. అందులో 56 నకిలీవిగా అనుమానం
- గతంలో తొలగించిన వారిలో కొందరు నేటికీ ఆర్పీలుగా చెలామణి
- వారంరోజులుగా పలు బ్యాంకుల్లో రుణాల కోసం వారు హడావుడి
- వైసీపీ పాలనలో బీజం.. నేటికీ కొనసాగుతున్న బాగోతం

ఒంగోలు కార్పొరేషన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ పాలనలో ఆ పార్టీకి చెందిన ఆర్పీలు ఇష్టారాజ్యంగా దోచేశారు. నేటికీ బోగస్ గ్రూపుల బాగోతానికి అడ్డుకట్ట వేయలేకపోవడంతో కొందరు విధుల నుంచి తొలగించినా ఇంకా ఆర్పీలుగానే కొనసాగుతూ బ్యాంకులను బురిడీ కొట్టిస్తున్నట్లు సమాచారం. మరోవైపు ప్రభుత్వం మారినా.. అధికారులు మారినా నకిలీ గ్రూపుల వ్యవహారం నడుస్తూనే ఉంది. ఈ ఏడాదిలో జనవరి నుంచి ఇప్పటివరకు సుమారు 350 గ్రూపులకు రుణాలు మంజూరు కాగా అందులో 56 గ్రూపులు అసలు మెప్మా రికార్డుల్లో కానీ, ఆన్‌లైన్‌లో కానీ లేకపోవడం గమనార్హం. అయితే ఈ నకిలీ గ్రూపులకు కార్యాలయ సిబ్బంది సహ కారం అందించడం మెప్మాలో చర్చనీయాంశమైంది.

పేర్లు మార్చి కొత్త గ్రూపులుగా..

పేర్లు మార్చి నకిలీ గ్రూపులతో కొందరు ఆర్పీలుగా వ్యవహరిస్తున్న తీరు విస్తుగొలుపుతోంది. వాస్తవానికి ఒక గ్రూపులో పది మంది సభ్యులు ఉంటారు. ఒక్కో ఆర్పీ కింద కొన్ని గ్రూపులు ఉంటాయి. ఒక్కో గ్రూపు నుంచి ఇద్దరు మహిళా సభ్యుల పేర్లు తీసి, వారి ఆధార్ కార్డులు మార్చేసి, గ్రూపు పేరును కూడా పూర్తిగా మార్చకుండా ముందు ఏదో ఒక అక్షరం చేర్చి మరో గ్రూపుగా సృష్టిస్తారు. ఎప్పటి నుంచో బ్యాంకర్లతో రుణాలకు సంబంధించి పరిచయాలు కలిగిన ఆర్పీలు కొత్త గ్రూపులుగా పరిచయం చేస్తారు. ఇదంతా గ్రూపు సభ్యులకు తెలియదు. ఈ విధంగా నకిలీ పొదుపు గ్రూపులను తయారు చేసి బ్యాంకర్లను మభ్య పెడతున్నారు. ఆర్పీలను నమ్మిన బ్యాంకర్లు ఒక్కో గ్రూపునకు రూ.20లక్షల రుణం మంజూరు చేస్తున్నారు. ఇటీవల ఈ వ్యవహారం జోరుగా సాగుతోంది.


రుణాల పేరుతో ఆర్పీ మోసం చేసిందని వెల్లడిస్తున్న బాధితులు

ఓ ఆర్పీ నిర్వాకంతో రోడ్డెక్కిన బాధిత మహిళలు

తాజాగా కేశవస్వామి పేటకు చెందిన పలు పొదుపు సంఘాల మహిళలు ఓ ఆర్పీ చేతివాటంతో మోసపోయారు. విషయం తెలుసుకుని న్యాయం చేయాలని రోడ్డెక్కారు. తమ గ్రూపు బాధ్యతలు చూసే ఆర్పీ తమకు తెలియకుండా తమ పేరుతో భారీగానే రుణాలు దోచేసినట్లు బాధితులు వాపోతున్నారు. సుమారు 14గ్రూపుల పేరుతో రుణాలు తీసుకుని ఒక్కో సభ్యురాలికి రూ.2లక్షలు రుణం

మిగతా 4వ పేజీలో


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా, పక్కన డీపీవో వెంకటనాయుడు

నిర్లక్ష్యంగా ఉంటే వేటు తప్పదు

- పారిశుధ్య నిర్వహణపై కలెక్టర్ మండిపాటు
- సమావేశానికి గైర్హాజరైన పెద్దారవీడు ఈవోపీఆర్‌డీకి షోకాజ్ నోటీసు
- ఎర్రగొండపాలెం ఎంపీడీవోకూ జారీ చేయాలని జడ్పీ సీఈవోకు ఆదేశం

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): 'విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వేటు తప్పదు. ఏ పని చేయకుండా ఉండేందుకు ప్రభుత్వం మీకు జీతాలు ఇస్తుందా? క్షేత్రస్థాయిలో పట్టించుకోకుండా ఇక్కడకు వచ్చి కాకమ్మ కథలు వినడం కోసం పిలిపించామా?' అంటూ కలెక్టర్ తమీమ్ అన్సారియా మండిపడ్డారు. కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో శుక్రవారం ఎంపీడీవోలు, ఈవోపీఆర్‌డీలతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో పారిశుధ్యంపై కలెక్టర్ తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. సమావేశానికి పెద్దారవీడు ఈవోపీఆర్‌డీ హాజరుకాకపోవడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశం

మిగతా 4వ పేజీలో


అమ్మనబ్రోలులో గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్

మాఫియాలే మట్టుబెట్టాయి?

రేషన్, లిక్కర్, ఇసుక వ్యవహారాల్లో విభేదాలు

- వీరయ్య హత్య కేసు దర్యాప్తులో పురోగతి
- స్కూటర్ క్లూతో ఛేదన దశకు పోలీసులు
- ఇది కిరాయి హంతకుల పనేనని నిర్ధారణ

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ఇసుక, లిక్కర్, రేషన్ మాఫియాలే టీడీపీ యువ నాయకుడు ముప్పవరపు వీరయ్యచౌదరి హత్యకు కారణమని తెలుస్తోంది. తాజా పోలీసు దర్యాప్తులో ఆ విషయం వెల్లడైనట్లు తెలుస్తోంది. హంతకులు ఉపయోగించిన స్కూటీ దొరకడంతో కేసు మిస్టరీ వీడిపోయే దశకు చేరింది. స్కూటీ క్లూతో శుక్రవారం మధ్యాహ్నం నుంచి పోలీసులు శరవేగంగా కదిలారు. హత్యకు కుట్రదారులను, పాత్రధారులను గుర్తించే విషయంలో ముందడుగు వేశారు. అప్పటికే అదు పులో ఉన్న అనుమానితులతోపాటు మరి కొందరిని శుక్రవారం మధ్యాహ్నం, రాత్రి అదుపులోకి తీసుకుని దర్యాప్తును వేగవంతం చేశారు. మరోవైపు హైదరాబాద్‌లో సైతం ఒకరిద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకుని ఒంగోలుకు తరలిస్తున్నారు. కుట్రదారులు, స్థానిక పాత్రధారులపై ఒక అవగాహనకు వచ్చిన పోలీసులు పరా రీలో ఉన్న కిరాయి హంతకుల కోసం గాలింపును ముమ్మరం చేశారు. గత మంగళవారం రాత్రి వీరయ్య హత్యకు గురికాగా సరైన క్లూ దొరక్క పోలీసులు సత మతమవుతున్న విషయం విదితమే. దర్యాప్తులో భాగంగా రాజకీయ, వ్యాపార అంశాలపై దృష్టి సారించారు. తాజా సమాచారం మేరకు రేషన్, లిక్కర్, ఇసుక వ్యవహారాల్లో విబేదాలే వీరయ్య హత్యకు కారణమని పోలీసులు భావిస్తున్నారు. వీరయ్య హత్యకు గురైన వెంటనే ఆయన స్వగ్రామమైన అమ్మనబ్రోలుకు చెందిన రాజకీయ విరోధితోపాటు మరికొందరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మరుసటిరోజు అదే మండలానికి చెందిన మరో రౌడీషీటర్‌ను కూడా అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. ఎలాంటి క్లూ దొరక్కపోవడంతో వ్యాపార


పోలీసులు స్వాధీనం చేసుకున్న రక్తపు మరకలతో ఉన్న స్కూటర్

మిగతా 4వ పేజీలో



ఒంగోలులోని చర్చి సెంటర్‌లో మానవహారం నిర్వహిస్తున్న జనసేన నాయకులు, కార్యకర్తలు

ఉగ్ర దాడిపై వెల్లువెత్తిన నిరసనలు

జిల్లావ్యాప్తంగా శాంతి ర్యాలీలు

- పలుచోట్ల నల్లబ్యాడ్జీలతో హాజరైన ముస్లింలు
- మృతులకు ఘనంగా నివాళులు
- ఒంగోలులో జనసేన మానవహారం
- విభిన్నవర్గాల ఆధ్వర్యంలో కార్యక్రమాలు
- విశాఖలో చంద్రమౌళి అంత్యక్రియల్లో పాల్గొన్న మంత్రి స్వామి

ఒంగోలు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : పహల్గాం ఉగ్రదాడికి నిరసనగా జిల్లావ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. వివిధ వర్గాల ప్రజలు శుక్రవారం పలుచోట్ల శాంతి ర్యాలీలు, ఉగ్రదాడిలో మృతిచెందిన వారికి నివాళులు, ఇతర రూపాలలో నిరసన కార్యక్రమాలను నిర్వహించారు. కశ్మీర్‌లోని అనంతనాగ్ జిల్లా పహల్గాంలో ఈనెల 22న ఉగ్రవాదులు అక్కడ ప్రకృతి అందాలను చూసేందుకు వచ్చిన పర్యాటకులపై తెగబడి కాల్పులు జరిపిన విషయం విదితమే. అందులో 26మంది మృతి చెందగా మరో 20మందికి

మిగతా 4వ పేజీలో


ఉగ్రదాడికి నిరసనగా నినాదాలు చేస్తున్న ముస్లిం యువతులు

సమగ్ర శిక్షలో సెక్టోరల్ అధికారుల నియామకం

ఒంగోలు విద్య, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఏపీ సమగ్ర శిక్ష జిల్లా ప్రాజెక్టు కార్యాలయంలో సెక్టోరల్ అధికారుల పోస్టులను ఫారిన్ సర్వీసు నిబంధనల (ఎఫ్ఎస్‌టీసీ) ప్రకారం భర్తీ చేశారు. ఈమేరకు పాఠశాల విద్య కమిషనర్ విజయరామరాజు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. సమగ్ర శిక్ష జిల్లా ప్రాజెక్టు కార్యాలయంలో ఇటీవల సెక్టోరల్ అధికారుల పోస్టులను డిప్యుటేషన్ విధానంలో భర్తీ చేశారు. ఎఫ్ఎస్‌టీసీ మినహా ఇతర డిప్యుటేషన్లను కమిషనర్ రద్దు చేశారు. ఈనేపథ్యంలో ఇక్కడి సెక్టోరల్ అధికారుల నియామకాలు కూడా డోలాయమానంలో పడ్డాయి. ఈనేపథ్యంలో డిప్యుటేషన్ నియామకాలను ఫారిన్ సర్వీసు కిందకు మార్చుతూ కమిషనర్ ఉత్తర్వులు ఇచ్చారు. సీఎంవోగా కె.సోనీరూత్, ఎంఐఎస్‌అండ్ ప్లానింగ్ కోఆర్డినేటర్‌గా ఎం.జాలారత్నం, ఎలెన్ కోఆర్డినేటర్‌గా డి.నాగరాజు, జీసీడీవోగా కె.హేమలత, ఐఈ కోఆర్డినేటర్‌గా పి.నాగేంద్రనాయక్‌ను నియమించారు. ప్రాథమికంగా వీరి పదవీకాలం ఏడాదిపాటు మాత్రమే. రానున్న బదిలీల్లో వీరి పోస్టులను ఖాళీలుగా చూపుతారు. ఏఎస్‌వోగా నియమితులైన బి.శ్రీనివాసరావు కొనసాగేందుకు ఇష్టపడకపోవడంతో ఆయన్ను రిలీవ్ చేసి స్కూలుకు పంపిస్తున్నారు.



భవిష్యత్ కోసం బాగు


మార్కాపురం మండలం బోడపాడు చెరువు కట్టను పటిష్టం చేస్తున్న రోలర్

- చెరువుల మరమ్మతుపై ప్రభుత్వం దృష్టి
- వైసీపీ పాలనలో విధ్వంసానికి గురైన వైనం
- నిధులు కేటాయిస్తున్న ప్రస్తుత సర్కారు
- వేగంగా పూర్తిచేయాలని కోరుతున్న రైతులు


పోతంపల్లి చెరువుకు గండిపడి వృథాగా పోతున్న నీరు (ఫైల్)

మార్కాపురం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం డివిజన్‌లోని చెరువుల పరిస్థితి దయనీయంగా ఉంది. 2019 నుంచి 2024 మధ్య కాలంలో వైసీపీ విధ్వంస పాలనకు డివిజన్‌లోని చెరువులు నిలువెత్తు సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. ఐదేళ్ల పాలనలో ఒక్క చెరువు నిర్వహణకు కూడా నిధులు కేటాయించిన పాపాన పోలేదు. మార్కాపురం డివిజన్ పూర్తిగా వర్షాధారం మీద ఆధారపడిన

మిగతా 4వ పేజీలో

జిల్లాలో కంభం చెరువు తర్వాత పుల్లలచెరువు మండలంలోని చిన్నకండలేరు చెరువు అతిపెద్దది. కానీ దీని అభివృద్ధికి గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎలాంటి చర్యలూ చేపట్టలేదు. గత సంవత్సరం అక్టోబరులో కురిసిన వర్షాలతో చిన్నకండలేరు చెరువుకు సమృద్ధిగా నీరు చేరింది. అయినప్పటికీ తూముల వద్ద ఏర్పడిన లీకులతో నీరంతా వృథాగా పోయింది. ప్రస్తుత ప్రభుత్వం వచ్చిన తర్వాత కొంతమేర నిధులు కేటాయించి మరమ్మతులు చేయించారు.

రెండు నెలల క్రితం పెద్దారవీడు మండలం పోతంపల్లి గ్రామానికి చెందిన ప్రజలు తాగునీటి ఇబ్బందులు తీర్చాలని రహదారిపై బిందెలతో రాస్తారోకో చేశారు. వరుణుడు కరుణించడంతో ఇటీవల కురిసిన అకాల వర్షానికి ఆ గ్రామంలోని చెరువు నిండింది. కానీ ఐదేళ్ల వైసీపీ పాలనలో చెరువుకు ఎలాంటి మరమ్మతులు చేపట్టకపోవడంతో కట్టకు గండిపడి నీరు వృథాగా పోయింది. గ్రామస్థులే ఎక్స్‌కవేటర్‌తో స్వచ్ఛందంగా పనులు చేపట్టి కొంతమేర చెరువులో నీరు నిలుపుకోగలిగారు.

ప్రభుత్వంపై పెట్టుకున్న ఆశలను నెరవేర్చాలి



- విశ్రాంత ఉద్యోగుల బెనిఫిట్స్ వెంటనే చెల్లించాలి
- రెవెన్యూ ఉద్యోగులు పారదర్శకంగా పనిచేసేందుకు సదుపాయాలు కల్పించాలి
- ఏపీఆర్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు

వివరాలు 4వ పేజీలో



ఆటవిడుపునకు ఆపసోపాలు!

- పార్కుల్లో సౌకర్యాల కొరత
- కనిపించని ఆహ్లాదం
- గాలికి వదిలేసిన గత వైసీపీ ప్రభుత్వం
- ప్రస్తుత సర్కారైనా దృష్టి పెడితేనే గత వైభవం

5

మళ్లీ బోగస్ రుణ మోసం

(3వ పేజీ తరువాయి)

అందించాల్సి ఉండగా, కేవలం రూ.లక్ష మాత్రమే చేతికిచ్చారని తెలిపారు. తాము తీసుకున్న లక్షను తిరిగి చెల్లించినప్పటికీ ఇప్పుడు బ్యాంకర్లు తమ ఇళ్ల వద్దకు వచ్చి మిగిలిన లక్ష చెల్లించాలని కోరడంతో ఏమిచేయాలో అర్థం కావడం లేదన్నారు. ఇదే విషయమై ఆర్పీని ప్రశ్నించగా బెదిరింపులకు పాల్పడుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. నిరక్షరాశ్యులమైన తమను ఆర్పీ మోసం చేసిందని, తమకు తెలియకుండా తమ పేరుతో రుణాలు తీసుకోవడం వలన బ్యాంకర్లు తమను బాధ్యులుగా చేస్తున్నారని వాపోయారు. ఈ వ్యవహారంపై విచారణ చేసి తమకు న్యాయం పలువురు పొదుపు సంఘాల మహిళలు కోరుతున్నారు. దీంతోపాటు మరికొందరు ఆర్పీలు నేటికీ అవినీతికి పాల్పడటం, సకాలంలో రుణాలు తిరిగి చెల్లింపులు జరగకపోవడంతో బ్యాంకు అధికారులు రంగంలోకి దిగారు. నెల వాయిదాలు చెల్లించాలని కోరడంతో అసలు తాము రుణాలే తీసుకోలేదని సభ్యులు వాపోతున్నారు.

మూడు నెలల్లో భారీగా గ్రూపు రుణాలు?

ఇటీవల కాలంలో మెప్మాలో అవినీతి బాగోతం మరింత అధికమైంది. మూడు నెలలుగా 350కిపైన పొదుపు సంఘాలకు రుణాలు మంజూరయ్యాయి. అందులో 56 గ్రూపుల వివరాలు తెలియడం లేదు. అవన్నీ బోగస్ గ్రూపులైనట్లు సమాచారం. గడిచిన రెండు నెలల్లో పలు అవినీతి వ్యవహారాలు వెలుగులోకి రావడంతో ఒంగోలు సీఎంఎంగా బాధ్యతల్లో ఉన్న అధికారిని విధుల నుంచి తొలగించి, మేనేజింగ్ డైరెక్టర్ కార్యాలయానికి సరెండర్ చేశారు. మరోవైపు కార్యాలయంలోని మరో ఉద్యోగి బోగస్ గ్రూపులకు తన వంతు సహకారం అందించి భారీగానే బొక్కేసినట్లు సమాచారం. అటు కార్యాలయ ఉద్యోగులు, ఇటు అవినీతి ఆర్పీల పొదుపు సంఘాలను మోసం చేస్తూ, బ్యాంకులను బురిడీ కొట్టించి భారీగా దోచేయడం రెండేళ్లుగా కొనసాగుతూనే ఉంది.

గత వైసీపీ పాలనలో ఇష్టారాజ్యంగా..

మెప్మాలో అవినీతికి గత వైసీపీ పాలనలో పునాదులు పడ్డాయి. ఏడాది క్రితం కొందరు ఆర్పీలు, వైసీపీ నాయకురాళ్లు కుమ్మక్కయారు. పొదుపు మహిళల పేరుతో కోట్ల రూపాయలు మెక్కేశారు. లేని పొదుపు సంఘాలను ఉన్నట్లుగా చిత్రీకరించి మాయ చేశారు. ఆధార్ కార్డులు మార్చేశారు. ఆన్‌లైన్‌లో లేకుండా మాయ చేశారు. మొత్తంగా బోగస్ రుణాలతో భారీగా దోచేశారు. కొందరు వైసీపీ నాయకురాళ్లు మెప్మాతో సంబంధం లేకపోయినా, రుణాల పేరుతో కొన్ని బ్యాంకులను బురిడీ కొట్టించి ఇష్టారాజ్యంగా దోచేశారు. అయితే ఈ అవినీతి బాగోతం మెప్మా జిల్లా అధికారులకు తెలిసినప్పటికీ చర్యలకు వెనుకడుగు వేశారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని అప్పటి కలెక్టర్ విచారణకు ఆదేశించారు. ముగ్గురు అధికారులు విచారణ చేసి ఐదుగురిని విధుల నుంచి తొలగించారు. అయితే తొలగించిన వారిలో ఇద్దరు ఆర్పీలు మాత్రం మెప్మాతో సంబంధం లేకపోయినా నేటికీ ఆర్పీలుగా చెలామణి అవుతూ బోగస్ గ్రూపులతో భారీగా దోచేసినట్లు సమాచారం.

విచారణ చేస్తున్నాం.. క్రిమినినల్ చర్యలు తీసుకుంటాం

మెప్మాలో బోగస్ గ్రూపులతో బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుంటున్నట్లు నా దృష్టికి వచ్చింది. దీనిపై లీడ్ బ్యాంకు మేనేజరుకు స్వయంగా లేఖ రాశాను. కేశవస్వామిపేటలోని యానాది సామాజిక వర్గానికి చెందిన పొదుపు సంఘాల మహిళలను మోసం చేసిన ఆర్పీపైనా విచారణ మొదలు పెట్టాం. వాస్తవమని తేలితే విధుల నుంచి తొలగిస్తాం. దీనిపై క్రిమినల్ చర్యలకు సిద్ధం అయ్యాం. ఒంగోలు సీఎంఎం అవినీతి, వసూళ్లపై ఇప్పటికే మెప్మా మేనేజింగ్ డైరెక్టర్ సరెండర్ చేశాం. విధుల నుంచి తొలగించడం జరిగింది. రుణాలపై ఆమె చేసే కార్యాకలాపాలపై మెప్మాకు సంబంధం లేదు. **- మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీహరి**

నిర్లక్ష్యంగా ఉంటే వేటు తప్పదు

(3వ పేజీ తరువాయి)

ఉంటే ఎందుకు రాలేదని డీపీవో జి.వెంకటనాయుడును కలెక్టర్ ప్రశ్నించగా తనకు కూడా ఎలాంటి సమాచారం లేదని ఆయన చెప్పారు. వెంటనే షోకాజ్ నోటీసు జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. వైపాలెం ఈవోపీఆర్‌డీ కూడా రాకపోవడంపై కలెక్టర్ ప్రశ్నించగా స్థానికంగా వేరే కార్యక్రమం ఉన్నందున తాను అనుమతి ఇచ్చానని వైపాలెం ఎంపీడీవో ఆమె దృష్టికి తేవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. పంచాయతీరాజ్ శాఖపై సమీక్ష ఏర్పాటు చేస్తే కనీసం తన దృష్టికి తీసుకురాకుండా ఈవోపీఆర్‌డీకి ఎలా అనుమతి ఇస్తారని ఎంపీడీవోపై మండిపడ్డారు. వైపాలెం ఎంపీడీవోకు షోకాజ్ నోటీసు జారీచేయాలని జడ్పీ సీఈవో చిరంజీవిని ఆదేశించారు.

కథలు ఎందుకు చెబుతున్నారు

చెత్త తరలించేందుకు రిక్షాల సమస్య ఉందని, నెలకు రూ.6వేలు జీతానికి క్లాప్ మిత్రులు పనిచేయడం లేదని సమావేశంలో ఈవోపీఆర్‌డీలు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. దీనిపై స్పందించిన కలెక్టర్ రిక్షాల సమస్య పరిష్కారానికి ప్రత్యామ్నాయ చర్యలు తీసుకున్నారా? లేకపోతే ఉన్నతాధికారులతో మాట్లాడారా? అని ప్రశించారు. వాటిపై ఆలోచించకుండా ఇక్కడకు వచ్చి, రకరకాల కథలు ఎందుకు చెప్తున్నారని మండిపడ్డారు. మీ మాటలు వినేందుకే ఇక్కడకు పిలిపించామా అని సూటిగా ప్రశ్నించారు. క్లాప్‌మిత్రలకు ఇచ్చే వేతనాలను స్థానిక వనరుల నుంచే సమకూర్చుకోవడంపై దృష్టిసారించాలని ఆదేశించారు. తమ పరిధిలోని సమస్యలపై ఎంపీడీవోలు దృష్టిపెట్టాలన్నారు. సమావేశ అజెండా ముందుగానే చెప్పినా సరిగా సన్నద్ధం కాకుండా మొక్కుబడి సమాధానాలు చెప్పేందుకు వచ్చారా? అని ప్రశ్నించారు. పారిశుధ్యం, తాగునీటి సరఫరాకు సంబంధించి రాష్ట్రప్రభుత్వం నిర్దేశించిన ఇండికేటర్స్‌లో జిల్లా స్థానం పేలవంగా ఉంటే అందుకు బాధ్యులైన అధికారులపై చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. వచ్చే శుక్రవారం నాటికి ఆయా ఇండికేటర్స్‌లో గణనీయమైన పురోగతి సాధించాలన్నారు. సమవేశంలో జిల్లా పంచాయతీ అధికారి గొట్టిపాటి వెంకటనాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ బాలశంకరరావు పాల్గొన్నారు.

వీడుతున్న మిస్టరీ!

● దొరికిన రక్తపు మరకల స్కూటీ ● యజమాని పేరుతో కదిలిన డొంక ● ఊపిరి పీల్చుకున్న పోలీసులు

సూత్రధారులు.. పాత్రధారుల కోసం దర్యాప్తు వేగవంతం

ఒంగోలు క్రైం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ నాయకుడు వీరయ్యచౌదరి హత్య కేసులో కీలకమైన ఆధారం దొరకడంతో మిస్టరీ వీడుతోంది. శుక్రవారం చీమకుర్తిలోని ఆర్‌ఎస్ దాబాలో నిందితులు వినియోగించిన రక్తపు మరకల స్కూటీని పోలీసులు గుర్తించారు. దాని యజమాని ఎవరో తెలుసుకుని కూపీ లాగడంతో తీగ కదిలింది. దీంతో హత్య కేసులో పోలీసులు పురోగతి సాధించారు. అమ్మనబ్రోలు గ్రామంలో వీరయ్యచౌదరికి కొంతమందితో ఉన్న వర్గ విభేదాలు హత్యకు దారితీసినట్లు పోలీసులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. అదేసమయంలో స్కూటీ ఒంగోలులో ఇసుక వ్యాపారం చేసే వ్యక్తిదిగా గుర్తించారు. దీంతో అతని కోసం పోలీసులు గాలిస్తుండగా విశాఖపట్నంలో ఫోన్ స్విచ్‌ఆఫ్ అయినట్లు వచ్చింది. అంతకు ముందు ఇసుక వ్యాపారి, వీరయ్యచౌదరిని విభేదిస్తున్న అమ్మనబ్రోలు చెందిన లిక్కర్ వ్యాపారి మధ్య ఫోన్ కాల్స్ నడిచినట్లు సమాచారం ఉండటంతో వారు ఇరువురు కలిసి హత్యకు ప్రణాళిక రూపొందించారనే కోణంలో పోలీసులు విచారణ కొనసాగుతోంది. అయితే వీరయ్యచౌదరిని హత్య కుట్రలో సూత్రధారులు ఎవరు, నేరుగా పాల్గొన్నది ఎవరు అనేది లోతుగా విచారణ చేస్తున్నారు. అయితే ఇసుక వ్యాపారి నేరుగా నేరంలో పాల్గొన్నట్లు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఏదిఏమైనా స్కూటీ దొరకడంతో కేసు చిక్కుముడి వీడింది. దీంతో కొంతమేరకు పోలీసులు ఊపిరిపీల్చుకున్నారు.

చీమకుర్తి నుంచి ఇరువురు నిందితులు పరారీ

వీరయ్య హత్య కేసులో నేరుగా పాల్గొన్న నలుగురు వ్యక్తులలో ఇరువురు చీమకుర్తి వరకు స్కూటీపై వెళ్లి అక్కడ కనిగిరి-విజయవాడ బస్సు ఎక్కినట్లు సీసీ పుటేజీ ఆధారంగా పోలీసులు గుర్తించారు. వారు ఎవరు ఎక్కడ ఉన్నారు అనే కోణంలో కూడా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అయితే వీరయ్య చౌదరి హత్య జరగక ముందుగా మంగమూరు రోడ్డులోని ఓ హోటల్‌లో నలుగురు వ్యక్తులకు మధ్యాహ్న భోజనం లిక్కర్ వ్యాపారి పెట్టించినట్లు ప్రచారం జరుగుతుంది. నేరస్థలం నుంచి ఇరువురు స్కూటీపై, మరో ఇరువురు మోటర్ సైకిల్‌పై వెళ్లినట్లు స్పష్టమైంది. వీరిలో బైక్‌పై ప్రయాణించిన వారిలో ఒకరు ఇసుక వ్యాపారిగా పోలీసులు అనుమానిస్తున్నారు. మరొకరి కోసం గాలిస్తున్నారు. అయితే చీమకుర్తి నుంచి పరారైన దుండగులలో ఒకరికి హత్య చేసే సమయంలో తీవ్ర గాయమైనట్లు చెబుతున్నారు. దాని ద్వారానే స్కూటీపై రక్తపు మరకలు పడ్డాయని అనుమానిస్తున్నారు. వారు ఇరువురు అక్కడ నుంచి ఎటువైపు వెళ్లారు అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసులు అదుపులో ఇరువురు కీలక నిందితులు

పోలీసులు ఇరువురు కీలక నిందితులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. వీరయ్య చౌదరితో విభేదించిన లిక్కర్ వ్యాపారితోపాటు ఇసుక వ్యాపారికి సహకారం అందించిన యువకుడిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. అదేసమయంలో పరారీలో ఉన్న కిరాయి హంతకుల కోసం పోలీసు బృందాలు గాలిస్తున్నాయి.

విశాఖపట్నంలో కీలక నిందితుడు

ఒంగోలు క్రైం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): వీరయ్య చౌదరి హత్య కేసులో ప్రధాన పాత్రదారిగా భావిస్తున్న ఇసుక వ్యాపారిని శుక్రవారం విశాఖపట్నం పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది. చీమకుర్తిలో స్కూటీ దొరకగానే నిందితులు ఎవరు అనేది పసిగట్టిన పోలీసులు హత్యకు కాంట్రాక్టు తీసుకుంది అతనే అని గుర్తించారు. దీంతో విశాఖపట్నంలో ఉన్నట్లు గుర్తించి అక్కడ పోలీసులను అప్రమత్తం చేశారు. ఒంగోలు నుంచి విశాఖపట్నం ఓ బృందం బయలుదేరి వెళ్లింది. అదే సమయంలో అతనితోపాటు పాల్గొన్న ముగ్గురి కోసం కూడా పోలీసులు గాలిస్తున్నారు. ఇసుక వ్యాపారిని విచారణ చేస్తే పూర్తిగా సమాచారం బయటకు వచ్చే అవకాశం ఉంది.

మాఫియాలే మట్టుబెట్టాయి

(3వ పేజీ తరువాయి)

లావాదేవీలపై కూడా దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈనేపథ్యంలో శుక్రవారం చీమకుర్తికి సమీపంలోని బైపాస్ కూడలి వద్ద రక్తపు మరకలు పడి ఉన్న స్కూటీని స్థానికులు గుర్తించారు. ఒకరు ఇచ్చిన సమాచారంతో పోలీసులు అక్కడికి వెళ్లారు. స్కూటీని స్వాధీనం చేసుకున్నారు. దర్యాప్తులో ఇది కీలకంగా మారింది. దాని ఆధారంగా అనేక అంశాలు వెలుగులోకి వచ్చాయి.

గ్రామస్థుల పాత్ర ఉన్నట్లు గుర్తింపు

దర్యాప్తులో భాగంగా అప్పటికే అదుపులో ఉన్న అమ్మనబ్రోలుకు చెందిన యువకుడి పాత్ర ఉండవచ్చన్న అనుమానంతో విచారణ కొనసాగించారు. పోలీసులకు దొరికిన స్కూటీ అతనికి సుపరిచితుడైన ఇసుక వ్యాపారిదిగా వెల్లడైనట్లు తెలిసింది. ఈయన ఒంగోలు అన్నవరప్పాడు ప్రాంతానికి చెందినవ్యక్తి. గతంలో అమ్మనబ్రోలుకు చెందిన యువకుడికి గ్రావెల్, ఇసుక రవాణా చేసే లారీలు ఉండేవని అప్పటి నుంచి ఇసుక వ్యాపారితో సత్సంబంధాలు ఉన్నాయని పోలీసులు గుర్తించినట్లు తెలిసింది. వెంటనే ఇసుక వ్యాపారి కోసం పోలీసులు గాలింపు చేపట్టగా అతను అజ్ఞాతంలో ఉన్నట్లు వెల్లడైంది. మరోవైపు అమ్మనబ్రోలులో ఆది నుంచి వీరయ్యతో శతృత్వం ఉన్న మరికొందరిని కూడా అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

మాఫియా పాత్ర తోడైందా?

నిందితులకు నాగులుప్పలపాడు మండలంలో వీరయ్యకు రాజకీయ విరోధిగా ఉండి రేషన్ మాఫియా చేస్తున్న రౌడీషీటర్ సహకారం కూడా లభించిందన్న అంశంపై పోలీసులు మరోసారి విచారణ చేపట్టారు. ఇటు గ్రామంలోని విరోధులతోపాటు ఒంగోలులో ఇసుక వ్యాపారి లాంటి వారి సహకారం వెల్లడవడంతో అదే తరహాలో హతుడు వీరయ్యకు రాజకీయ విరోధిగా ఉన్న రేషన్ మాఫియా డాన్ పాత్రను కూడా పరిగణనలోకి తీసుకుని అనేక అంశాలను రాబడుతున్నట్లు సమాచారం. ఇసుక, రేషన్ మాఫియాల మధ్య గత కొద్దిరోజులుగా జరుగుతున్న సంభాషణలను పసిగట్టేందుకు కాల్ డేటాను కూడా పరిశీలించారు. వారందరి మధ్య వందల ఫోన్‌కాల్స్ నమోదైనట్లు కూడా పోలీసులు గుర్తించినట్లు తెలిసింది.

ఆర్థిక సహకారంపై ఆరా

ప్రాథమిక సమాచారం తేటతెల్లమవడంతో ఈ హత్యకు సంబంధించి ఆర్థిక సహకారం ఎవరైనా ఇచ్చారా అన్న అంశంపై కూడా పోలీసులు దృష్టి సారించారు. నలుగురిలో ఇద్దరు కిరాయి హంతకులైనట్లు పోలీసులు బలంగా నమ్ముతున్నారు. రాత్రి 7.40 కల్లా హత్య చేసిన వారు 8 గంటలకల్లా స్కూటీపై చీమకుర్తి బైపాస్ వద్దకు చేరుకున్నారు. స్కూటీని అక్కడ వదిలి బస్‌లో ఇతర ప్రాంతానికి వెళ్లినట్లు ప్రాథమికంగా గుర్తించారు. అందులో ఇద్దరు విజయవాడ నుంచి వెళ్తున్న కనిగిరి బస్ ఎక్కి కనిగిరిలో దిగారని అక్కడి నుంచి వేరే ప్రాంతాలకు వెళ్లారని నిర్ధారించుకున్నారు. ఆ ఇద్దరినీ కిరాయి హంతకులుగా భావించి వారికోసం ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపారు. ఇటు కిరాయి హంతకులకు, ఇతర అవసరాలకు పెద్దమొత్తంలో డబ్బు వెచ్చించినట్లు గుర్తించిన పోలీసులు ఆర్థిక సహకారం ఎవరు ఇచ్చి ఉంటారన్న కోణంలో మరో దర్యాప్తు చేపట్టారు. అదే మండలానికి చెంది హైదరాబాద్‌లో ఉంటున్న ఒక సంపన్నుడి సహకారం కూడా ఉండి ఉండవచ్చన్న అనుమానంతో పోలీసులు హైదరాబాద్‌లో కూడా దర్యాప్తు చేపట్టారు. స్థానికంగా వీరయ్యతో ఉన్న వైషమ్యాలను దృష్టిలో ఉంచుకుని ఆ వైపు నుంచి దర్యాప్తు చేస్తున్నారు. ఇదేసమయంలో కొద్దిరోజులుగా అమ్మనబ్రోలు ప్రాంతంలో వీరయ్యకు ప్రమాదం పొంచి ఉందన్న నానుడి కొందరి మధ్య నలిగినట్లుగా పోలీసులు గుర్తించారు. గ్రామానికి సంబంధించిన ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన సంభాషణ ఆడియోను పోలీసులు రాబట్టుకున్నట్లు కూడా సమాచారం. ఆ కోణంలో అమ్మనబ్రోలుకు చెందిన మరో ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. సంఘటన జరిగిన రోజు అమ్మనబ్రోలుకు చెందిన యువకుడు, ఇతర అనుమానితులు ఒంగోలులోనే ఉండటం, ఇసుక వ్యాపారి అజ్ఞాతంలోకి వెళ్లడాన్ని పోలీసులు ప్రత్యేకంగా పరిగణనలోకి తీసుకున్నారు. కిరాయి హంతకులను మాట్లాడటం, ఇతర వ్యవహారాలలో ఇసుక వ్యాపారి పాత్ర ఉండవచ్చన్న అనుమానంతో ఒక పోలీసు బృందం దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది.

దశాబ్దకాలం నుంచి వైషమ్యాలు

అమ్మనబ్రోలులో ప్రస్తుత అనుమానితులు యువకుడి కుటుంబం, హతుడు వీరయ్యల మధ్య ఆది నుంచి రాజకీయ వైరం ఉన్నట్లు తెలిసింది. యువకుడి తండ్రి కూడా ఆరంభంలో మాజీ ఎమ్మెల్యే ఈదర హరిబాబు వర్గంలోనే ఉండేవారు. పీపీసీఎస్, పాలకేంద్రం అధ్యక్షుడిగా కూడా పనిచేశారు. ఆ తర్వాత టీడీపీలో వీరయ్యపాత్ర గణనీయంగా పెరిగింది. అప్పటి నుంచి ఇద్దరి మధ్య క్రమేపీ వైషమ్యాలు పెరిగాయి. 2014 నుంచి వీరయ్య గ్రామంలోనే గాక మండల స్థాయిలో టీడీపీ పెత్తనాన్ని అందిపుచ్చుకున్నారు. ఆ కోవలోనే ఉప్పుగుండూరుకు చెందిన రేషన్ మాఫియా నాయకుడు టీడీపీ నుంచి వెళ్లి వైసీపీలో చేరి గత ప్రభుత్వంలో పెత్తనం చెలాయించారు. గ్రామంలోని వీరయ్య వ్యతిరేకులను టీడీపీ పక్కన పెట్టింది. రౌడీషీటర్‌గా ఉన్న వైసీపీ నాయకుడు ఇటీవల టీడీపీలో చేరే ప్రయత్నాలు చేయగా వీరయ్య అడ్డుకున్నారు. అలాగే టీడీపీ అధినాయకత్వంతో వీరయ్యకు పూర్తిసంబంధాలు ఏర్పడ్డాయి. పైగా జిల్లా స్థాయి పదవిని చేపట్టబోతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ దశలో వీరయ్యను హతమార్చడానికి ఇటు రాజకీయ వైషమ్యాలతోపాటు ఆయన ఎదుగుదలపై ఈర్ష్య కూడా కారణమై ఉండవచ్చని పోలీసులు అంచనా వేస్తున్నారు. కాగా అమ్మనబ్రోలుకు చెందిన యువకుడి సతీమణి అమెరికాలో ఉంటారు. గత కొంతకాలంగా తాను కూడా అమెరికా వెళ్తున్నట్లు ఆయన సన్నిహితులకు చెప్పినట్లు పోలీసులు తెలుసుకున్నారు. శుక్రవారం పోలీసులు పరిశీలన చేయగా ఈనెల 29న యువకుడు అమెరికా వెళ్లేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్లు వెల్లడైంది.

గ్రామంలో పోలీసు పికెట్

తాజా సమాచారంతో గ్రామంలో వీరయ్య అభిమానులు ప్రత్యర్థులపై తిరగబడవచ్చన్న అనుమానంతో అమ్మనబ్రోలులోను, ఆ మండలంలోను పోలీసులు పికెట్లు ఏర్పాటు చేశారు. ఎస్పీ స్వయంగా ఆ గ్రామానికి వెళ్లి సమీక్ష చేస్తున్నారు.

భవిష్యత్ కోసం బాగు

(3వ పేజీ తరువాయి)

ప్రాంతం. ఎలాంటి పక్కా నీటి పారుదల వ్యవస్థలు లేవు. రాష్ట్రంలోనే అత్యంత వెనుకబడిన ఇలాంటి డివిజన్‌పై కనికరం కూడా చూపలేదు వైసీపీ ప్రభుత్వం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే కీలకమైన కొన్ని చెరువులకు ఎస్‌డీఎంఎఫ్ పథకం ద్వారా రూ.1.52 కోట్ల నిధులు విడుదల చేసింది. అంతేకాక ఓఅండ్‌ఎం ద్వారా డివిజన్‌లోని అన్ని చెరువులకు మరమ్మతులు, కాలువల ఆధునికీకరణ తదితర పనులకు రూ.5.15 కోట్లు కేటాయించింది. ఆయా పనులు త్వరలోనే ప్రారంభంకానున్నాయి.

పనులు త్వరగా పూర్తిచేస్తేనే భద్రత

మార్కాపురం ఇరిగేషన్ డివిజన్ పరిధిలో మొత్తం 411 చెరువులు ఉన్నాయి. మొత్తం ఆయకట్టు 60,951 ఎకరాలు ఉంది. ఎంఐ (మైనర్ ఇరిగేషన్) కింద 119, పీఆర్ చెరువులు 292 ఉన్నాయి. మార్కాపురం, ఎర్రగొండపాలెం, గిద్దలూరు, కంభం ఇరిగేషన్ సబ్ డివిజన్‌లు ఉన్నాయి. వాటిల్లో ప్రధానమైన 31 చెరువులకు సంబంధించి గత సంవత్సరం అక్టోబరులోనే ఎస్‌డీఎంఎఫ్ స్కీం కింద రూ.1.52 కోట్లు కేటాయించారు. ఈ పనుల్లో ఇప్పటి వరకూ రూ.కోటి మేర పనులు పూర్తయ్యాయి. ఇంకా రూ.52 లక్షల మేర జరుగుతున్నాయి. ఓఅండ్‌ఎం కింద దాదాపు ప్రతి చెరువుకూ నిర్వహణ పనుల కోసం రూ.5.15 కోట్లు మంజూరయ్యాయి. వాటి ద్వారా చెరువు కట్టల సామర్థ్యాన్ని పెంపొందించడం, అలుగులు, తూములు, కాలువలకు మరమ్మతుల పనులు చేయడం ప్రధానమైనవి. ఇవి త్వరలోనే ప్రారంభం కావాల్సి ఉంది. మే, జూన్‌లలో కూడా వర్షాలు కురిసే అవకాశాలు ఉంటాయి. ఈ లోపుగా పనులు పూర్తి చేస్తే చెరువుల్లో నీరు చేరేందుకు అవకాశం ఏర్పడుతుంది. వర్షాకాలం ప్రారంభమయ్యే నాటికి పనులు పూర్తయితేనే నిధుల విడుదల చేసినందుకు సార్థకత ఉంటుంది. ప్రస్తుతం కేటాయించిన నిధులేకాక త్వరలోనే ఓఅండ్‌ఎం కింద రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ నిధులు విడుదల చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే ప్రధానమైన చెరువులకు సంబంధించి పెద్దపాటి పనులకు ప్రతిపాదనలు కూడా ఇరిగేషన్‌శాఖ ఉన్నతాధికారులకు పంపారు. గతంతో పోలిస్తే ఇరిగేషన్‌శాఖకు తగినన్ని నిధులు ప్రభుత్వం కేటాయిస్తున్నందున చెరువుల అభివృద్ధి పనులు యంత్రాంగం త్వరగా పూర్తి చేయాల్సి ఉంది.

ఉగ్రదాడిపై

వెల్లువెత్తిన నిరసనలు

(3వ పేజీ తరువాయి)

గాయాలయ్యాయి. ఉగ్రవాదుల చర్యను ఖండిస్తూ జిల్లాలో పెద్దఎత్తున రెండు రోజులుగా నిరసనలు జరుగుతున్నాయి. శుక్రవారం కూడా జిల్లాలోని వివిధ ప్రాంతాలలో ఉగ్రదాడులను వ్యతిరేకిస్తూ శాంతి ర్యాలీలను విభిన్నవర్గాల ప్రజలు నిర్వహించారు.

జనసేన ఆధ్వర్యంలో మానవహారం

ఒంగోలులో జనసేన ఆధ్వర్యంలో చర్చిసెంటర్ వద్ద భారీ మానవహారం ఏర్పాటు చేశారు. అంతకుముందు నగరంలో జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. జనసేన నాయకులు షేక్ రియాజ్, కంది రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు. జిల్లా కోర్టులో న్యాయవాదులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. బార్ అసోసియేషన్ ప్రతినిధులు ఎన్.మోహన్‌దాస్, బొడ్డు భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో నగరంలో క్యాండిల్స్‌తో ర్యాలీ చేపట్టారు. మరోవైపు ఉగ్ర దాడులను ఖండిస్తూ జిల్లావ్యాప్తంగా ముస్లింలు నల్లబ్యాడ్జీలు ధరించి ప్రార్థనలకు హాజరయ్యారు. మార్కాపురం, కంభం, పొదిలిలతోపాటు పలు ఇతర ప్రాంతాలలో శాంతి ర్యాలీలు నిర్వహించారు. పామూరు, మార్కాపురంతోపాటు పలు ఇతర ప్రాంతాలలోనూ జనసేన, వామపక్షాలు నిరసన ర్యాలీలు చేపట్టారు. ఉగ్ర దాడిలో విశాఖకు చెందిన జె.ఎస్.చంద్రమౌళి మృతిచెందిన విషయం విదితమే. ఆయన అంత్యక్రియలు శుక్రవారం విశాఖలో నిర్వహించగా ఆ జిల్లాకు ఇన్‌చార్జ్ మంత్రిగా ఉన్న మన జిల్లాకు చెందిన మంత్రి డాక్టర్ స్వామి పాల్గొన్నారు.

ప్రభుత్వంపై పెట్టుకున్న ఆశలను నేరవేర్చాలి

- రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్స్ వెంటనే చెల్లించాలి
- రెవెన్యూ ఉద్యోగులు పారదర్శకంగా పనిచేసేందుకు సదుపాయాలు కల్పించాలి
- ఏపీఆర్‌ఎస్‌ఏ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు



సమావేశంలో మాట్లాడుతున్న బొప్పరాజు వెంకటేశ్వర్లు

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ పాలనలో ఉద్యోగులు ఆర్థిక విషయాల్లో అనేక విధాలుగా ఇబ్బందులు పడి కూటమి ప్రభుత్వంపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారని, వాటిని అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఏపీఆర్ ఎస్‌ఏ రాష్ట్ర అధ్యక్షుడు, జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు కోరారు. ఒంగోలులో శుక్రవారం జేఏసీ సమావేశం, తహసీల్దార్ల సమన్వయ సమావేశంలో పాల్గొనేందుకు వచ్చిన ఆయన స్థానిక రెవెన్యూ భవన్‌లో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. గత టీడీపీ ప్రభుత్వంలో రిటైర్డ్ అయిన ఉద్యోగులకు అదేరోజున బెనిఫిట్స్ ఇవ్వడంతోపాటు సన్మానించి ప్రభుత్వ వాహనంలో ఇంటికి తీసుకుపోవాలని ఉత్తర్వులు జారీచేసిందన్నారు. కానీ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అటువంటి పరిస్థితి లేకుండాపోయిందన్నారు రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల మంది రిటైర్డ్ ఉద్యోగులు ఉన్నారని తెలిపారు. ప్రస్తుతం వారి పరిస్థితి మరింత అధ్వానంగా ఉందని తెలిపారు. వారికి రావాల్సిన బెనిఫిట్స్‌తోపాటు హెల్త్‌కార్డులు ఇవ్వాలని కోరారు. హెల్త్‌కార్డులు ఇవ్వని పక్షంలో రీయింబర్స్‌మెంట్ చెల్లించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలో రిటైర్డ్ ఉద్యోగులకు 70 ఏళ్ల నిండితే పదిశాతం, 75ఏళ్లు నిండితే 15శాతం అదనపు పింఛన్లు ఇచ్చేవారన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అదనపు పింఛన్లలో కూడా కోతపెట్టారన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో అనేక ఇబ్బందులు పడ్డ ఉద్యోగులు కూటమి ప్రభుత్వం వస్తే తమకు న్యాయం జరుగుతుందని మద్దతుగా నిలిచారని తెలిపారు. అయితే ప్రస్తుతం రిటైర్డ్ ఉద్యోగులకు బకాయిలు రాకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రెవెన్యూ ఉద్యోగులు రాష్ట్రప్రభుత్వం ఆశయాలకు అనుగుణంగా పనిచేసే విధంగా సమాయత్తం చేసేందుకు అన్ని ఉమ్మడి జిల్లాల్లో తహసీల్దార్లతో సమన్వయ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులోభాగంగానే శుక్రవారం ఒంగోలులో ఉమ్మడి జిల్లాలోని తహసీల్దార్లతో సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తహసీల్దార్లు జవాబుదారితనంగా పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అయితే ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలంటే అందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు. రీసర్వే నిర్వహించేందుకు సదుపాయాలు, ఆర్థిక అంశాలను ఇవ్వాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రోటోకాల్‌కు కూడా బడ్జెట్ లేని కారణంగా తహసీల్దార్లు అప్పులు చేసి పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి రాజేష్, రెవెన్యూ అసోసియేషన్, జేఏసీ నాయకులు పిన్నిక మధుసూదనరావు, ఆర్.వాసుదేవరావు, ఊతకోలు శ్రీనివాసులు, టి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సాంఘిక సంక్షేమశాఖ డీడీ ఎన్.లక్ష్మానాయక్

వసతి గృహాల్లో నూరు శాతం విద్యార్థులను చేర్చాలి

- సాంఘిక సంక్షేమశాఖ డీడీ లక్ష్మానాయక్

ఒంగోలు నగరం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): వచ్చే విద్యా సంవత్సరంలో జిల్లాలోని అన్ని సాంఘిక సంక్షేమశాఖ వసతి గృహాల్లో నూరుశాతం విద్యార్థులను చేర్చే విధంగా కృషి చేయాలని జిల్లా సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎన్.లక్ష్మానాయక్ అన్నారు. శుక్రవారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో జిల్లాలోని సహాయ సాంఘిక సంక్షేమశాఖాధికారులు, వసతిగృహాల సంక్షేమాధికారులతో లక్ష్మానాయక్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ వచ్చే విద్యా సంవత్సరంలో అన్ని వసతిగృహాల్లో ప్రభుత్వం కేటాయించిన సీట్లన్నీ భర్తీ అయ్యేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. వసతిగృహాల సంక్షేమాధికారులు, వసతిగృహాల్లో పనిచేసే నాలుగవ తరగతి ఉద్యోగులు వసతి గృహం పరిధిలోని గ్రామాల్లో పర్యటించి విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడాలన్నారు. ఈ ఏడాది విడుదలైన ఇంటర్, పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో అత్యధిక మార్కులను సాధించిన విద్యార్థులను అభినందించారు. పరీక్షల్లో ఉత్తీర్ణులైనవారు భవిష్యత్‌లో ఏ చదువులు చదవాలి, వారు కోరుకున్న లక్ష్యాన్ని చేరుకునే దిశగా ఎలాంటి కోర్సుల్లో చేరాలనే దిశగా విద్యార్థులకు దిశానిర్దేశం చేయాలని ఆయన కోరారు. వసతిగృహాల్లో చదువుకుని ఇంటర్‌లో 900, పదవ తరగతిలో 500లకుపైగా మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు. పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులు సాంఘిక సంక్షేమశాఖ రెసిడెన్షియల్ పాఠశాలలో చేరే విధంగా సహాయ సాంఘిక సంక్షేమశాఖ అధికారులు విద్యార్థులను చైతన్యం చేయాలని లక్ష్మానాయక్ కోరారు.

హంతకుల ఆచూకీ తెలిపిన స్కూటర్

- చీమకుర్తి తూర్పు బైపాస్ జంక్షన్ వద్ద దాబా ముందు పార్కింగ్
- హత్య జరిగిన రోజు రాత్రి 8.14 గంటలకు వదిలేసిన నిందితులు
- మూడ్రోజులుగా రక్తపు మరకలతో అక్కడే వాహనం
- పక్కనే ఉన్నా గుర్తించని పోలీసులు

చీమకుర్తి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నేత ముప్పవరపు వీరయ్యచౌదరి హత్యకేసులో ఒక్క ఆధారం కూడా దొరక్క తీవ్ర ఒత్తిడిలో ఉన్న పోలీసులకు ఉపశమనం లభించింది. శుక్రవారం చీమకుర్తి తూర్పు బైపాస్ జంక్షన్ వద్ద ఉన్న ఒక దాబా ముందు పార్కు చేసిన స్కూటర్ హంతకుల ఆచూకీని కనుగొనటానికి కీలక ఆధారంగా మారింది. రక్తపు మరకలతో ఉన్న స్కూటర్ మూడు రోజులుగా అక్కడే పార్కు చేసి ఉండటంతో అక్కడ పనిచేసే ఒకవ్యక్తి హైవే మొబైల్ టీం పోలీసులకు శుక్రవారం ఉదయం సమాచారం ఇచ్చాడు. క్లూస్‌టీం, డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ సుబ్బారావు కేసు దర్యాప్తులో ఉన్న బృంద సభ్యులు స్కూటర్ పార్కింగ్ చేసిన ప్రదేశానికి హుటాహుటిన వచ్చారు. పక్కనే ఉన్న దాబా, దుకాణాల్లో ఉన్న సీసీ కెమెరాల పుటేజీని పరిశీలించారు. అక్కడ పనిచేసే వారిని విచారించారు. స్కూటర్ వద్ద క్లూస్, ఫింగర్ ప్రింట్లను సేకరించిన అనంతరం తొలుత చీమకుర్తి, తదుపరి ఒంగోలు స్టేషన్‌కు తరలించారు. హత్య జరిగిన రోజు రాత్రి 8.14 నిమిషాల సమయంలో ఇద్దరు వ్యక్తులు దాబా ఎదురు హడావుడిగా పార్కుచేసి అప్పుడే ఒంగోలు నుంచి పొదిలికి వెళ్తున్న ఆర్టీసీ బస్ ఎక్కటం స్పష్టంగా సీసీ పుటేజీలో కనిపించింది. స్కూటర్ నంబర్ ఆధారంగా ఓనర్ ఒంగోలు వాసిగా గుర్తించారు. అతన్ని విచారించగా తాను వేరే వ్యక్తికి అమ్మినట్లు చెప్పారు. కొనుగోలు చేసిన వ్యక్తిని గుర్తించటంతో మర్డర్ వెనుక మిస్టరీ దాదాపు వీడిపోయింది. స్కూటర్‌ని చీమకుర్తిలో పార్కింగ్ చేసి బస్‌లో ఉడాయించిన ఇద్దరు వ్యక్తులే నిందితులని భావించి వారికోసం గాలింపు చర్యలు చేపట్టారు.



బైపాస్ జంక్షన్ వద్ద ఉన్న దాబా (సర్కిల్‌లో) రోడ్‌పై ఎదురుగా ఉన్న సీసీ కెమెరాల పోల్

● పోలీసులను చూసి బస్సెక్కిన నిందితులు

హైవే పెట్రోలింగ్ కోసం ఒక వాహనం, 24 గంటలు పాటు విధులు నిర్వర్తించటానికి సిబ్బందిని కేటాయించారు. వీరు తమ వాహనాన్ని ఎప్పుడూ బైపాస్ జంక్షన్ వద్ద ఉన్న దాబా ఎదుటే నిలుపుకొని ఉండి అవసరమైనపుడు రౌండ్లు వేస్తూ ఉంటారు. హత్య జరిగిన రోజు రాత్రి హంతకులు ఒంగోలు నుంచి నేరుగా చీమకుర్తి వైపునకు వస్తూ అక్కడే ఉన్న పెట్రోలింగ్ వాహనాన్ని, పోలీసులను చూసి కంగారుపడ్డారు. హత్య విషయం తెలిసి పోలీసులు తనిఖీలు చేస్తున్నారేమోనని అనుకున్న నిందితులు అప్పటికప్పుడు వారి దిశను మార్చుకున్నారు. వెంటనే హంతకులు అలర్ట్ అయి దాబా బోర్డు పక్కనే పార్కింగ్ చేసి అప్పుడే ఒంగోలు నుంచి వస్తున్న పొదిలి బస్సు ఎక్కి ఉడాయించినట్లు పోలీసులు భావిస్తున్నారు.

అమ్మనబ్రోలులో ఏం జరుగుతోంది?

నాగులుప్పలపాడు, ఏప్రిల్ 25 : ఒంగోలులోని తన కార్యాలయంలో దారుణహత్యకు గురైన మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్య చౌదరి స్వగ్రామమైన అమ్మనబ్రోలులో శుక్రవారం సాయంత్రం నుంచి పోలీసు గస్తీ తీవ్రమైంది. ఎస్పీ దామోదర్ స్వయంగా అమ్మనబ్రోలు గ్రామానికి చేరుకొని వీరయ్య చౌదరి కుటుంబ సభ్యులతో సుమారు రెండు గంటల పాటు మాట్లాడారు. హత్యకు దారితీసిన పరిస్థితులు ఏమై ఉంటాయోనని ఆయన విచారించారు. అదే సమయంలో గ్రామానికి ప్రత్యేక పోలీసు బలగాలు చేరుకున్నాయి. గ్రామంలోని ప్రతి వీధిలో నిఘా ఉంచారు. ఒక్కసారిగా పోలీసు బలగాలు అమ్మనబ్రోలు గ్రామానికి పెద్దఎత్తున చేరుకోవడంతో ఏం జరుగుతుందోననే గ్రామస్థుల్లో ఆందోళన నెలకొంది.

గ్రామానికి చెందిన వ్యక్తే కీలక సూత్రధారి

వీరయ్య చౌదరి హత్య నేపథ్యంలో గ్రామానికి చెందిన యువ నాయకుడు హత్యోదంతానికి కీలకంగా వ్యవహరించి ప్రధాన నిందితుడిగా ఉన్నట్లు పోలీసు వర్గాలు భావిస్తున్నాయి. ఆ యువ నాయకుడికి, వీరయ్య చౌదరికి మధ్య లిక్కర్ వ్యాపారాల్లో తారాస్థాయిలో విబేధాలు తలెత్తి హత్యకు దారితీసి ఉండొచ్చని పోలీసు వర్గాలు ఇప్పటికే ఒక అంచనాకు వచ్చినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో వీరయ్య చౌదరి హత్యకు ప్రధాన కారణంగా భావిస్తున్న ఆ యువ నాయకుడు హత్యోదంతంలో కీలక పాత్ర పోషించినట్లు అమ్మనబ్రోలులో చర్చ నడుస్తోంది. ఈ నేపథ్యంలో వీరయ్య చౌదరి వర్గీయులు ఆగ్రహావేశాలతో ఉన్నట్లుగా పోలీసు వర్గాలకు సమాచారం చేరడంతో గ్రామంలో ప్రత్యేక బలగాలను మోహరించారు. ఎస్పీ ఏఆర్ దామోదర్ సైతం అమ్మనబ్రోలు చేరుకొని పరిస్థితిని పర్యవేక్షించారు. ఎస్పీ వెంట ఒంగోలు రూరల్ సీఐ శ్రీకాంత్, ఎస్ఐ శ్రీకాంత్ ఉన్నారు. వీరంతా వీరయ్య చౌదరి హత్య కేసులో నిందితుల కోసం జల్లెడ పడుతున్నారు.



సీఆర్‌పీ క్వార్టర్స్ పార్కులో ఊడిపోయి ఉన్న ఊయల

ఆటవిడుపునకు ఆపసోపాలు!

- పార్కుల్లో సౌకర్యాల కొరత ● గాలికి వదిలేసిన గత ప్రభుత్వం
- కనిపించని ఆహ్లాదం ● ఈ ప్రభుత్వం దృష్టి పెడితేనే గత వైభవం

ఒంగోలు కార్పొరేషన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : ఐదేళ్ల వైసీపీ పాలనలో ఆహ్లాదం ఆవిరైంది. పట్టణాల ప్రగతిని పట్టించుకోని ప్రభుత్వం పిల్లల ఆటలపైనా నిర్లక్ష్యం చూపింది. ఐదేళ్ల నుంచి పార్కుల్లో సందడి కరువైంది. ఈనెల 23వ తేదీ నుంచి వేసవి సెలవులు రావడంతో పిల్లలతో కలిసి కాసేపు సరదాగా గడిపేందుకు ఒంగోలులో ఒక్కటైనా సరైన పార్కు లేకుండాపోయింది. ఉన్న పార్కుల్లో కనీస వసతులు కరువయ్యాయి. ప్రస్తుత ప్రభుత్వమైనా స్పందించి పార్కుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాల్సి ఉంది.

గత టీడీపీ ప్రభుత్వంలో ఆహ్లాదం..

గతంలో టీడీపీ ప్రభుత్వంలో పార్కుల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించారు. ప్రతి ఆదివారం హ్యాపీ సండే నిర్వహించారు. పిల్లలు, పెద్దలతో కలిపి సందడి వాతావరణం కనిపించేది. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేవారు. గాంధీ పార్కులో సినిమాలు కూడా ప్రదర్శించేవారు. సాయంత్రం సమయంలో పార్కులో కూర్చుని నగర ప్రజలు సేదతీరేవారు. బోట్‌క్లబ్.. అందమైన పచ్చని మొక్కలు, వినోదాలకు కొదవ ఉండేది కాదు. కుటుంబ సమేతంగా కూర్చుని సరదాగా గడిపేవారు. అయితే వైసీపీ ప్రభుత్వంలో సినిమాల ప్రదర్శన ఆపేశారు. క్యాంటిన్ మూసేశారు. బోట్‌క్లబ్ సంగతే మరిచిపోయారు. ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడి పది నెలలైంది. ఈ కొద్ది కాలంలోనే కొన్ని పార్కులను బాగు చేశారు. మరికొన్ని పార్కుల్లో ఆట పరికరాల మరమ్మతులు చేయాల్సి ఉంది.

పట్టించుకుంటే పిల్లలకు ఆనందమే

నగరంలోని మొత్తం దాదాపు 26 పార్కుల వరకు ఉన్నాయి. వాటిలో సగానికిపైగా నిరుపయోగంగా ఉన్నాయి. పలు పార్కుల్లో పచ్చదనం కరువయింది. ఆ ప్రాంతవాసులు అరకొర ఆట వస్తువులతోనే వేసవి గడిపేస్తున్నారు. నగరంలోని అన్నవరప్పాడులోని పార్కు నిర్మాణంచేసి పదేళ్లకుపైగా కావస్తుండగా నేటికీ ప్రజలకు పెద్దగా ఉపయోగపడటం లేదు. సంతపేటలోని నాటు బాబురావు పార్కులో పచ్చదనం కొంత పర్వాలేదనిపించినా, పిల్లల ఆట వస్తువులు మాత్రం ఉపయోగపడటం లేదు. తుప్పుపట్టి, విరిగిపోయి, నేడో రేపో పడిపోయేందుకు సిద్ధంగా ఉన్న వస్తువులే కనిపిస్తున్నాయి. రోజూ సాయంత్రం వేళలో దాదాపు 200 మందిపైగా పిల్లలు, పెద్దలు, యువత, కుటుంబ సభ్యులతో కలిసి వస్తుంటారు. కానీ పార్కుల్లో మౌలిక వసతులు కరువయ్యాయి. నగరంలోని స్థానిక నిర్మల్ నగర్, గద్దలగుంట, పార్కుల్లో స్థానికుల పర్యవేక్షణలో కమిటీలు ఏర్పడ్డాయి. దీంతో కొంతమేర ఆ పార్కులు బాగున్నాయి. అయితే అవి అక్కడి ప్రాంత వాసులకే ఉపయోగపడుతున్నాయి. దేవుడు చెరువు పార్కుదీ ఇదే పరిస్థితి. ఈ పార్కులపై నగర పాలక సంస్థ దృష్టి పెట్టి అభివృద్ధి చేయాలని నగర ప్రజలు కోరుతున్నారు.



నాటు బాబూరావు పార్కులో వెలగని బల్బు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి

- అధికారులకు కలెక్టర్ అన్సారియా ఆదేశం

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా దేశించారు. జూన్‌లో రాష్ట్ర వ్యాప్తంగా మూడులక్షల గృహాలకు సామూహిక గృహ ప్రవేశాలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో నిర్దేశించిన 8,839 గృహ నిర్మాణాలను మే 31 నాటికి పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ సమావేశపు హాలులో శుక్రవారం మునిసిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, గృహ నిర్మాణశాఖ అధికారులతో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో ఇప్పటివరకు 2,824 గృహ నిర్మాణాలు మాత్రమే పూర్తి చేసి 32 శాతం లక్ష్యాన్ని సాధించారన్నారు. ఇంకా 6015 ఇళ్లు నిర్మించాల్సి ఉందన్నారు. ఈ సమావేశంలో హౌసింగ్ పీడీ శ్రీనివాసప్రసాద్, మెప్మా పీడీ, మునిసిపల్ కమిషనర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



మలేరియా అంతానికి ప్రతిజ్ఞ చేస్తున్నకలెక్టర్, ఇతర అధికారులు

ఉపాధిలో అలసత్వం వహిస్తే చర్యలు

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టే పనుల పురోగతి అమలులో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ తమీమ్ అన్సారియా హెచ్చరించారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ సమావేశపుహాలులో శుక్రవారం ఎంపీడీవోలు, డ్వామా అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఉపాధి పనులు చేపట్టేందుకు వేసవి కాలం అనుకూలమైనందున పనుల్లో స్పష్టమైన పురోగతి కనిపించేలా క్షేత్రస్థాయిలో అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. త్రిపురాంతకం, ముండ్లమూరు, తాళ్లూరు, హనుమంతునిపాడు, గిద్దలూరు మండలాల్లో లక్ష్య సాధనలో వెనుకబడి ఉన్నారని తెలిపారు. సంబంధిత ఎంపీడీవోలు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కూలీలకు రోజువారీసగటు వేతనం రూ.307కు తగ్గకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పుల్లలచెరువు, పెద్దారవీడు, దోర్నాల, దొనకొండ, పామూరు, జరుగుమల్లి, పిసిపల్లి, తాళ్లూరు, వైపాలెం, అర్ధవీడు మండలాల్లో గతవారం కంటే ఈ వారం కూలీలకు రోజువారి సగటు వేతనం తగ్గిందని, ఈ మండలాల్లో సగటు వేతనం తగ్గడానికి కారణాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ప్రధానమంత్రి సురక్ష బీమాయోజన, జీవనజ్యోతి యోజన పథకాలు ఉపాధి కూలీలకు వర్తించేలా ఎంపీడీవోలు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

మలేరియా నియంత్రణ ప్రతి ఒక్కరి బాధ్యత

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మలేరియా నియంత్రణ ప్రతి ఒక్కరి బాధ్యత అని కలెక్టర్ తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఒంగోలులో ఏర్పాటు చేసిన అవగాహన ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ మలేరియా నియంత్రణ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ మలేరియా వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకే ఈ ర్యాలీ నిర్వహిస్తున్నా మన్నారు. జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మలేరియా నిర్ధారణ సౌకర్యాలు, చికిత్సకు అవసరమైన ఏర్పాట్లు ఉన్నాయని తెలిపారు. ఈ ర్యాలీలో జిల్లా వైద్య ఆరోగ్యశాకాధికారి డాక్టర్ టి. వెంకటేశ్వర్లు, మలేరియా జిల్లా అధికారి డాక్టర్ మదసూదన్‌రావు, ఆశా వర్కర్లు, విద్యార్థులు ఉన్నారు.



వీవోఏల సమావేశంలో మాట్లాడుతున్న వెలుగు, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ నారాయణ

వీవోఏలు పనితీరు మార్చుకోకపోతే చర్యలు

- వెలుగు, డీఆర్‌డీఏ పీడీ నారాయణ

కంభం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): వెలుగు వీవోఏలు తమ పనితీరును మెరుగుపరచుకోవాలని లేకుంటే చర్యలు తప్పవని వెలుగు, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ టి.నారాయణ తెలిపారు. కంభం వేంకటేశ్వర కల్యాణ మండపంలో శుక్రవారం జరిగిన గిద్దలూరు క్లస్టర్ పరిధిలోని 6 మండలాల వీవోఏలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామసంఘాల పరిధిలో సంఘాల గ్రేడింగ్, వీవోఏల ప్రొఫైల్ పైన, స్త్రీనిధి సీఐఎఫ్ ఉన్నతి రికవరీ పైన సమీక్ష జరిగింది. ఒక గ్రామసంఘం పరిధిలో వీవోఏ సమర్థవంతంగా పని చేస్తే కనీసం 1200 మందికి పైగా లబ్ధి చేకూరుతుందని, పని చేయక పోతే ఆ కుటుంబాలు నష్టపోతాయన్నారు. వీవోఏలు సమావేశాలు సక్రమంగా నిర్వహించడం లేదని, హాజరుశాతం తక్కువగా ఉందని, పుస్తక నిర్వహణ సక్రమంగా లేదని ఆయన తెలిపారు. అన్ని పనులు సక్రమంగా జరిగేలా చూడాలని సూచించారు. మహిళల ఆర్థికాభివృద్ధికి, జీవనోపాదుల మెరుగుకు రుణాలను సకాలంలో అందించాలని తెలిపారు. తిరిగి చెల్లింపులు కూడా సకాలంలో జరగాలని సూచించారు. స్త్రీనిధి ఏజీఎం చార్లెస్ హర్షవర్ధన్ మాట్లాడుతూ స్త్రీనిధి రుణాలు ఇప్పించడం, ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు అందించాలని సూచించారు. ఏరియా కోఆర్డినేటర్ లక్ష్మీరెడ్డి మాట్లాడుతూ ప్రాజెక్టు డైరెక్టర్ సలహాలు, సూచనలు పాటిస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో 6 మండలాల ఏపీఎంలు రమేష్‌బాబు, రఘునాథ్‌బాబు, నరేష్, మాధవి, రామయోగయ్య, గంగాధర్‌రావు, రంగనాయకులు, సీసీలు, అకౌంటెంట్లు పాల్గొన్నారు.

సరస్వతికి ప్రముఖుల నివాళి

చినగంజాం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొనసపూడి గ్రామానికి చెందిన టీడీపీ యువ నాయకులు, లాయిడ్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధినేత విక్రం నారాయణరావు నాయనమ్మ సరస్వతి దశదినకర్మ శుక్రవారం జరిగింది. నారాయణరావు స్వగృహంలో విద్యుత్ శాఖామంత్రి గొట్టిపాటి రవికుమార్, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, సంతనూతలపాడు, చీరాల, మాచర్ల ఎమ్మెల్యేలు బి.ఎన్.విజయకుమార్, ఎం.ఎం.కొండయ్య, జూలకంటి బ్రహ్మానందరెడ్డి, చీరాల మాజీ ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, రాష్ట్ర మాల కార్పొరేషన్ చైర్మన్ పెదపూడి విజయ్‌కుమార్ పాల్గొని, ఆమె చిత్రపటం వద్ద నివాళులర్పించారు. తదనంతరం కుటుంబసభ్యులను పరామర్శించారు. పర్చూరు నియోజకవర్గ పరిధిలోని టీడీపీ మండల అధ్యక్షుడు, మండల తహసీల్దార్ జె.ప్రభాకరరావు, ఎంపీడీవో అద్దంకి శ్రీనివాసమూర్తి, మండలస్థాయి అధికారులు, పలు గ్రామాల సర్పంచ్‌లు పాల్గొని సరస్వతి చిత్రపటం వద్ద నివాళులర్పించారు.



విక్రం సరస్వతి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి రవికుమార్, పర్చూరు, మాచర్ల ఎమ్మెల్యేలు



వసంతోత్సవంలో ఉభయదేవేరులతో చెన్నకేశవుడు

వేడుకగా రెండో రోజు చెన్నుడి వసంతోత్సవం

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మార్కాపురంలోని శ్రీ లక్ష్మీ చెన్నకేశస్వామి ఆలయంలో చెన్నకేశవస్వామికి బ్రహ్మోత్సవాల అనంతరం శుక్రవారం రెండో రోజు వసంతోత్సవాలు వేడుకగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీపతి అప్పనాచార్యులు చెన్నకేశవ స్వామి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం మధ్యరంగ మండపంలో శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేక అలంకరణ చేసి వసంతోత్సవం నిర్వహించారు. అనంతరం నాలుగు మాడవీధులలో నగరోత్సవం నిర్వహించారు. పసుపు, చందనం, సుగంధభరిత ద్రవ్యాలు కలిపి భక్తులపై వసంతం చల్లారు.



ఒంగోలులో పరీక్ష హాలులోకి వెళుతున్న విద్యార్థులు

సజావుగా ఏపీ రెసిడెన్షియల్ ప్రవేశ పరీక్ష

ఒంగోలు విద్య, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఏపీ రెసిడెన్షియల్ విద్యా సంస్థల్లో 2025-26 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు నిర్వహించిన ప్రవేశపరీక్ష సజావుగా సాగింది. ఒంగోలులోని 13 కేంద్రాల్లో శుక్రవారం నిర్వహించారు. ఏపీ రెసిడెన్షియల్ స్కూళ్లలో 5 నుంచి 8వ తరగతి వరకు ప్రవేశాలకు ఉదయం మూడు కేంద్రాల్లో పరీక్ష నిర్వహించారు. 734 మందికిగాను 546 మంది హాజరుకాగా 188 మంది గైర్హాజరయ్యారు. పది కేంద్రాల్లో మధ్యాహ్నం ఏపీఆర్‌జేసీ, ఏపీడీఆర్‌డీసీలలో ప్రవేశాలకు పరీక్షలు నిర్వహించారు. ఏపీఆర్‌జేసీకి 2 200 మందికి 1,866 మంది హాజరు కాగా 334 మంది గైర్హాజరయ్యారు. ఏపీఆర్‌డీసీకి 68 మందికి 60 మంది హాజరు కాగా ఎనిమిది మంది గైర్హాజరయ్యారు.


నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న జనసేన పార్టీ నాయకులు


ఒంగోలులో నివాళులర్పిస్తున్న వీహెచ్‌పీ నాయకులు


లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ

పర్యాటకులపై ఉగ్రవాదుల దాడులు హేయం

మృతులకు పలు పార్టీలు, సంఘాల ఆధ్వర్యంలో సంఘీభావం

కొవ్వొత్తులు వెలిగించి ఘన నివాళులు

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): జమ్మూకశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి చేయడాన్ని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్ ఖండించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ పిలుపు మేరకు ఒంగోలులో శుక్రవారం స్థానిక చర్చి సెంటర్‌లో 300 అడుగుల జాతీయ జెండాతో మృతులకు సంఘీభావంగా మానవహార నిర్వహించారు. ఈ సందర్భంగా రియాజ్ మాట్లాడుతూ ఉగ్రవాదులు పర్యాటకులను బలి తీసుకోవడం దారుణమన్నారు. ఈ దాడి మనదేశం మీద జరిగినట్టే భావించాల్సి ఉందని, ఇలాంటి దాడులకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకుడు కంది రవిశంకర్ మాట్లాడుతూ ఉగ్ర దాడులకు పాల్పడేవారిపై ఉపేక్షించవద్దని కోరారు. కార్యక్రమంలో నాయకులు చిట్టెం ప్రసాద్, వనపర్తి రాంబాబు, ముత్యాల కళ్యాణ్, రాయని రమేష్, బొందిల శ్రీదేవి, పిల్లి రాజేష్, పల్ల ప్రమీల, దండే అనిల్, సున్నా జానకిరామ్, కాసాని వాసు, టి.వెంకట్రావు, బి.వెంకటేశ్వర్లు, గోవింద్ కోమలి, తోట్టెంపూడి ఉష, అసపాటి ఉష, ముంతాజ్, ఇమ్మడిశెట్టి శ్రీను, శీలం నాగేంద్రకుమారి, అల్లూరి శ్రీహరి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పలు సంఘాల ఆధ్వర్యంలో..

- లైన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు సిటిజన్స్, ఒంగోలు ఎలైట్ సిటిజన్స్, లెజెండరీ సిటిజన్స్ల ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ, స్థానిక మంగమూరు రోడ్డు జంక్షన్ వద్ద నుంచి లాయర్‌పేటలోని రైతు బజారు వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు చలవాది శ్రీహరి, రాజేష్, బీ మక్కెన్ని కుమారస్వామి, కూరపాటి రమేష్, పార్థసారథి, బొమ్మిశెట్టి లక్ష్మణ స్వామి, అయ్యప్ప, చందవోలు హరిప్రసాద్ పాల్గొన్నారు.

- సీపీఎం ఆధ్వర్యంలో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడులను వ్యతిరేకిస్తూ స్థానిక సాగర్ సెంటర్‌లో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. జిల్లా కార్యదర్శి ఎస్.కే. మాబు, కార్యవర్గ సభ్యులు జీవీకొండారెడ్డి ఉగ్రవాద దాడుల్లో 28 మంది మృతి చెందడం బాధాకరమన్నారు. దాడులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు, జీరమేష్, కెరమావలి, కాలం సుబ్బారావు, వై.సిద్దయ్య, తంబి శ్రీనివాసులు, జి.ఆదిలక్ష్మి, మహేష్, డి.శ్రీనివాసులు, సుబ్బారావు పాల్గొన్నారు.


కొవ్వొత్తులు వెలిగించి సీపీఎం నాయకుల నిరసన

- జమ్మూకశ్మీర్‌లో కుటుంబ సభ్యులతో ఆనందంగా గడుపుతున్న పర్యాటకులపై విచక్షణారహితంగా కాల్పులు జరిపి 28 మందిని పొట్టన పెట్టుకున్న తీవ్రవాదుల దుశ్చర్యలను ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్.వినోద్ ఖండించారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయం నుంచి రంగారాయుడు చెరువు కట్ట వరకు సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. ఇంతటి దారుణానికి పాల్పడిన కిరాతకులను పట్టుకొని శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా కార్యదర్శి కంకణాల రమాదేవి, జిల్లా కార్యదర్శి బండి వీరస్వామి, విద్యార్థులు పాల్గొన్నారు.


డెమొక్రటిక్ పార్టీ ఆధ్వర్యంలో..

- డెమొక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఒంగోలులోని బిలాల్‌నగర్ సర్కిల్ వద్ద ఉగ్రవాద దాడులను నిరసిస్తూ కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అబ్దుల్‌సత్తార్, పఠాన్ ఖాజావలి, షఫీగి, రియాజ్, బాజి, కరీషా పాల్గొన్నారు.

వీహెచ్‌పీ ఘన నివాళి

ఒంగోలు కల్చరల్: కశ్మీర్‌లోని పెహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిలో మృతిచెందిన అమరులకు శుక్రవారం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఒంగోలు దక్షిణం బజారులోని వేణుగోపాలస్వామి దేవస్థానం వద్ద వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు తూనుగుంట మల్లికార్జునరావు ఆధ్వర్యంలో పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ప్రాంత సత్సంగ్ సోమా సుబ్బారావు మాట్లాడుతూ ఉగ్రవాదుల దుశ్చర్యలను ప్రతి ఒక్కరు ఖండించాలని, కేంద్ర ప్రభుత్వం తక్షణం ఉగ్రవాదులను తుదముట్టించాలన్నారు. కార్యక్రమంలో హిందువులు, వీహెచ్‌పీ నాయకులు పాల్గొన్నారు.

చీమకుర్తిలో..

చీమకుర్తి: పహల్గాంలో అమరులైన వారికి నివాళుల


కొవ్వొత్తులతో ర్యాలీ జరుపుతున్న జనసేన నేతలు

ర్పిస్తూ శుక్రవారం చీమకుర్తిలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు పల్లపు శివప్రసాద్, తాతినేని శ్రీరామ్, వెంకట్రావు, ముత్యాల సురేష్, యాసిన్, రామకృష్ణారెడ్డి, మురళి పాల్గొన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి నివాళులర్పించారు.

బీఎన్ ప్రజాదర్బార్‌కు 60 అర్జీలు

సంతనూతలపాడు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ ఒంగోలులోని తన కార్యాలయంలో శుక్రవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి 60 అర్జీలు అందాయి. అనంతరం ఎమ్మెల్యే బీఎన్ మాట్లాడుతూ ప్రజాదర్బార్‌కు వచ్చిన ప్రజల సమస్యలను అధికారులు సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మద్దిరాల హరిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.


అర్జీలను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

విద్యార్థులకు 'యువ ప్రకాశం' ఇంటర్న్‌షిప్

● కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): యువ ప్రకాశం పేరుతో వేసవిలో నిర్వహిస్తున్న ఇంటర్న్‌షిప్ కార్యక్రమాన్ని విద్యార్థిని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తమీమ్‌అన్సారియా పిలుపునిచ్చారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ సమావేశపు హాలులో శుక్రవారం యువజన సంక్షేమశాఖ కార్యాలయం ప్రచురించిన పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. 30 రోజుల పాటు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. వాటర్‌మేనేజ్‌మెంట్, హెల్త్, పంచాయతీరాజ్, ఉపాధి కల్పన, మహిళా శిశు ఆరోగ్య, రోడ్లు, భవనాలు, నగర అభివృద్ధి అంశాలపై అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. జిల్లాలోని అన్ని కళాశాలల యాజమాన్యాలు తమ సంస్థల్లో చదువుతున్న విద్యార్థులు ఇందులో చేరేలా ప్రోత్సహించాలన్నారు. మే 14 నుంచి జూన్ 13వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ చెప్పారు. కార్యక్రమంలో సెట్ సీఈవో శ్రీమన్నారాయణ, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అన్సారియా

ఈవీఎం గోడౌన్ తనిఖీ

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం మామిడిపాలెంలోని ఈవీఎం గోడౌన్‌ను శుక్రవారం జిల్లా రెవెన్యూ అధికారి బి.చినఓబులేసు తనిఖీ చేశారు. గోడౌన్ ప్రాంగణంలో కల్పిస్తున్న భద్రత, అందుకు సంబంధించి నిర్వహిస్తున్న రికార్డులను పరిశీలించారు. గోడౌన్ పటిష్టత వేసిన తాళాలు, సీలును తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ ప్రసన్నకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

సంతనూతలపాడు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ఎండ్లూరు గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను శుక్రవారం ఎంపీడీవో డి.సురేష్‌బాబు పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేశారు. అనంతరం ఎంపీడీవో మాట్లాడుతూ ఉదయాన్నే ఉపాధి పనులకు రావాలని, వేసవి ఎండ బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఏపీవో వాసంతి పాల్గొన్నారు.


కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందిస్తున్న సురేష్‌బాబు

పండ్లపై హానికర రసాయనాలు వాడకుండా చూడాలి

● జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ

ఒంగోలు కార్పొరేషన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కాల్షియం కార్బైడ్ వంటి హానికర రసాయనాలతో పండించిన పండ్ల వల్ల ఆరోగ్య సమస్యలు వస్తాయని, దానిపై ఆహార తనిఖీ అధికారులు దృష్టి సారించాలని జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాల్షియం కార్బైడ్‌తో మామిడి ఇతర రకాల పండ్లు పండించడం వల్ల అనారోగ్య సమస్యలు వస్తాయని తెలిపారు. తలతిరగడం, తరచూ దాహం, చికాకు, బలహీనత, వాంతులు, చర్మంపై పుండ్లు, ఇతర జీర్ణ కోశ వ్యాధులు వస్తాయని చెప్పారు. ఇతిలిన్ గ్యాస్‌తో, రైపెనింగ్ చాంబర్లలో సహజ సిద్ధంగా పండించిన పండ్లు, ఆహార పదార్థాలపై పంచాయతీరాజ్ అధికారులతో కలిసి అవగాహన సదస్సులు నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా ఆహార తనిఖీ అధికారి గోపికాంత్ ప్రభాకర్‌రావు, డీటీసీ సుశీల, కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ డి.కొండయ్య, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

మహిళకు గాయాలు

సింగరాయకొండ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొని గుర్తుతెలియని మహిళకు తీవ్రగాయాలైన ఘటన స్థానిక జాతీయ రహదారిపై కనుమళ్ల అడ్డరోడ్డు వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న హైవే మొబైల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రురాలిని 108లో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

నేడు పల్లామల్లిలో ఉచిత వైద్యశిబిరం

చీమకుర్తి, ఏప్రిల్25(ఆంధ్రజ్యోతి) : పల్లామల్లిలో శనివారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నారు. కిమ్స్ ఆసుపత్రి వైద్యులు పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేయనున్నట్లు ఆసుపత్రి ప్రతినిధి రత్నకుమార్ తెలిపారు.

పరిశ్రమలను ఏర్పాటు చేసేలా ప్రోత్సహించాలి

● కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహిస్తూ ఎక్కువ మందికి ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం పరిశ్రమలు, ఇతర శాఖల అధికారులతో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో అమలు జరుగుతున్న సింగిల్‌డెస్క్ పాలసీ, కేంద్ర ప్రభుత్వ పథకాలు, రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై కలెక్టర్ సమీక్షించారు. జిల్లాలోపరిశ్రమల స్థాపనతో ఎక్కువ మందికి ఉపాధి అవకాశాలు ఏర్పాటుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. అందుకు అనుగుణంగా యువతకు అవసరమైన శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. జిల్లాలో జరుగుతున్న పీఎం విశ్వకర్మ యోజన పరిశీలన ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలన్నారు. నియోజకవర్గంలో ఒక ఎంఎస్ఎంఈ పార్కుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కోరారు. సమావేశంలో పరిశ్రమల కేంద్రం మేనేజర్ శ్రీనివాసరావు, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ మదన్‌మోహన్ పాల్గొన్నారు.

బ్యాటరీ ఆటో అందజేత

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు యర్రగొండపాలెం మండలానికి చెందిన దివ్యాంగుడైన పెన్న వెంకటరెడ్డి జీవనాధారం కోసం కలెక్టర్ తమీమ్ అన్సారియా శనివారం రాత్రి కలెక్టరేట్‌లో బ్యాటరీ ఆటోను అందజేశారు. గనులు, దివ్యాంగుల శాఖ సమన్వయంతో ఈ ఆటోను కొనుగోలు చేసి లబ్ధిదారుడికి అందజేసినట్లు తెలిపారు.


వెంకటరెడ్డికి బ్యాటరీ ఆటోను అందజేస్తున్న కలెక్టర్ అన్సారియా

మల్లికార్జునరావు కళాసేవలు అభినందనీయం

● ప్రజా నాట్యమండలి రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వెంకటేశ్వర్లు

ఒంగోలు కల్చరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): నాలుగు దశాబ్దాలుగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగిగా, రంగస్థల నటులుగా విభిన్న మల్లికార్జునరావు అందిస్తున్న సేవలు అభినందనీయమని ప్రజా నాట్యమండలి రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వర్లు(అన్న) పేర్కొన్నారు. జీవిత సాఫల్య పురస్కారం నంది కళాకారుడు ఉండేలా, విశిష్ట పురస్కారాన్ని అందుకున్న ప్రముఖ రంగస్థల నటుడు, నాగినేని నరసింహరావు మెమోరియల్ ఆర్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లికార్జునరావు అభినందన సభ శుక్రవారం రాత్రి ఒంగోలులోని సీవీఎన్ రీడింగ్ రూము జీవీఆర్ కళాప్రాంగణం వేదికపై ఘనంగా జరిగింది. సంస్థ ప్రధానకార్యదర్శి కమ్మాల రాఘవులు అధ్యక్షత జరిగిన సభలో నల్లూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. నాట్యభైరవ సాహిత్యపీఠం అధ్యక్షుడు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ, నరసం రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ మాట్లాడుతూ మల్లికార్జునరావుకు ప్రతిష్ఠాత్మకమైన కందుకూరి విశిష్ట విశిష్ట పురస్కారం లభించడం జిల్లా రంగస్థల రంగానికి గర్వకారణమని అన్నారు. అనంతరం మల్లికార్జునరావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ పరాంకుశం కేశవాచార్యులు, సీవీఎన్ రీడింగ్ రూము అధ్యక్షుడు ఈదుపల్లి గురునాథరావు, కార్యదర్శి కె.రాధాకృష్ణ, కోశాధికారి ఆరిగ వీరప్రతాప్, సింహాద్రి జ్యోతిర్మయి, డాక్టర్ నూనె అంకమ్మరావు, పుర్రా ప్రసాద్‌బాబు, కొప్పోలు వెంకటేశ్వర్లు, మెడబలిమి సాంబశివరావు, దామవరపు మునలయ్య, కోవెలకుంట్ల బాలకోటయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారుల ప్రదర్శించిన నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.


మల్లికార్జునరావును సత్కరిస్తున్న కళాకారులు, సాహితీవేత్తలు

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

● దామచర్ల జయలక్ష్మి

సింగరాయకొండ, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): పాఠశాల దశ నుంచే విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మాజీమంత్రి జోర్డు చైర్మన్ దామచర్ల సత్య సతీమణి జయలక్ష్మి అన్నారు. సింగరాయకొండలోని స్మార్ట్‌జెన్ గ్లోబల్ స్కూల్‌లో గురువారం రాత్రి నిర్వహించిన ద్వితీయ వార్షికోత్సవంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లల అభిరుచికి అనుగుణంగా వారిని ప్రోత్సహించాలని సూచించారు. అనంతరం ఈ విద్యాసంవత్సరం పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ పి.శ్రీనివాసరావు, కరస్పాండెంట్ డాక్టర్ ఎన్.గీతారాణి, ప్రిన్సిపాల్ లలిత, పీఎన్‌సీపీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేస్తున్న జయలక్ష్మి, కరస్పాండెంట్, ప్రిన్సిపాల్

మలేరియా నివారణకు చర్యలు

ఒంగోలు కార్పొరేషన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): నగరంలో మలేరియా నివారణకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, మేయర్ గంగాడ సుజాత తెలిపారు. ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం నగరంలో దోమల నివారణ చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలోని ఖాళీ స్థలాల్లో నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ విడుదల చేస్తున్నట్లు చెప్పారు. అలాగే ప్రతి కాలనీలో కాలువల్లో పూడిక తీసి, పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ డి.కొండయ్య, శానిటరీ సూపర్‌వైజర్లు విప్పయ్య, షేక్ బాబ్జి పాల్గొన్నారు.


నీటి నిల్వల్లో ఆయిల్ బాల్స్ విడుదల చేస్తున్న కమిషనర్, మేయర్

ప్రాణాంతక జ్వరాలను తరిమికొట్టాలి

మద్దిపాడు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ప్రాణాంతక జ్వరాలు అయిన మలేరియా, డెంగ్యూ, గున్యాలను తరిమికొట్టేలా ప్రజలు అవగాహన పెంచుకోవాలని డాక్టర్ ఆనంద్‌మోహన్ పేర్కొన్నారు. శుక్రవారం ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవం సందర్భంగా మద్దిపాడు పీహెచ్‌సీ వద్ద నుంచి బస్టాండ్ సెంటర్ వరకు వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. దోమలు వల్ల ప్రాణాంతక జ్వరాలు ప్రబలు తాయని, అందువల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

సంతనూతలపాడు: దోమల ద్వారా మలేరియా వ్యాప్తిచెందుతుందని, అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వి.హరిణి పేర్కొన్నారు. శుక్రవారం సంతనూతలపాడులో మలేరియా నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తపట్నం: కొత్తపట్నంలో మలేరియా నివారణపై శుక్రవారం పీహెచ్‌సీ సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ రమ్యదీపిక సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు.

సింగరాయకొండ: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా మలేరియాను దూరంగా ఉంచవచ్చని పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ వినయకృష్ణ సూచించారు. ప్రపంచ మలేరియా దినం సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో స్థానిక కందుకూరు రోడ్డు కూడలి నుంచి శాంతి థియేటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం వైద్యశాలలో సమావేశం జరిగింది. కార్యక్రమంలో డాక్టర్ వీరేంద్రకుమార్, సీహెచ్‌ఓ వీరయ్య, ఆరోగ్య పర్యవేక్షకుడు సయ్యద్ మసూద్‌అలీ, డిప్యూటీ పారామెడికల్ అధికారి దామా వెంకటేశ్వర్లు, సబ్ యూనిట్ అధికారి బాస్కర్, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

మద్దిపాడు ఇన్‌చార్జి తహసీల్దార్‌గా బ్రహ్మయ్య

మద్దిపాడు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మద్దిపాడు మండల ఇన్‌చార్జి తహసీల్దార్‌గా బ్రహ్మయ్య శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడి తహసీల్దార్ సుజన్‌కుమార్ బదిలీ ఏసీబీకి చిక్కి సస్పెండ్ అయిన విషయం తెలిసిందే. ఈక్రమంలో చీమకుర్తి తహసీల్దార్ బ్రహ్మయ్యకు మద్దిపాడు ఇన్‌చార్జి బాధ్యతలను ఉన్నతాధికారులు అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

అభ్యంతరాలకు నేటితో ఆఖరు : డీఈవో

ఒంగోలు విద్య, ఏప్రిల్25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతులకు సంబంధించిన సీనియారిటీ జాబితాలపై అభ్యంతరాలు తెలిపేందుకు శనివారం తుది గడువు అని డీఈవో ఎ.కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్ యాజమాన్య పాఠశాలల్లో పనిచేస్తున్న సెకండరీ గ్రేడ్‌టీచర్లకు స్కూలు అసిస్టెంట్లుగా, స్కూలు అసిస్టెంట్లకు ప్రధానోపాధ్యాయులుగా ఉద్యోగోన్నతులకు సంబంధించిన సీనియారిటీ జాబితాలు జిల్లావిద్యాశాఖ వెబ్‌సైట్‌లో ఉన్నాయి. అన్ని సబ్జెక్టులకు సంబంధించిన సీనియారిటీ జాబితాలపై అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలన్నారు. జాబితాలో అభ్యంతరం ఎవ్వరుండే పేర్కొంటూ తగిన ఆధారాలు అందజేయాలన్నారు. గడువు ముగిసిన తర్వాత అభ్యంతరాలను స్వీకరించబోమని డీఈవో స్పష్టం చేశారు.

దివ్యాంగురాలి జీవనోపాధికి చేయూత

ఒంగోలు కల్చరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగురాలైన నాగలక్ష్మి జీవనోపాధికి సూర్యశ్రీ చారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక సహాయంతో హోటల్ ఏర్పాటు చేసింది. దానిని శుక్రవారం ట్రస్ట్ వ్యవస్థాపకుడు, పారిశ్రామికవేత్త మండవ మురళీకృష్ణ ప్రారంభించారు. స్థానిక అంబేడ్కర్‌భవన్ రోడ్డులో ఏర్పాటు చేసిన ఈ హోటల్ ప్రారంభం సందర్భంగా ట్రస్ట్ సెక్రటరీ సర్దార్‌బాష మాట్లాడుతూ నాగమణికి ఒక కాలు లేదని, ఇద్దరు పిల్లలతో ఇబ్బంది పడుతుందని, అందువల్ల ప్రవాస భారతీయులు తాటినేని నాగ ఉదయ్‌కిరణ్, విజయశ్రీల తదితరుల సహాయంతో రూ.1,05,000తో హోటల్ ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ గౌరవ సభ్యులు మండవ సుబ్బారావు, మారెళ్ల సుబ్బారావు, షేక్ మహబూబ్, దర్శనపు యశోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.


హోటల్ ప్రారంభిస్తున్న మురళీకృష్ణ

ఎస్సీ లబ్ధిదారుల వయోపరిమితిని పెంచాలి

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ కార్పొరేషన్ లబ్ధిదారుల వయోపరిమితిని 60 ఏళ్లకు పెంచాలని మాదిగ సంక్షేమ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము సుజన్‌మాదిగ కోరారు. శుక్రవారం తాసిల్దార్ రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ చైర్మన్ ఉండవల్లి శ్రీదేవికి వినతిపత్రం అందజేశారు. బీసీ కార్పొరేషన్‌లో లబ్ధిదారుల వయస్సు 60సంవత్సరాలకు ఇచ్చారని, అదే విధంగా ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అందించే రుణాలు కూడా 50 నుంచి 60 ఏళ్లకు పెంచేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జయకుమార్, వంకీ, మహేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వైద్య ధ్రువీకరణ పత్రాల జారీ నేటితో ఆఖరు

ఒంగోలు విద్య, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): వచ్చేనెలలో జరగనున్న ఉపాధ్యాయ బదిలీల్లో ప్రాధాన్యత కేటగిరి కింద బదిలీ పొందేందుకు వైద్య ధ్రువీకరణ పత్రాల జారీ శనివారంతో ముగియనుంది. ఈనెల 24నుంచి ఒంగోలులోని రిమ్స్‌లో ఈ వైద్య ధ్రువీకరణ పత్రాలు జారీకి మెడికల్ బోర్డు పరీక్షలు నిర్వహిస్తున్నది. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని టీచర్లు మొదటి రోజు 230 మంది, శుక్రవారం 116 మంది వైద్య పరీక్షలకు హాజరయ్యారు. శనివారంతో ఈ మెడికల్ బోర్డు వైద్య పరీక్షల గడువు ముగుస్తున్నందున అర్హులైన టీచర్లు వైద్య ధ్రువీకరణ పత్రాలను పొందాలని డీఈవో కిరణ్‌కుమార్ కోరారు.

పరిశ్రమల అభివృద్ధికి తోడ్పాటు అందించాలి

మద్దిపాడు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): పరిశ్రమల అభివృద్ధికి ప్రభుత్వం తోడ్పాటు అందించాలని దీప్తి గ్రానైట్ యజమాని మండవ రత్నాకర్ అన్నారు. శుక్రవారం గుండ్లాపల్లి గ్రోత్ సెంటరులో ఫ్యాక్టరీ యజమానుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమల కేంద్రంలో దొంగలు తాకిడి పెరిగిందని, వాటిని నియంత్రించేందుకు పోలీసులు నిఘా ఏర్పాటు చేయాలన్నారు. ఎం.హరిబాబు మాట్లాడుతూ పరిశ్రమల కేంద్రంలో మౌలిక వసతులు కల్పనకు అధికారులు కృషి చేయాలని చెప్పారు. డంపింగ్ కేంద్రంతో పాటు పలు రోడ్ల సమస్యలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో గ్రానైట్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

శ్రీవేంకటేశ్వరునికి మేల్‌చాట్ వస్త్రాలు

ఒంగోలు కల్చరల్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి):స్థానిక శ్రీగిరి శ్రీవేంకటేశ్వరస్వామి వారికి భక్తులు శుక్రవారం మేల్ చాట్ వస్త్రాలను బహూకరించారు. హైదరాబాద్‌కు చెందిన సుప్రీత్ బాలాజీ వారి అందజేయగా ఆలయ అర్చకులు వారికి వేద ఆశీర్వచనం, తీర్థప్రసాదాలను అందించారు. ఈ సందర్భంగా దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ ఆలూరు రూప్‌సింగ్, అర్చిత సేవల దర్శకర్త ఆలూరు సుశీలాదేవి, కార్యనిర్వహణ దర్శకర్త సీవీ.రామకృష్ణారావు, దర్శకర్తలు ఆలూరు వెంకటేశ్వరరావు, లక్ష్మీకుమారి బాలాజీని అభినందించారు. శనివారం శ్రీగిరిలో మద్దులూరి లక్ష్మీవసంత బృందంచే వీణావాదనం ఉంటుందని, భక్తులు పాల్గొనాలని వారు కోరారు.


వస్త్రాలను తీసుకువస్తున్న భక్తులు

దంత వైద్యశిబిరానికి విశేష స్పందన

ఒంగోలు కల్చరల్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సుధ డెంటల్ క్లినిక్ సంయుక్తంగా ఒంగోలులో శుక్రవారం నిర్వహించిన ఉచిత దంత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. పెద్ద సంఖ్యలో ఎస్‌బీఐ ఉద్యోగులు, ఖాతాదారులు దంత పరీక్షలు చేయించుకున్నారు. ప్రముఖ దంత వైద్య నిపుణులు కవర్తపు అవినాష్, సుధారాణి, ఆశాల ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు జరిగాయి. ఈ సందర్భంగా డాక్టర్ కవర్తపు అవినాష్ మాట్లాడుతూ దంత సంరక్షణ వల్ల అనేక రోగాలను దూరంగా ఉంచవచ్చన్నారు. తమ బ్యాంకు ఉద్యోగులు, ఖాతాదారుల కోసం ఉచిత దంత వైద్య శిబిరాన్ని నిర్వహించటం పట్ల సుధ డెంటల్ క్లినిక్ నిర్వాహకులను స్టేట్ బ్యాంకు అధికారులు అభినందించారు.



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

వక్ఫ్ సవరణ చట్టం రద్దు చేయాలి

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ సవరణ చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ఆవాజ్ జిల్లా అధ్యక్షుడు ఎండీయాసిన్ డిమాండ్ చేశారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 28న జరిగే ర్యాలీలో అన్ని ప్రజాసంఘాలు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు అమీర్, కెరమావలి, బి.రఘురాం, టి.మహేష్, కేఎస్.బాబు, విజాలకోటయ్య, నెరుసుల వెంకటేశ్వర్లు, వీరస్వామి, వినోద్, విజయ్ పాల్గొన్నారు.

పారదర్శకంగా విధులను నిర్వహించాలి

మద్దిపాడు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం సిబ్బంది విధులపై అప్రమత్తంగా ఉండి పారదర్శకంగా విధులు నిర్వహించాలని ఏపీవో దేవ సుజయ్య అన్నారు. శుక్రవారం మద్దిపాడులోని ఉపాధి హామీ కార్యాలయంలో ముగ్గురు ఉద్యోగుల బదిలీ కాగా స్వాతి, సోమేశ్వరావు, రామకృష్ణలకు వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీవో మాట్లాడుతూ విధుల్లో చేరిన ఉద్యోగులు పారదర్శకంగా నిర్వహించి ఉపాధి కూలీలకు సేవలందించాలని, గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. కొత్తపట్నం మండలం నుంచి కొమ్ము లావణ్య, సీహెచ్.హనుమాన్‌ప్రసాద్ విధుల్లో చేరారు. ఈ కార్యక్రమంలో సత్కరించారు. కార్యక్రమంలో జేఈ కిషోర్, ఫీల్డ్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.


ఉద్యోగులను సత్కరిస్తున్న సిబ్బంది

అవీ..ఇవీ



సింహ వాహనంపై దర్శనమిస్తున్న స్వామివారు

సింహ వాహనంపై వేంకటేశ్వరుడు

కంభం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): శ్రీవేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం రాత్రి శ్రీవేంకటేశ్వరస్వామి సింహ వాహనంపై మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈసందర్భంగా కోలాట ప్రదర్శన భక్తులను అలరించింది. భక్తులు స్వామి వారికి కాయకర్పూరాలు సమర్పించారు.



ఇంటర్ టాపర్‌ను సన్మానిస్తున్న వాసవిక్లబ్ ప్రతినిధులు

ఇంటర్ టాపర్‌కు సన్మానం

గిద్దలూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్ ఫలితాలలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు టీవీ రామాంజనేయులు కుమార్తె సాయిమోహిత స్థానిక సాహితి కళాశాలలో చదువుతూ 465/470 మార్కులు సాధించి రాష్ట్ర ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా వాసవిక్లబ్ ప్రతినిధులు విద్యార్థినిని ఘనంగా సన్మానించి మెడల్ అందజేశారు. ఈకార్యక్రమంలో వాసవిక్లబ్ పట్టణ అధ్యక్షుడు సూరె రామచంద్రుడు, వనిత క్లబ్ అధ్యక్షురాలు గర్రె సాహితి, మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సూరె నాగేశ్వరరావు, ఆయా కమిటీల ప్రతినిధులు పాల్గొన్నారు.



మార్కాపురం పట్టణంలో
ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యారోగ్యశాఖ అధికారులు, సిబ్బంది

పరిసరాల పరిశుభ్రతతోనే మలేరియా నివారణ

మార్కాపురం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారానే మలేరియాను నివారించుకోగలమని మార్కాపురం డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ కె.పద్మావతి అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక పట్టణ ఆరోగ్య కేంద్రం వద్ద ముందుగా జరిగిన అవగాహన కార్యక్రమంలో డాక్టర్ పద్మావతి మాట్లాడుతూ ఇంటి పరిసరాలను ఎల్లప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమలవ్యాప్తి ఎక్కువగా ఉంటే కుట్టకుండా దోమ తెరలు వాడాలన్నారు. జ్వరం వచ్చిన వెంటనే ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి డాక్టర్‌లను సంప్రదించాలన్నారు. మలేరియా వచ్చినా వైద్యుల సూచన మేరకు మందులు వాడితే మరణాలను అరికట్టవచ్చని అన్నారు. అనంతరం పట్టణంలో నినాదాలు చేసుకుంటూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రావణ్‌తేజ, మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్ ఆర్.నాగేంద్రరెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్లు ఎస్.ఆవులయ్య, బి.యశోద, పి.గోవిందరాజులు, లక్ష్మిరెడ్డి, ఏఎన్ఎంలు, ఉషా వర్కర్లు పాల్గొన్నారు.



ప్రశంసాపత్రాలు అందుకుంటున్న జడ్‌పీటీసీ, ఎంపీపీలు

ఉత్తమ సేవకు ప్రశంసలు

కొనకనమిట్ల, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవలు అందించిన పలువురికి ప్రశంసపత్రాలను అందజేశారు. మంగళగిరి సీకే కన్వెన్షన్ హాలులో జరిగిన ఉత్తమ నాయకత్వ సేవాపురస్కారాలకు ప్రకాశం జిల్లా కొనకనమిట్ల ఎంపీపీ మోరబోయిన మురళికృష్ణ, కొనకనమిట్ల జడ్‌పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలుకు ఉత్తమ సేవకుగాను ప్రశంసా పురస్కారానికి ఎంపికయ్యారు. శుక్రవారం ఒంగోలులోని మల్లయ్య లింగన్ భవనంలో జాతీయగ్రామస్వరాజ్య సాధన సమితి కార్యదర్శి వీరభద్రాచారి చేతులమీదుగా పత్రాలను అంద జేశారు. అనంతరం వీరిని సన్మానించారు.

ఎంపీపీకి ప్రశంసాపత్రం

పెద్ద దోర్నాల :జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా ఒంగోలులోని మల్లయ్య లింగం భవన్‌లో జరిగిన ఉత్సవాలలో దోర్నాల మండల పరిషత్ అధ్యక్షురాలు గుమ్మా పద్మజ పంచాయతీ సర్పంచుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు వీర భద్రాచారి నుంచి ప్రశంసాపత్రాన్ని శుక్రవారం అందుకున్నారు.ఈ కార్యక్రమంలో ఆమె భర్త గుమ్మా ఎల్లేశ్ పాల్గొన్నారు.

సర్పంచ్‌కి ఉత్తమ అవార్డు

గిద్దలూరు టౌన్ : మండలంలోని కొంగళవీడు సర్పంచ్ లక్ష్మీప్రసన్న ఉత్తమ అవార్డును అందుకున్నారు. పంచాయతీ అభివృద్ధిలో అంకిత భావంతో పని చేస్తున్న లక్ష్మీప్రసన్నకు ఒంగోలులో జరిగిన కార్యక్రమంలో పర్యాటకశాఖ చైర్మన్ నూకసాని బాలాజీ ప్రశంసాపత్రాన్ని, అవార్డును అందజేశారు.

వ్యర్థాలతో నిండిన సగిలేరు

మురుగుకాలువను తలపిస్తున్న సప్లైచానల్

గిద్దలూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): రాచర్ల మండలంలోని 5 సాగునీటి చెరువులకు నీరు అందించే సగిలేరు సప్లై చానల్ మురుగు నీటి కాలువగా మారిపోయింది. ప్లాస్టిక్ కవర్లు, వ్యర్థాలతో కప్పబడి దుర్వాసనకు కేరాఫ్‌గా మారింది. సగిలేరు నది నుంచి రాచర్ల మండలంలోని 5 సాగునీటి చెరువులకు నీరు అందించే సగిలేరు సప్లైచానల్ గిద్దలూరు పట్టణం నుంచి ఆయా చెరువుల వరకు నిర్మించారు. ఈ చానల్ ఇరువైపులా పట్టణం విస్తరించడంతో ఇళ్లు, వ్యాపార దుకాణాలు ఏర్పడ్డాయి. దాంతో ఆప్రాంతవాసులు మురుగునీటిని, ఇళ్లలోంచి వచ్చే వృథానీటిని ఈసప్లై చానల్‌లోకే పంపిస్తున్నారు. చుట్టుపక్కల వారు చెత్తాచెదారాన్ని కూడా అందులోనే వేస్తున్నారు. దాంతో ఈసప్లై చానల్ మొత్తం చెత్తాచెదారంతో పూడిపోతున్నది. వర్షం నీరు ముందుకు కదలలేని పరిస్థితి నెలకొంటున్నది. ప్లాస్టిక్ వ్యర్థాలన్నీ నీటిపైన కప్పబడి ఉన్నాయి. వర్షం కురిసినా, సగిలేరు పారినా ఈ సప్లై చానల్‌లో మురుగు పేరుకుని ఉండడంతో వర్షం నీరు ముందుకు పోలేక సుమారు వెయ్యి ఎకరాల ఆయకట్టు గల ఈ 5 చెరువులకు నీరుచేరలేక ఆయకట్టు రైతులు కూడా వర్షాధారంపైనే పంటలు సాగు చేసుకోవలసిన పరిస్థితి ఏర్పడిందిఇ ఏళ్ల తరబడి ఈ సమస్య ఇలాగే ఉన్నప్పటికీ అధికారులు గాని, ప్రజాప్రతినిధులు గాని కూడా పట్టించుకున్న దాఖలాలు లేవు. చివరకు రైతులు కూడా వర్షాధార పంటలను వేసుకుంటూ మిన్నకుండిపోవడం గమనార్హం. ఈ సప్లై చానల్‌లో పూర్తిస్థాయిలో పూడికతీసి పట్టణ పరిధిలో ఉన్న కాలువపై స్లాబ్ లాంటిది నిర్మిస్తే తప్ప ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించే అవకాశం లేదు. వర్షం నీరు వృథాగా పోకుండా చెరువులకు మళ్లిస్తే భూగర్భజలాలు కూడా పెరిగే అవకాశం ఉంటుంది.అధికారులు, ప్రజాప్రతినిధులు సగిలేరు సప్లైచానల్‌ను పూర్తి స్థాయిలో బాగు చేయించాలని రైతులతోపాటు ప్రజలు కోరుతున్నారు.



మురుగు కాలువగా మారి ప్లాస్టిక్ కవర్లతో మూసుకుపోయిన సప్లై చానల్

'ఉగ్ర'దాడులను నిరసిస్తూ ముస్లింల భారీ ర్యాలీ

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ మార్కాపురంలో ముస్లిం జేఏసీ ఉలేమా కమిటీ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి ముస్లింలు నిరసన తెలిపారు. పెహల్గాం మృతుల ఆత్మలకు శాంతి కలగాలని 2 నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ పర్యాటకులను లక్ష్యంగా చేసుకుని జరిగిన ఈ దాడి దేశ భద్రతకు పెను సవాల్ విసురుతుందని, ఇలాంటి చర్యలను యావత్ సమాజం ముక్త కంఠంతో ఖండించాలని అన్నారు. జుమ్మా నమాజ్‌లో మృతుల ఆత్మశాంతి కోసం ప్రత్యేక దువా నిర్వహించారు. మదినా మసీద్, చిన మసీద్, మక్కా మసీద్‌లతో పాటు పలు మసీద్‌లలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అనంతరం రాత్రి స్థానిక కంభం సెంటర్ నుంచి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ అమాయకులైన పర్యాటకులను ఉగ్రవాదులు కిరాతకంగా చంపివేయటం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. ఉగ్రవాదాన్ని కూకటి వేళ్లతో పెకలించివేయాలన్నారు. భారతదేశాన్ని సమైక్యంగా ఉంచేందుకు ప్రతి భారతీయుడు తమ వంతు సహకారం అందించాలన్నారు. అనంతరం పట్టణంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం సంఘాలు, ఉలేమాలు, ప్రజా సంఘాలు పాల్గొన్నాయి. జనసేన పార్టీ నాయకులు వెలుగు కాశీరావు, కూటమి నేతలు, ప్రజలు పాల్గొన్నారు.



జామియా మసీద్‌లో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ముస్లింలు

పొదిలిలో

పొదిలి : ఉగ్రదాడికి నిరసనగా శుక్రవారం పొదిలిలో ఆర్యవైశ్యసంఘం, యూటీఎఫ్, జేవీవీ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడి హేయమైనదన్నారు. కాల్పులు జరిపిన వారిని కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. ఈకార్యక్రమంలో యూటీఎఫ్, జేవీవీ, సీఐటీయూ నాయకులు, ఆర్య వైశ్యసంఘ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



పొదిలిలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న వివిధ వర్గాల ప్రజలు

తర్లుపాడులో

తర్లుపాడు : యాత్రికులపై ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ కూటమి నేతలు జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాకిస్తాన్ టెర్రరిస్టులపై కఠిన చర్యలు తీసుకోవాలని నినాదాలు చేస్తు తర్లుపాడు పుర వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు గౌతుకట్ల సుబ్బయ్య,



తర్లుపాడులో ఉగ్రదాడిని ఖండిస్తూ నిర్వహిస్తున్న ర్యాలీ

కంభంలో శాంతిర్యాలీ

కంభం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): జమ్మూకాశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులపై ఉగ్రమూకలు దాడిచేసి చంపినందుకు నిరసనగా శుక్రవారం కంభం ముస్లిం జేఏసీ ఆధ్వర్యంలో శాంతియుతర్యాలీ నిర్వహించారు. జమ్మూకాశ్మీర్‌లో ఇటీవల జరిగిన దారుణ ఉగ్ర దాడిలో అసువులుబాసిన భారతీయ హిందువుల ఆత్మశాంతిని కోరుతూ, టెర్రరిజాన్ని తీవ్రంగా ఖండిస్తూ శుక్రవారం జుమా నమాజ్ అనంతరం జామియా మసీదు నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు శాంతియుత నిరసన ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని అన్ని మసీదుల నుంచి పెద్దసంఖ్యలో తరలివచ్చిన ముస్లింలు నల్లరిబ్బన్లు ధరించి ఈ కార్యక్రమంలో పాల్గొని ఉగ్రవాదం నశించాలంటూ నినాదాలు చేశారు. ర్యాలీలో పట్టణంలోని 15 మసీదుల నుంచి ముస్లింలు పాల్గొన్నట్లు ముస్లిం జేఏసీ నాయకులు సలీమ్ తెలిపారు.



కంభంలో శాంతిర్యాలీ చేస్తున్న ముస్లింలు

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

ఎర్రగొండపాలెం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గాన్ని ఊహించని విధంగా అభివృద్ధి చేస్తానని టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరంతరం నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారం కోసం, కార్యకర్తల అభివృద్ధి కోసం పనిచేస్తానని అన్నారు. పార్టీకోసం పని చేసే నాయకులు, కార్యకర్తలను టీడీపీ అనుబంధ,మండల స్థాయి పదవులకు ఎంపిక చేస్తామని అన్నారు. వారంలో నాలుగురోజులు ఎర్రగొండపాలెం టీడీపీ కార్యాలయానికి వస్తానని, మీసమస్యలు నాదృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని అన్నారు. ఓట్లు లేక నేను ఓడిపోలేదని అసమ్మతే ఓటమికి కారణం అని అన్నారు. ముఖ్యమంత్రి సహకారంతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని అన్నారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు డి. శ్రీనివాస గౌడ్, ఎర్రగొండపాలెం వ్యవసాయమార్కెట్ కమిటీ అధ్యక్షులు చేకూరి సుబ్బారావు, టీడీపీ మండల అధ్యక్షుడు పయ్యావుల ప్రసాదు, ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నియోజకవర్గ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు

ప్రజాదర్బార్‌లో వచ్చే ప్రతి అర్జీకి పరిష్కారం

ప్రజా దర్బార్ తీసుకొనే ప్రతి అర్జీకి పరిష్కారం ఉంటుందని టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్ బాబు అన్నారు. శుక్రవారం జరిగిన ప్రజాదర్బార్‌లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ పరిశీలకుడు కె. శ్రీనివాసగౌడ్, ఏఎంసీ చైర్మన్ చేకూరి సుబ్బారావు పాల్గొన్నారు.

మహిళలు స్వయంగా అభివృద్ధి చెందాలి

మహిళలు స్వయం ఉపాధితో అభివృద్ధి చెందాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయం అని ఎరిక్షన్‌బాబు అన్నారు. ఎర్రగొండపాలెం సచివాలయం 3 పరిధిలో శుక్రవారం మహిళలకు ఉచిత కుట్టు మిషన్ శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

గిద్దలూరు టౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): రుణాలను డ్వాక్రా మహిళలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందేలా చూడాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. డీఆర్‌డీఏ పీడీ నారాయణ శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రాజెక్టుకు సంబంధించి ప్రభుత్వం ద్వారా జరుగుతున్న సంక్షేమ పథకాల వివరాలను, సబ్సిడీ రుణాల గురించి ఎమ్మెల్యేకు వివరించారు.

కంభంలో బీజేపీ కార్యాలయం ప్రారంభం

కంభం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో శుక్రవారం బీజేపీ కార్యాలయాన్ని ప్రారంభించినట్లు జిల్లా నాయకులు పల్లెం శ్రీనివాసులు తెలిపారు. ఇకపై పార్టీ కార్యక్రమాలన్నీ కార్యాలయం నుంచే ప్రారంభమవుతాయని తెలిపారు.

టెన్త్ టాపర్లకు సన్మానం

గిద్దలూరు టౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాలలో 10వ తరగతి పబ్లిక్ పరీక్ష ఫలితాలలో 593, 591 మార్కులు సాధించిన టాపర్లను ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి సన్మానించి అభినందించారు. మంచి ఫలితాలు వచ్చేందుకు కారణమైన ఉపాధ్యాయులను అభినందించారు. ఈకార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం. నాగభూషన్‌రెడ్డి, ఉపాధ్యాయులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



టెన్త్ టాపర్లను
సన్మానిస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి



ర్యాలీ నిర్వహిస్తున్న జనసేన నాయకులు

జనసేన ఆధ్వర్యంలో 'కన్నీటి నివాళి'

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు మార్కాపురంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో జనసేన కన్నీటి నివాళి కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇమ్మడి కాశీనాథ్ ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉగ్రవాదుల దాడిలో మరణించిన జనసేన కార్యకర్త సోమశెట్టి మధుసూదన్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. పాత బస్టాండ్‌లో మానహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి కాశీరామ్‌సింగ్, ఎస్.శ్రీనివాసరావు, నాయకులు నరసింహారావు, రఫి, శ్రీనివాసులు, రవీంద్ర, జేవీ రమణ, వీరమహిళలు, జనసైనికులు పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెంలో ..

ఎర్రగొండపాలెం: స్థానిక అంబేడ్కర్ సెంటరులో శుక్రవారం రాత్రి జనసేన పార్టీ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఆకుల రమేష్, న్యాయవాది బాలకృష్ణనాయక్, ఉపాధ్యక్షుడు షేక్ ఇలియాస్, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.



గిద్దలూరులో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న టీడీపీ నేతలు

టీడీపీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ

గిద్దలూరు టౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఉగ్రవాదాన్ని ఏరివేయాలని, కాశ్మీర్‌లోని పహల్గామ్ ప్రాంతంలో జరిగిన ఘటన యావత్ భారతదేశం ప్రజలను కలిచివేసిందని స్థానిక టీడీపీ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలో అన్నా క్యాంటీన్ సమీపంలో కొవ్వొత్తులు వెలిగించి పహల్గామ్ మృతులకు నివాళులు అర్పించారు. ఈఘటనకు పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల, పట్టణ పార్టీల అధ్యక్షులు మార్తాల సుబ్బారెడ్డి, షానేషావలి, కొమరోలు పార్టీ అధ్యక్షుడు బోనేని వెంకటేశ్వర్లు, సొసైటీ చైర్మన్ దుత్తా బాలీశ్వరయ్య, టీడీపీ నాయకులు గోడి ఓబులరెడ్డి, బిల్లా రమేష్, షెక్షావలి, పెద్దవలి తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న కారు

● యువకుడు మృతి



దిలీప్ (ఫైల్)

ఎర్రగొండపాలెం రూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బోయలపల్లి గ్రామ సమీపంలో కారు బైక్‌ను ఢీకొన్న ఘటనలో యువకుడు మృతి చెందాడు. ఈ ప్రమాదం గురువారం రాత్రి జరిగింది. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల మేరకు.. ఎర్రగొండపాలెంకు చెందిన తోమంద్రు దిలీప్ (25) గుంటూరులో జరిగే ఓ శుభకార్యానికి ఎర్రగొండపాలెం నుంచి ద్విచక్రవాహనంపై కుంటకు బయలుదేరాడు. మార్గమధ్యమైన బోయలపల్లి గ్రామ సమీపంలో మార్కాపురం నుంచి ఎర్రగొండపాలెం వస్తున్న కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన దిలీప్‌ను ఎర్రగొండపాలెం వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స నిర్వహించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం నరసరావుపేటకు రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. మృతుడి తండ్రి లక్ష్మీనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పి. చౌడయ్య తెలిపారు.

కల్వర్ట్‌ను ఢీకొన్న కారు

● వ్యక్తి మృతి



కారులోనే మృతి చెందిన రవీంద్రారెడ్డి

బేస్తవారపేట, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): అనంతపురం-అమరావతి జాతీ య రహదారిలోని పెంచికలపాడు సమీపంలో కారు కల్వర్టును ఢీకొని ఒకరు మృతి చెందారు. వివరాల్లోకి వెళితే అర్ధవీడు మండలం దొనకొండ గ్రామానికి చెందిన రవీంద్రారెడ్డి(35)కుటుంబ సమ్మేతంగా తిరుపతి వెళ్లి దర్శనం చేసుకొని తిరిగి వస్తున్నారు. గురువారం అర్ధరాత్రి మండల పరిధిలోని పెంచికలపాడు సమీపంలో రవీంద్రారెడ్డి నిద్రమత్తులో కల్వర్టును ఢీకొట్టుకోవడంతో కారులోనే మృతి చెందారు. తన భార్యపాపకు చిన్నపాటి గాయాలు కాగా కంభం వైద్యశాలలో చికిత్స అందించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు బైక్‌ల ఢీ

● ఐదుగురికి గాయాలు

ఎర్రగొండపాలెం రూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఎదురెదుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొని ఐదుగురికి గాయాలైన సంఘటన శుక్రవారం రాత్రి ఎర్రగొండపాలెం మండలంలోని మురారిపల్లి చెరువుకట్ట సమీపంలో జరిగింది. బంధువులు తెలిపిన వివరాల మేరకు పుల్లలచెరువు మండలం పిడికిటివానిపల్లి గ్రామానికి చెందిన చెన్నయ్య, వెంకటేశ్వర్లు, ఎడుకొండలు పనుల నిమిత్తం ఎర్రగొండపాలెంకు ద్విచక్రవాహనంపై వస్తున్నారు. పుల్లలచెరువు మండల నాయుడుపాలెం గ్రామానికి చెందిన ఎడుకొండలు, ఆంజయ్యలు ఎర్రగొండపాలెం నుంచి స్వగ్రామానికి వెళుతుండగా మార్గమధ్యలో మురారిపల్లి చెరువు కట్ట వద్ద ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను ప్రయివేటు అంబులెన్సులో రవీంద్ర నర్సింగ్ హోమ్‌కు తరలించారు. ప్రమాదం విషయంపై ఎస్సై పి. చౌడయ్యను వివరణ కొరగా సమాచారం లేదని అన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గిద్దలూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మరమ్మతుల కారణంగా 26వ తేదీ శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పట్టణంలోని పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శేషగిరిరావు ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని స్టేషన్‌రోడ్డు, నంద్యాల రోడ్డు, క్లబ్ రోడ్డు, ఫారెస్టు ఆఫీసు వెనుకభాగం, గాంధీబొమ్మ సెంటర్, మెయిన్ బజారు, మార్కెట్ ఏరియా, రామాలయం వీధులలో ఆసమయంలో విద్యుత్ నిలిపివేస్తున్నట్లు, వినియోగదారులు గుర్తించాలని కోరారు.

వైభవంగా రామచంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠ

దొనకొండ, ఏప్రిల్ 25(దొనకొండ): మండలంలోని దొండపాడు గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ పట్టాభి రామచంద్రస్వామి దేవాలయంలో నూతన విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వరరావు, మోడి వెంకటేశ్వర్లు, యరగొర్ల బసవయ్య, పత్తి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. భక్తులకు అన్నసంతర్పణ చేశారు.

భక్తిశ్రద్ధలతో పోలేరమ్మ పొంగళ్లు

సీఎస్‌పురం(పామూరు), ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలం శీలంవారిపల్లి గ్రామంలో వెలసిన శ్రీఅంకాలమ్మ, పోలేరమ్మ పాల పొంగళ్లను శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా నిర్వాహకులు ఎమ్మెల్యే ఉగ్రకు అమ్మవారి శేషవస్త్రంతో ఘనంగా సత్కరించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో విశ్రాంత జాయింట్ కలెక్టర్ పిడుగు బాబురావు, టీడీపీ మండల అధ్యక్షుడు బి.వెంగయ్య, బొబ్బూరి రమేష్, ఎస్సీ మాలకొండయ్య, వరికూటి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

వీవోఏపై చర్యలు తీసుకోవాలి

పామూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): గోపాలపురం పొదుపు గ్రూపులకు సంబంధించిన సుమారు రూ.25 లక్షల నగదుతో ఉడాయించిన వీవోఏ పల్లాపు జేబిపై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని బాధిత మహిళలు డీఆర్‌డీఏ పీడీ నారాయణకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం కనిగిరిలో వెలుగు శాఖ సిబ్బందితో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. బాధిత మహిళలు ఆయనను కలిసి వివరాలు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు నష్టం జరగకుండా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

టీడీపీ కంభాలదిన్నె అధ్యక్షుడిగా మన్నం రమణయ్య

పామూరు ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కంభాలదిన్నె గ్రామ కమిటీ అధ్యక్షుడిగా మన్నం రమణయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం గ్రామంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ముఖ్యఅతిథిగా పార్టీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈసందర్భంగా గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా కమ్మ మాల్యాద్రి, ప్రధానకార్యదర్శిగా మల్లెల శ్రీనివాసులు, సహాయ కార్యదర్శిగా తలపనేని మాలకొండయ్య, తెలుగుయువత అధ్యక్షుడిగా ఏలూరి మాధవరావు, తెలుగు రైతు అధ్యక్షుడిగా తానికొండ లక్ష్మీనారాయణ, మహిళా అధ్యక్షురాలుగా సూరా గోవిందమ్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

సీఎస్‌పురం(పామూరు), ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎన్‌ఎస్‌ఎస్ ఇన్‌చార్జ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీవిద్య అన్నారు. మండలంలోని శీలంవారిపల్లి గ్రామంలో గల వ్యవసాయ కళాశాల నాలుగవ సంవత్సరం విద్యార్థులు జాతీయ సేవా పథకం ప్రత్యేక కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు. కళాశాల ఆవరణలో క్లీన్‌అండ్ గ్రీన్ కార్యక్రమాలను నిర్వహించారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

ముండ్లమూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్టు డీఎస్పీ బి.లక్ష్మీనారాయణ అన్నారు. శుక్రవారం సాయంత్రం స్థానిక పోలీసు స్టేషన్ వద్ద వాహనాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకొని ప్రమాదాలకు గురికావద్దన్నారు. ప్రతిఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్, సీటు బెల్టు, వాహన పత్రాలు కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐలు పి.హనుమంతరావు, ఎన్.వెంకటేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు

వెలిగండ్ల, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ జి.కృష్ణపావని అన్నారు. శుక్రవారం వెలిగండ్లలో పోలీసులు తనిఖీలు చేశారు. మైనర్లు నడుపుతున్న ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. మైనర్లతో పాటు వారి తల్లిదండ్రులను పోలీస్‌స్టేషన్‌కి పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈసందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ మైనర్లకు వాహనాలు ఇవ్వడం, నడపమని ప్రోత్సహించడం చట్టరీత్యా నేరమన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ జిలాని భాషా, రైటర్ అచ్చిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ ఎంపీటీసీని పరామర్శించిన టీడీపీ నేతలు

ముండ్లమూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పూరిమెట్ల గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ చింతలపల్లి ముసలయ్య ఇటీవల అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటికి వచ్చారు. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకుడు కడియాల రమేష్, తదితరులు శుక్రవారం ముసలయ్య ఇంటికి వెళ్ళి పరామర్శించారు.

ప్రజాసమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి
- వివిధ శాఖల అధికారులతో ప్రజావేదిక


ప్రజావేదికలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో శుక్రవారం వివిధ శాఖల అధికారులతో ప్రజావేదిక నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై అర్జీలను స్వీకరించి పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. మండలాలవారీగా ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి వీలైనంత వరకు అక్కడికక్కడే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు ఇచ్చిన వినతులను ప్రత్యక్షంగా అధికారులతో చర్చించి తక్షణ పరిష్కారం దిశగా చర్యలు తీసుకున్నారు. క్షేత్ర స్థాయిలో పరిశీలించాల్సిన సమస్యలను సంబంధిత శాఖల అధికారుతో సమీక్షించారు. పరిష్కారానికి సమయం పట్టే వాటిపై నిర్ణీత గడువులో పరిష్కరించాలని, ప్రజలను తిప్పుకోవద్దని సూచించారు.

వెలుగు సీసీలపై ఆగ్రహం

ప్రజాసమస్యలపై నిర్లక్ష్యం వహిస్తే సస్పెండ్ చేస్తామని హనుమంతునిపాడు మండల వెలుగు సీసీలు, ఏపీఎంపై ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర హెచ్చరించారు. మండలంలోని నందనవనం క్లస్టర్‌లోని కిస్టంపల్లి, సీతారామపురం, కొత్తూరు గ్రామాల్లో గతంలో పనిచేసిన వీవోఏలు గత లెక్కల వివరాల రికార్డులను, చెక్‌బుక్‌లను అందజేయలేదని టీడీపీ మండల అధ్యక్షుడు ఎస్వీఆర్ ఆధ్వర్యంలో చీకటివెంకటసుబ్బయ్య, గాయం రామిరెడ్డిపతిరెడ్డి, తదితరులు ఫిర్యాదు చేశారు. అందులో సీసీ పాత్ర ఉందన్నారు. దీంతో ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేస్తూ కొత్తగా వీవోఏలుగా చేరిన వారికి సంబంధిత పత్రాలను సమర్పించకుండా ఉండటం వెనకు ఆంతర్యం ఏమిటని సీసీలను ప్రశ్నించారు. సీసీల పాత్ర ఉందని తెలిస్తే సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. మీ పర్యవేక్షణ ఏమైందంటూ ఏపీఎంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కనిగిరి మండలంలోని చీర్లదిన్నె వీఆర్‌ఓపైనా ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు ఇచ్చిన అర్జీలను పరిష్కరించకుండా ఎందుకు కాలయాపన చేస్తున్నారని ప్రశ్నించారు. విధులు సక్రమంగా నిర్వర్తించకపోతే సెలవు పెట్టి వెళ్ళిపోవాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ ప్రజావేదికలో వివిధ సమస్యలపై వందకు పైగా అర్జీలు వచ్చాయన్నారు. వాటిని నిర్ణీత గడువులోగా పరిష్కరిస్తామన్నారు. ప్రజావేదికలో ఇచ్చిన ఇంటి స్థలాల అర్జీలను ప్రభుత్వానికి నివేదించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవిశంకర్, రమణారావు, వివిధ మండలాల అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలతో పురోగతి చెందాలి

కనిగిరి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలతో ఆర్థిక పురోగతి చెందాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం కనిగిరి నియోజకవర్గంలో పీఎం అజయ్ పథకం కింద మంజూరైన రూ.24 లక్షల చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎస్సీల అభివృద్ధికి ప్రభుత్వాలు వివిధ పథకాలను అమలుచేస్తుందన్నారు. కార్యక్రమంలో ఏసీ అంబేద్కర్, ఏపీఎంలు, సీసీలు, వీవోఏలు, తదితరులు పాల్గొన్నారు.

పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి అమానుషం

- పలుచోట్ల నిరసన ర్యాలీలు


కనిగిరిలో జరిగిన ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి అమానుషమని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ శుక్రవారం టీడీపీ ఆధ్వర్యంలో పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. పామూరు బస్టాండు సెంటరులో జరిగిన మానవహారంలో ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ శాంతియుత మార్గంలో పయనించాలన్నారు. బాధితులకు ప్రతి పౌరుడు మద్దతుగా నిలవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వీవీఆర్ మనోహరరావు (చిరంజీవి), దొడ్డా వెంకటసుబ్బారెడ్డి, రోషన్ సందాని, అహ్మద్‌హుస్సేన్, తమ్మినేని శ్రీనివాసులురెడ్డి, షేక్ వాజిదా బేగం, తదితరులు పాల్గొన్నారు. అలాగే, యూటీఎఫ్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మీగడ వెంకటేశ్వరరెడ్డి, అహ్మద్, కేవీవీ, తదితరులు పాల్గొన్నారు.

పామూరులో..

పామూరు ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పర్యాటకులపై ఉగ్రవాదులు కాల్పులు జరపడం దారుణమని జనసేన నియోజకవర్గ నాయకుడు వరికూటి నాగరాజు అన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీగా మమ్మిడాడి సెంటర్‌కు చేరుకుని మానవహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో నాయకులు వై.రహీముల్లా, దరిశి ఏడుకొండలు, గోస్టు సునీల్, బండారు రాజు, ఆకుపాటి వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు. అలాగే సీపీఎం ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సయ్యద్ హనీఫ్, కె.మాల్యాద్రి, షేక్ ఖాదర్ బాషా, సీహెచ్ వెంకటేశ్వర్లు, అల్లభక్ష్, తదితరులు పాల్గొన్నారు.

దర్శిలో..

దర్శి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లో అమాయకులైన 28 మంది పర్యాటకుల ప్రాణాలు బలిగొన్న ఉగ్రవాదులను ఉరితీయాలని జనసేన మండల పార్టీ నాయకుడు కుప్పాల పాపారావు డిమాండ్ చేశారు. ఉగ్రవాద చర్యలను ఖండిస్తూ, మృతుల కుటుంబాలకు సానుభూతి తెలియజేస్తూ శుక్రవారం రాత్రి జనసేన పార్టీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు కార్యక్రమంలో చేతరాజే కొండలు, తదితరులు పాల్గొన్నారు.

అలాగే, సీపీఎం ఆధ్వర్యంలోనూ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా టి.రంగారావు మాట్లాడుతూ కాల్పులకు పాల్పడిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సందు వెంకటేశ్వరరావు, యు.నారాయణ, షేక్ కాలేబాషా, ఈ.నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.


దర్శిలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న జనసేన నాయకులు, కార్యకర్తలు

ప్రజలకు జవాబుదారీగా ఉండాలి

- టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి
- ప్రజాదర్బార్‌లో అర్జీల వెల్లువ
- త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు సూచన


అర్జీలు స్వీకరిస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

కురిచేడు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): అధికారులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. శుక్రవారం కురిచేడులో జరిగిన ప్రజాదర్బార్‌లో పాల్గొని అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజల కోసమే పనిచేస్తున్నట్లు చెప్పారు. చిన్న చిన్న సమస్యలు అక్కడికక్కడే పరిష్కారం అయ్యేలా అధికారులకు సూచనలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి పనికి ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దన్నారు. భూ సమస్యలు, విద్యుత్ సమస్యలు, పెన్షన్లు, మరణ ధ్రువీకరణ పత్రాలు, విద్యార్థుల ధ్రు పత్రాలు, పొలం పస్‌పుస్తకాలు లాంటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ప్రజాదర్బార్‌లో ప్రధానంగా రెవెన్యూ సమస్యలపైనే అధికంగా అర్జీలు వచ్చాయి. గతంలో గ్రామ స్థాయిలో జరిగిన గ్రామ సభలలో వచ్చిన అర్జీలు రకరకాల కారణాలతో రెవెన్యూ వర్గాలు పరిష్కారం కాని సమస్యలుగా చెప్పి తిరస్కరించారు. అధిక భాగం అలాంటి అర్జీలు మరలా వచ్చాయి. పొట్లపాడు సర్వే నంబరు 356లో భూవివాదం ఉందని దానిని పరిష్కరించాలని కొంతమంది కోరారు. కురిచేడులో శ్మశానాన్ని కొంతమంది కబ్జా చేశారని, తగు చర్యలు తీసుకోవాలని కోరారు. యోగయ్య స్వామి గుడి ఎదురు సీసీ రోడ్డు నిర్మించాలని కోరగా, వెంటనే ఏర్పాటుచేస్తామని డాక్టర్ లక్ష్మి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ నాయకుడు కడియాల లలిత్ సాగర్, తహసీల్దార్ రజనీకుమారి, ఎస్‌ఐ శివ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం


పీసీపల్లి: మానవహారంలో పాల్గొన్న డాక్టర్ యషిత తదితరులు

పీసీపల్లి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులకు గురికాకుండా ఆరోగ్యంగా ఉండవచ్చునని స్థానిక ప్రాథమిక వైద్యశాల వైద్యాధికారిణి డాక్టర్ ఎస్.యషిత అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా శుక్రవారం పీసీపల్లిలో ర్యాలీ నిర్వహించి బ్యాంకు సెంటరులో మానవహారం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎనాఫిలిస్ అనే ఆడదోమ కుట్టడం ద్వారా మలేరియా వ్యాధి సంక్రమిస్తుందని చెప్పారు. ముందుజాగ్రత్తగా ఇళ్లలో నీరు నిల్వకుండా చూసుకోవడంతో పాటు నివాస పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సాయంత్రం సమయంలో వేపాకు పొగ వేయడం ద్వారా దోమలను పారద్రోలవచ్చునని చెప్పారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ సంధ్య, హెచ్‌వీ రేణుక, హెచ్‌ఎస్ జకరయ్య, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

మలేరియాపై అప్రమత్తంగా ఉండాలి

దర్శి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మలేరియా వ్యాధి సోకకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని దర్శి వైద్యాధికారి డాక్టర్ డిసుమన్ సూచించారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా దర్శి పట్టణంలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నివాసం ఉండే పరిసరాల్లో మురికినీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. దోమలు ఉత్పత్తి లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దోమలతో మలేరియా, టైఫాయిడ్ తదితర వ్యాధులు సోకుతున్నాయన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

దొనకొండలో..

దొనకొండ, ఏప్రిల్ 25(దొనకొండ): ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ అన్వేష్ ఆధ్వర్యంలో శుక్రవారం దొనకొండలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మలేరియా వ్యాధి కారక దోమ పరిసరాల్లో వృద్ధి చెందకుండా ఉండాలంటే ప్రజలందరూ ఇళ్ల చుట్టుపక్కల నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు.

కార్యక్రమంలో పొదిలి ఎస్‌యూవో కృష్ణయ్య, సీహెచ్‌వో ఇన్నాసమ్మ, సూపర్‌వైజర్లు ప్రభావతిదేవి, ఫ్లెమింగ్, తదితరులు పాల్గొన్నారు.

ముండ్లమూరులో..

ముండ్లమూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా శుక్రవారం మారెళ్ళ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మణిశంకర్, సిబ్బంది ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా మణిశంకర్ మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని కోరారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ సీహెచ్ నాగేశ్వరరావు, అంజమ్మ, తదితరులు పాల్గొన్నారు.

తాళ్లూరులో..

తాళ్లూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మలేరియా దినోత్సవం సందర్భంగా తాళ్లూరు, తూర్పు గంగవరం పీహెచ్‌సీ పరిధిల్లో వైద్యసిబ్బంది శుక్రవారం ర్యాలీలు నిర్వహించారు. దోమల వల్ల సోకే వ్యాధుల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో వైద్యులు శ్రీకాంత్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మలేరియా రహిత ప్రాంతంగా కనిగిరిని తీర్చిదిద్దాలి

కనిగిరి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మలేరియా రహిత ప్రాంతంగా కనిగిరిని తీర్చిదిద్దాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సృజన అన్నారు. జాతీయ మలేరియా దినోత్సవం సందర్భంగా శుక్రవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.



దర్శిలో జరిగిన ర్యాలీలో పాల్గొన్న వైద్య సిబ్బంది

ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. మున్సిపల్ చైర్మన్ గఫార్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతోనే మలేరియా నివారణ సాధ్యమవుతుందన్నారు.

కార్యక్రమంలో రామాంజనేయులు, ప్రసాద్‌రెడ్డి, రమేష్, తదితరులు పాల్గొన్నారు.


విఠలాపురం సచివాలయం

అపరిశుభ్రంగా విఠలాపురం సచివాలయం


బూజుపట్టి అపరిశుభ్రంగా ఉన్న సిబ్బంది గది

తాళ్లూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): విఠలాపురం గ్రామ సచివాలయం అపరిశుభ్రతకు చిరునామాగా మారింది. గదులు, పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్న తమకేమి పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. విఠలాపురం సచివాలయంలో 11 మంది సిబ్బంది ఉన్నా గదుల అపరిశుభ్రత గురించి పట్టించుకోవడం లేదు. సచివాలయంలో పైఅంతస్థులో వుండే సిబ్బంది గది బూజుపట్టి దర్శనమిస్తున్నది ఆగదిని శుభ్రం చేసి నెలలు కావస్తున్నట్లుగా వుంది. గదిలోని కుర్చీ మట్టి, దుమ్ముతో నిండిపోయింది. మరుగుదొడ్ల శుభ్రత గురించి విస్మరించారు. ఇప్పటికయినా సంబంధిత అధికారులు స్పందించి విఠలాపురం సచివాలయాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని గ్రామస్థులు కోరుతున్నారు.

కష్టపడే కార్యకర్తలకు టీడీపీలో గుర్తింపు

ముండ్లమూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కష్టపడే కార్యకర్తలకు టీడీపీలో గుర్తింపు ఉంటుందని టీడీపీ నియోజకవర్గ నాయకుడు కడియాల రమేష్ అన్నారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుల ఎన్నిక సందర్భంగా మండల నాయకులతో కలసి పర్యటించారు. శంకరాపురం గ్రామ టీడీపీ అధ్యక్షుడిగా గమిడి హనుమంతరావు, వేములబండకు ఆకుల శేషయ్య, వేములకు మాదిరెడ్డి పెదకాశిరెడ్డి, తూర్పుకంభంపాడుకు చాగంటి అంజనేయులు, మారెళ్ళకు ఏనిగబోయిన శ్రీనివాసరావు, జమ్మలమడక గ్రామ పార్టీ అధ్యక్షుడిగా నలబోతుల సురేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే, పూరిమెట్లకు చొప్పరపు నాగేశ్వరరావు, బీమవరంకు అబ్బూరి గోవిందయ్య, ఉమామహేశ్వర అగ్రహారంకు రావులపల్లి శ్రీను, పెదఉల్లగల్లు గ్రామ పార్టీ అధ్యక్షుడిగా మోతుకూరి శంకర్‌ను ఎన్నుకున్నారు. ఎన్నికైన గ్రామ పార్టీ అధ్యక్షులకు కడియాల రమేష్ చేతులు మీదుగా నియామకపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మందలపు వెంకటరావు, పార్టీ మండల అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు, సోమేపల్లి శ్రీనివాసరావు, దేవినేని కోటేశ్వరరావు, కోడెగ మస్తాన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

సేవా పురస్కారాలు అందుకున్న ఎంపీపీ, జడ్పీటీసీ


నాయకత్వ సేవా అవార్డులను అందుకుంటున్న ఎంపీపీ శ్రీను, జడ్పీటీసీ వెంకటరెడ్డి

తాళ్లూరు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ఉత్తమ స్థానిక నాయకత్వ సేవా పురస్కారాలను ఎంపీపీ తాటికొండ శ్రీను, జడ్పీటీసీ మారం వెంకటరెడ్డి శుక్రవారం ఒంగోలులో అందుకున్నారు. జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాలు పురష్కరించుకుని ఉత్తమ స్థానిక నాయకత్వ సేవా పురస్కారాలను అందజేశారు. కార్యక్రమంలో మామిడి అప్పలనాయుడు, వీరభద్రాచారి తదితరులు పాల్గొన్నారు. ఈ అవార్డులను అందుకున్న ఎంపీపీ, జడ్పీటీసీలను మండలంలోని ప్రజాప్రతినిధులు, తదితరులు అభినందించారు.

పామూరు: జాతీయ పంచాయతిరాజ్ దినోత్సవ వేడుకలు సందర్భంగా పామూరు పట్టణ ఎంపీటీసీ -2 ఆకుపాటి వెంకటేష్ ఉత్తమ ఎంపీటీసీగా అవార్డు అందుకున్నారు. ఒంగోలులో జరిగిన కార్యక్రమంలో అవార్డును అందుకున్నారు.

ప్రతి కార్యకర్తకు అండగా ఉంటాం

కనిగిరి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం పనిచేసిన ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో పార్టీ పట్టణ అధ్యక్షుడు తమ్మినేని శ్రీనివాసులురెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో మహిళా కార్యకర్తలను తయారు చేయాలని సూచించారు. గ్రామాల్లో ప్రతి రైతుకు బయోగ్యాస్ ప్లాంట్ వల్ల జరిగే ప్రయోజనాల గురించి అవగాహన కల్పించాలన్నారు. కూటమి ప్రభుత్వంపై విషపు ప్రచారానికి దిగుతున్న వైసీపీ నేతల తప్పుడు ఆరోపణలు, అబద్ధపు ప్రచారాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు చిరంజీవి, దొడ్డా వెంకటసుబ్బారెడ్డి, జంషీర్ అహ్మద్, ఫిరోజ్, రోషన్ సంధాని, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబానికి చెక్కు పంపిణీ

తాళ్లూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యకర్తల కుటుంబాలకు పార్టీ ఉండగా ఉంటుందని ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తూర్పుగంగవరం సర్పంచ్ నాగమణి భర్త మృతి చెందారు. పార్టీ సభ్యత్వం ఉండటంతో ప్రమాద బీమా కింద రూ.5 లక్షలు మంజూరయ్యాయి. శుక్రవారం దర్శిలోని ఆమె నివాసంలో నగదు చెక్కును కుటుంబీకులకు అందజేశారు. ఈసందర్భంగా డాక్టర్ లక్ష్మి మాట్లాడుతూ సర్పంచ్ నాగమణి కుటుంబానికి అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో నాయకులు డాక్టర్ లలిత్‌సాగర్, గోపిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, కాశిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

దర్శి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): వాహనచోదకులు ఓవర్‌లోడ్‌తో ప్రయాణిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మోటారు వెహికిల్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ హెచ్చరించారు. దర్శిలో శుక్రవారం ప్రైవేట్ వాహనాలను ఆర్టీసీ అధికారులతో కలిసి తనిఖీలు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న వాహనాలకు రూ.20వేలు జరిమానా విధించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటోలు, మినీ లారీల్లో నిబంధనలకు విరుద్ధంగా ఎక్కువ మందిని ఎక్కించుకొని ప్రయాణించటంవల్ల ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. ఇటీవలకాలంలో ఓవర్‌లోడ్‌తో ప్రయాణిస్తున్న ఆటోలు బోల్తాపడి పలువురు మృతిచెందటమే కాక అనేకమంది గాయాల పాలయ్యారన్నారు. నిబంధనలు అతిక్రమించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు జె.రామయ్య తదితరులు పాల్గొన్నారు.


మినీ లారీని తనిఖీ చేస్తున్న మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, ఆర్టీసీ అధికారులు

ఉష్ణోగ్రత (అంచనా)

26-4-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	39	26
తెనాలి	38	26
నరసరావుపేట	40	24
బాపట్ల	36	27
రెంటచింతల	41	26

ఉపాధి పనిదినాల్లో.. భారీగా కోత!

- తగ్గిన 12.70 లక్షల పనిదినాలు
- అమలు కాని రూ.307 కనీస వేతనం
- జిల్లాలో సగటు వేతనం రూ.282 మాత్రమే

ఆర్థిక సంవత్సరం	పనిదినాలు
2022-23	94,05,074
2023-24	84,76,071
2024-25	87,48,695
2025-26	74,77,946



(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

జిల్లాలో 5.88 లక్షల జాబ్ కార్డులు రిజిస్ట్రేషన్ చేశారు. 4.29 లక్షల కార్డులు యాక్టివ్‌లో ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం ఒక్కొక్క కార్మికునికి రోజుకు రూ.307గా వేతనం ప్రకటించింది. ఈ మేరకు వేతనం కార్మికులకు అందడం లేదు. ఈ నెలలో ఇప్పటి వరకు చెల్లించిన సగటు వేతనం రూ.282గా ఉంది. గతేడాది రూ.300 ప్రకటించగా రూ.222 నుంచి రూ.279 వరకు మాత్రమే చెల్లించారు. ప్రభుత్వం సూచించిన విధంగా కార్మికులకు వేతనం చెల్లించే విషయంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పనులు గుర్తించి వాటికి అంచనా వ్యయం రూపొందించే సమయంలోనే నిర్దేశించిన వేతనం కార్మికునికి చెల్లించేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఈ ప్రక్రియలో జరుగుతున్న లోపాల వల్ల కార్మికులు కనీస వేతనం అందక నష్టపోతున్నారు. ఉపాధి హామీ పని దినాల్లో కేంద్ర ప్రభుత్వం భారీగా కోత విధిస్తోంది. 12.70 లక్షల పనిదినాలు తగ్గించడంతో వంద రోజుల పని గ్యారెంటీకి విఘాతం కలిగే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత ఐదేళ్లలో ఇంత తక్కువగా పనిదినాలను తగ్గించడం ఇదే ప్రథమం. ఇది ఉపాధి హామీని నిర్వీర్యం చేసేలా ఉందని గ్రామీణాభివృద్ధి కార్మికులు ఆరోపిస్తున్నారు. మళ్లీ వలసలు వెళ్లే పరిస్థితులు వస్తాయని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సొంత ఊరిని వదిలి.. పనుల కోసం వలసలు వెళ్లకుండా నిరోధించేందుకు మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోంది. సొంత ఊరిలోనే పనులు కల్పించి, ఉపాధి కల్పిస్తోంది. ఇలాంటి ఉన్నతమైన పథకం ద్వారా ప్రతి ఏటా పనిదినాలు పెంచాల్సింది పోయి.. ఈ ఏడాది భారీగా ప్రభుత్వం కోత విధించింది. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది 12.70 లక్షల పనిదినాల కోత పడింది. దీని వల్ల పెద్ద ఎత్తున జిల్లాలో కార్మికులు ఉపాధిని కోల్పోనున్నారు. కనీస వేతనం రూ.307గా ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. అంటే దాదాపు రూ.39.01 కోట్లు కార్మికులు కోల్పోనున్నారు. ఉపాధి పనిదినాల కేటాయింపులు పెంచాలని వారు కోరుతున్నారు.

లక్ష్యానికి దూరంగా పనులు

ఈ నెలలో 7,71,052 పని దినాలు లక్ష్యంగా ఉంది. ఇప్పటి వరకు 2,98,284 పని దినాలను కల్పించారు. 38.68 శాతం కూడా పనిదినాలు పూర్తి కాలేదు. ఇంకా ఐదు రోజుల్లో లక్ష్యం మేర పనిదినాలు కల్పించే పరిస్థితులు లేవనే చెప్పాలి. కార్మికులకు పనులు కల్పించడంలో ఉపాధి శాఖ క్షేత్రస్థాయి అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పనుల వ్యయం అంచనా రూపొందించే సమయంలో ప్రతి కార్మికునికి రూ.307 వేతనం అందేలా ప్రణాళిక ఉండాలని ఉన్నతాధికారులు ఆదేశించినా ప్రయోజనం కనిపించడం లేదు. ఇందుకు నిదర్శనం కార్మికునికి వేతనం రూ.282 చెల్లించడమే. అందరికి ప్రభుత్వం ప్రకటించిన వేతనం చెల్లించాలని కూలీలు డిమాండ్ చేస్తున్నారు.

లక్ష్యాలకు అనుగుణంగా ప్రణాళికలు ఉండాలి

- స్వర్ణాంధ్ర-2047 సాధన దిశగా 15 శాతం వృద్ధే ధ్యేయం
- అన్ని రంగాల వివరాలు సేకరించి కార్యచరణ సిద్ధం చేయాలి
- నియోజకవర్గాల విజన్ యాక్షన్ ప్లాన్‌పై శిక్షణలో కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర 2047కు అనుగుణంగా నియోజకవర్గాల విజన్ యాక్షన్ ప్రణాళికలను నిర్దేశిత లక్ష్యాలు, మార్గదర్శకాలు ప్రకారం సిద్ధం చేయాలని గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి అధికారులకు సూచించారు. ప్రణాళిక విభాగం ఆధ్వర్యంలో విజన్ యాక్షన్ ప్రణాళికపై గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ ఉద్యోగులకు(సీవీఏపీఎస్) శుక్రవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాల్లో శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ స్వర్ణాంధ్ర 2047 సాధన దిశగా అన్ని రంగాల్లో 15 శాతం వృద్ధి సాధించే లక్ష్యంతో రానున్న ఐదేళ్లలో రాష్ట్ర, జిల్లా స్థాయిలో విజన్ యాక్షన్ ప్లాన్ రూపొందించామన్నారు. దీనికి అనుగుణంగా నియోజకవర్గ స్థాయిలో స్థానిక ఎమ్మెల్యేలను సమన్వయం చేసుకుంటూ వీఏపీలను రూపొందించాలన్నారు. స్థానిక అవసరాలు, పరిస్థితులకు అనుగుణంగా ఆర్థిక వృద్ధి సాధించేందుకు అవకాశం ఉన్న రంగాల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలపై పూర్తిస్థాయి వివరాలతో కార్యచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు. నియోజకవర్గంలోని అన్ని రంగాల వివరాలను సేకరించి క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా వృద్ధికి అవకాశం ఉన్న రంగాల్లో నూతన ప్రాజెక్టులు ఏర్పాటుకు యాక్షన్ ప్లాన్‌తో పాటు సక్రమంగా అవి అమలయ్యేందుకు ఉన్న అవకాశాలను కూడా తెలియజేయాలన్నారు. వీఏపీని రూపకల్పనపై ప్రణాళిక విభాగం డైరెక్టర్ రాంబాబు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సీపీవో శేషశ్రీ, ప్రణాళిక విభాగం సలహాదారు సీతాపతి పాల్గొన్నారు.



శిక్షణలో ప్రసంగిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

నిరీక్షణకు తెర



- స్పౌజ్ కోటా పింఛన్లకు ఆమోదం
- మూడు జిల్లాల్లో 10 వేల మందికి ఛాన్స్
- 2023-2024 మధ్య మృతుల కుటుంబాలకు అవకాశం
- 30వ తేదీ లోగా దరఖాస్తు.. మే నెల నుంచి పింఛన్
- ఏళ్లుగా ఎదురు చూస్తున్న లబ్ధిదారుల్లో హర్షం

గుంటూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కొత్తగా పింఛన్లకు దరఖాస్తు చేసుకునేందుకు ఎదురు చూస్తున్న వారికి ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. కొత్త పింఛన్ల మంజూరు విషయంలో తొలి విడతగా స్పౌజ్ కోటా పింఛన్లకు దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఇప్పటికే ఈ విధానం కొనసాగుతున్నా అది 2024 అక్టోబరు తర్వాత చనిపోయిన వారికి మాత్రమే వర్తిస్తోంది. అంతకు ముందు చనిపోయిన వారికి వర్తించడం లేదు. ప్రభుత్వం తాజాగా అలాంటి వారికి కూడా అవకాశం కల్పించేందుకు సిద్ధమైంది. తాజాగా అవకాశం కల్పించిన స్పౌజ్ కోటా పింఛన్ల దరఖాస్తులకు ప్రభుత్వం లిమిటేషన్ విధించింది. 2023 డిసెంబరు నుంచి 2024 అక్టోబరు మధ్య చనిపోయిన పింఛనుదారు కుటుంబీకులకు మాత్రమే ప్రస్తుతం స్పౌజ్ కోటాలో పింఛన్లకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించింది. ఈ లెక్కన గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో 10 వేల మంది పింఛన్లకు అర్హులవుతారని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ప్రభుత్వం నిర్ణీత కాలంలో చనిపోయిన వారికే దరఖాస్తు అవకాశాన్ని కల్పించడంపై అర్హులై ఉండి పింఛన్ల కోసం ఎదురు చూస్తున్న అనేక మంది పెదవి విరుస్తున్నారు. 2023 డిసెంబరుకు ముందు చనిపోయినవారి పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

నిబంధనల పేరిట గతంలో వడపోత..

గత వైసీపీ ప్రభుత్వంలో నిబంధనల పేరుతో వడపోత పోసి వేలాది మందిని అనర్హులుగా ప్రకటించింది. ఇంటిస్థలం ఎక్కువ ఉందని, 300 యూనిట్ల కంటే ఎక్కువ విద్యుత్ వినియోగం ఉందని, నాలుగు చక్రాల వాహనం ఉందని, ఇన్‌కమ్‌టాక్స్ చెల్లించారని, కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగి ఉన్నాడని, సవాలక్ష కారణాలు చూసి ఉమ్మడి గుంటూరు జిల్లాలో రెండు విడతలుగా 65 వేల మందిని అనర్హులుగా ప్రకటించి వారికి పింఛను ఎగ్గొట్టింది. ఈ ప్రక్రియను నిరంతరాయంగా కొనసాగిస్తూ అనేక మందికి పింఛను ఆపేసింది. గత ప్రభుత్వ హయాంలో పింఛనుదారు మరణిస్తే దాన్ని కుటుంబ సభ్యులకు వర్తింపజేయలేదు. దీంతో వారు కూడా పింఛన్ల కోసం నిరీక్షించేవారి జాబితాలోనే ఉన్నారు. ఇప్పుడు వారంతా పింఛన్లకు దరఖాస్తు చేసుకునే అవకాశం కోసం ఎదురు చూస్తున్నారు. అయితే ప్రభుత్వం ఈ విషయంలో ఆచి తూచి స్పందిస్తోంది. ప్రస్తుతం ఉన్న అనర్హులను ఏరివేస్తూ, వారి స్థానంలో అర్హులైన వారికి అవకాశం కల్పిస్తోంది. ఆ క్రమంలో తొలివిడతగా స్పౌజ్ కోటా పింఛన్లకు అవకాశం కల్పించింది.

దరఖాస్తు ఇలా..

స్పౌజ్ కోటాలో పింఛనుకు దరఖాస్తు చేసుకోవాలనుకునే అర్హులైన లబ్ధిదారులు గ్రామ, వార్డు సచివాలయానికి వెళ్లి పేర్లు నమోదు చేసుకోవాలి. భార్యా భర్త ఇద్దరూ హౌస్‌హోల్డ్ మ్యాపింగ్‌లో నమోదై ఉండాలి. ఒకే రేషన్ కార్డులో పేర్లు ఉండాలి. భర్త చనిపోయినట్లు డెత్ సర్టిఫికెట్ ఉండాలి. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతోపాటు ఆధార్ కార్డు కూడా తీసుకుని సచివాలయానికి వెళితే డిజిటల్ అసిస్టెంట్ ఆన్‌లైన్ పద్ధతిలో దరఖాస్తు చేస్తారు. స్పౌజ్ కేటగిరిలో పింఛన్‌కు దరఖాస్తు చేసుకునేవారు అర్హులైనప్పటికీ హౌస్‌హోల్డ్ మ్యాపింగ్‌లో ఒకే ఇంట్లో లేకుండా ఉంటే వారు ఈ కోటా కింద అనర్హులు అవుతారు. వారు జనరల్ కోటాలో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

మోదీకి మహిళలతో స్వాగతం

- సుమారు కిలోమీటర్ పొడవునా రోడ్డు షో
- రూట్‌మ్యాప్‌ని పరిశీలించిన కలెక్టర్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ పీడీ

గుంటూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని పునఃశంకుస్థాపన కార్యక్ర మంలో పాల్గొనేందుకు శుక్రవారం (మే 2) రానున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి మహి ళలు పెద్ద ఎత్తున ఘన స్వాగతం పలకనున్నారు. ప్రధాని హెలికాప్టర్ ల్యాండింగ్ అయ్యే హెలిప్యాడ్ వద్ద నుంచి సుమారు కిలోమీటర్ పొడవునా సీఎం చంద్రబాబుతో కలిసి మోదీ రోడ్డు షోలో పాల్గొన నున్నారు. ఇందుకోసం ఇన్‌చార్జి బాధ్యతలను స్త్రీ, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ ఎం వేణుగోపాల్‌రెడ్డికి ప్రభుత్వం కేటాయించింది. దీంతో శుక్రవారం జిల్లా కలెక్టర్ నాగలక్ష్మితో కలిసి ఆయన రోడ్డు షో ప్రాంతంలో పర్యటించారు. రోడ్డు షో రూట్ మ్యాప్‌ని పరిశీలించి ఆ మార్గానికి ఇరు వైపులా మహిళలను ఏ విధంగా తీసుకురా వాలనే దానిపై సమీక్షించారు. కిలోమీటర్ పొడవునా మహిళలు ప్రధానికి చేతులు ఊపుతూ... స్వాగతిస్తూ ప్లకార్డులు ప్రదర్శించేలా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఇందుకోసం గుంటూరు, కృష్ణా జిల్లాల నుంచి మహిళలను సమీక రించాలని ఆదేశించారు. ఎండ తీవ్రత దృష్ట్యా ప్రజలు ఇబ్బంది పడకుండా తాగునీరు, ఆహార సదుపాయాలను సమకూర్చాలని తెలిపారు. అలానే ఎక్కడికక్కడ రవాణా సౌకర్యాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ సీఈవో సతీష్‌కుమార్, బీసీ సంక్షేమ శాఖ సెక్రెటరి మల్లికార్జున, మెప్మా ఎండీ తేజ్‌భరత్, ఎస్పీ సతీష్‌కు మార్, జేసీ భార్గవతేజ పాల్గొన్నారు.


ప్రధాని మోదీ పాల్గొనే రోడ్డు షో రూట్‌మ్యాప్‌ని పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

గ్రామానికో.. మోడల్ పాఠశాల

- తరగతికి ఒక ఉపాధ్యాయుడు తప్పనిసరి
- ప్రాథమిక విద్య పటిష్ఠతకు ప్రభుత్వం కసరత్తు

తెనాలి అర్బన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం అస్తవ్యస్థం చేసిన ప్రాథమిక విద్యా రంగాన్ని పటిష్ఠ పరిచేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది. ఇందులో భాగంగా మోడల్ ప్రాథమిక పాఠశాలలను ఏర్పాటు చేయాలని ప్రభు త్వం నిర్ణయించింది. మోడల్ పాఠశాలల ద్వారా ప్రాథమిక విద్యా రంగాన్ని బలోపేతం చేసేలా కార్యచరణ రూపొందించింది. వచ్చే విద్యా సంవత్సరం ఆరంభం నాటికి బడులను చక్కదిద్దేలా విద్యాశాఖ కసరత్తు చేపట్టింది. తక్కువ మంది విద్యార్థులు, ఎక్కువ పాఠశాలలు, తక్కువ మంది ఉపాధ్యాయుల కారణంగా ప్రాథమిక విద్య నానాటికి దిగజారిపోతుంది. చదవడం, రాయడం, లెక్కలు చేయడం వం టి ప్రాథమిక పరిజ్ఞానం కూడా విద్యార్థుల్లో లేదని పలు సర్వేలు చెబుతున్నాయి. ప్రాథమిక విద్య పునా ది సరిగా లేకపోవడంతో ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులు చదువును అందుకోలేకపోతున్నా రని ఆయా సర్వేల్లో తేలింది. ఈ పరిస్థితులను మార్చి ప్రాథమిక విద్యలో తరగతికి ఒక ఉపాధ్యాయుడు, ఒక గది ఉండేలా మోడల్ ప్రాథమిక పాఠశాలలు ఏర్పా టు కానున్నాయి. ప్రతి గ్రామంలో మోడల్ ప్రాథమిక పాఠశాలలు ఏర్పాటు చేయాలనే లక్ష్యంగా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. గతంలో ప్రాథమిక పాఠశాలల్లో 120 లేదా 90 మంది విద్యార్థులు ఉంటేనే ఐదుగురు ఉపాధ్యాయులను నియమిం చేవారు. 60 మంది విద్యార్థులు దాటిన ప్రతి ప్రాథమిక పాఠశాలను మోడల్ పాఠశాలగా ఎంపిక చేసి ఒక్కో తరగతికి ఒకరు చొప్పున ఐదు తరగతులకు ఐదుగురు ఉపాధ్యాయులను కేటాయించనున్నారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టి న జీవో 177 రద్దు చేసి ఉన్నత పాఠశాలల్లో ఉన్న విద్యార్థులను తిరిగి ఆయా మోడల్ పాఠశాలల్లో చేర్చా లని ఆదేశాలు జారీ చేసింది. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు కూడా ఫలితాలలో మె రుగు అవుతాయని ఆశిస్తోంది.


మోడల్ కానున్న రామలింగేశ్వరపేట ప్రాథమిక పాఠశాల

అధికారుల్లో ప్రణాళిక లోపం...

ప్రభుత్వ లక్ష్యం ఉన్నతంగా ఉన్నా విద్యాశాఖ అధికారుల్లో ప్రణాళికా లోపం కనిపిస్తోంది. మోడల్ ప్రాథమిక పాఠశాలలను ఎంపిక చేయడంలో అధికారుల్లో సరైన ప్రణాళిక లేకుండా పోయింది. దీంతో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలోని పలు గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థుల తల్లి దండ్రుల నుంచి వ్యతిరేకత వ్యక్తం అవుతుంది. అందరికీ అందుబాటులో ఉండేలా మోడల్ ప్రాథమిక పాఠశాలలను నిర్ణయించాలి. కానీ వసతు లు పేరిట దూరంగా ఉండే పాఠశాలలను ఎంపిక చేయడంపై తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అందరికీ అందుబాటులో ఉన్న పాఠశాలలో వసతులు లేవనే సాకుతో వాటిని ఎంపిక చేయడంలేదంటున్నారు. దగ్గర్లో ఉన్న బడిని వదిలి దూరంగా ఉండే పాఠశాలను ఏర్పాటు చేస్తే తమ పిల్లలు వెళ్లలేరంటున్నారు. ఫలితంగా ప్రభుత్వం ఆశిం చిన లక్ష్యం నెరవేరకుండా పోయేలా ఉంద ని విద్యావేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నా రు. ఇప్పటికీ ఏ గ్రామంలో, ఏ పట్టణంలో ఎన్ని మోడల్ ప్రాథమిక పాఠశాలలు ఏర్పా టైన విషయాన్ని కూడా అధికారులు ఇంత వరకు తేల్చలేదు.

నేడే మత్స్యకారులకు చేయూత

- రూ.10 వేల నుంచి 20 వేలకు పెరిగిన పరిహారం
- 12,671 మంది గంగపుత్రుల ఖాతాల్లో రూ.25 కోట్లు జమ

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

వేట నిషేధ భృతిని పంపిణీ చేసేందుకు మత్స్యకారులకు చేయూత కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. సీఎం చంద్రబాబునాయుడు శనివారం శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లలో ఈ కార్య క్ర మానికి శ్రీకారం చుట్టనున్నారు. ఇక బాపట్ల జిల్లా విషయానికి వస్తే నిజాంపట్నం మండలం కొత్తపాలెంలో మత్స్యకారుల చేయూతను మంత్రి అనగాని సత్యప్రసాద్ పంపిణీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ ప్రకారం వేట నిషేధ భృతిని రూ.10,000 నుంచి రూ.20,000 పెంచి మత్స్యకారుల ఖాతాల్లో జమ చేయడానికి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. శనివారం నుంచి ఈ నిధులు గంగపుత్రుల ఖాతాల్లో జమ కానున్నాయి. జిల్లా వ్యాప్తంగా 12,671 మంది మత్స్యకారులకు పరి హారం అందనుంది. మొత్తం రూ.25 కోట్లు వారి ఖాతాల్లో జమ కానున్నాయి. క్షేత్రస్థాయిలో దాదాపు వారం రోజులు సమగ్ర సర్వే చేపట్టి లబ్ధిదారుల ఎంపికను పారదర్శకంగా జరిపినట్లు మత్స్యశాఖ అధికారులు తెలిపారు. అధికారులు తెలిపారు. జిల్లాలోని మత్స్యకారులు, ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి కలెక్టరేట్ వేదికగా రెట్టింపు పరిహా రం ఆనందాన్ని జరుపుకోవడానికి అన్ని ఏర్పాట్లు చేశామని శుక్రవారం ఓ ప్రకటనలో మత్స్యశాఖ తెలిపింది.



..ఆ చెట్టు నీడన

చరిత్ర పుటల్లో నిలిచిన వృక్షాలు

మండే ఎండలో ఆ చెట్ల వద్దకు రాగానే.. కాసేపు సేద తీరాలి అనే కోరిక కలుగుతుంది. స్థానికులు, పాదచారులు, ఇతర జీవజాతులకు ఆయా చెట్ల నీడలో సేద తీరుతున్నాయి. మన పూర్వీకులు నాటిన మొక్కలే నేడు మానులై గ్రామ, పట్టణ చరిత్రలో ప్రముఖంగా నిలిచాయి. గ్రామాలు, పట్టణాల్లోని కొన్ని చెట్లు చరిత్ర పుటల్లో నిలిచి ఆయా ప్రాంతాలకు ప్రత్యేక ప్రాధాన్యాన్ని ఇస్తున్నాయి. వాటిలో ఒక్కో చెట్టుకు ఒక్కో చరిత్ర. వాటి స్థితిగతులను బట్టి దబాబ్దాలుగా ప్రత్యేక పేర్లతో పిలుస్తున్నారు.

\- చీరాల, అద్దంకి, పర్చూరు, ఆంధ్రజ్యోతి

అందమైన అనుబంధం

చీరాల నుంచి వేటపాలెం వెళ్లే ప్రధాన రహదారిలో బ్రహ్మంగారి చెట్టు ఉంది. సుమారు 300 ఏళ్ల క్రితం ఇక్కడో ఆలయం వెలసింది. కాగా సుమారు 80 ఏళ్ల క్రితం స్థానికులు ఆలయానికి ఆనుకుని ఓ రాగి మొక్కను నాటారు. అది ఇప్పుడు మహా వృక్షంగా మా రింది. బ్రహ్మంగారి చెట్టు అని పిలిచేలా రూపాంతరం చెందింది. అలాగే పేరాల ముత్యాలమ్మ పేటలో వేంచేసియున్న మహాలక్ష్మమ్మ చెట్టు సుమారు 50 ఏళ్ల క్రితం ఏర్పడింది.


అద్దంకి : దూదేకుల పాలెంలో ఉన్న జెండా చెట్టు, ముందు వైపు ఉన్న అరుగులు


చీరాల - వేటపాలెం రోడ్డులోని బ్రహ్మంగారి చెట్టు

ప్రత్యేక గుర్తింపు

అద్దంకిలో మహాలక్ష్మమ్మ చెట్టు, జెండా చెట్టు ప్రత్యేకంగా ఉన్నాయి. గుంజివారిపాలెంలో తరతరాల క్రితం నుంచి మహాలక్ష్మమ్మ చెట్టు ఉంది. ఇక్కడ మహాలక్ష్మమ్మ దేవాలయం నిర్మించారు. భవానీ సెంటర్ సమీపంలోని దూదేకులపాలెంలో శతాబ్ద కంటే ముందు నుంచి ఉన్న వేప చెట్టు.. జెండా చెట్టుగా గుర్తింపు పొందింది.

తరాల నాటి వేపచెట్టు

పర్చూరు బొమ్మల సెంటర్ కూడలిలో తరాల నాటి వేపచెట్టు ప్రయాణికులకు, ప్రజలకు సేద తీర్చేందుకు నిలయంగా మారింది. చిరువ్యాపారులు కూడా ఇదే చెట్టును ఆవాసంగా చేసుకొని వ్యాపారాలు సాగిస్తుంటారు.

14న చీరాల మున్సిపాలిటీలో అవిశ్వాస పరీక్ష

ఇప్పటికే అధికారుల నుంచి కౌన్సిలర్లకు అందిన నోటీసులు

చీరాల, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : చీరాల మునిసిపల్ ఛైర్మన్ జంజనం శ్రీనివాసరావుపై కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాసంపై అధికారులు మే 14వ తేదీన బలనిరూపణ చేయనున్నారు. అందుకు సంబంధించి సమావేశానికి హాజరు కావాలని శుక్రవారం 33 వార్డుల కౌన్సిలర్లకు నోటీసులు అందాయి. అవిశ్వాసానికి వెళ్లిన కౌన్సిలర్లు పొందుపరిచిన అంశాల్లో ముఖ్యంగా ఛైర్మన్ పలు చోట్ల నిధులు దుర్వినియోగానికి పాల్పడ్డారని, పలు అభివృద్ధి పనుల్లో అవకతవకలు పాల్పడ్డారని వివరించారు. అంతేకాకుండా ప్రజాప్రతినిధులైన వారికి ఎటువంటి గౌరవం ఇవ్వడం లేదని పొందుపరచడం గమనార్హం. ప్రస్తుతం ఈ విషయం పట్టణంలో హాట్ టాపిక్‌గా నడుస్తోంది.

పాలిసెట్ హాల్ టికెట్లు విడుదల

ఒంగోలు విద్య, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలకు నిర్వహిస్తున్న పాలిసెట్-25 హాల్ టిక్కెట్లు విడుదలైనట్లు ఒంగోలు ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ శివప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష ఈనెల 30న జరుగుతుందని, హాల్‌టిక్కెట్లను పాలిసెట్ ఏపీ.నిక్.ఇన్ వెబ్‌సైట్ నుంచి విద్యార్థులు డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. చివరి నిమిషంలో సమస్యలు తలెత్తకుండా ముందుగానే హాల్‌టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని ఆయన కోరారు.

డీఈఈ సెట్ నోటిఫికేషన్ విడుదల

ఒంగోలు విద్య, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): డిప్లమో ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఈఎల్ఈడీ) కోర్సులో 2025-26 సంవత్సరంలో ప్రవేశాలకు నిర్వహించే డీఈఈసెట్ నోటిఫికేషన్ విడుదలైందని ఛైనంపాడు డైట్ ప్రిన్సిపాల్ సామా సుబ్బారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డీఈడీ కళాశాలలు, ప్రభుత్వ డైట్‌లలో ప్రవేశాలకు అభ్యర్థులు ఈ పరీక్ష రాయాల్సి ఉంటుందన్నారు. ఈ పరీక్షకు మే 8వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలి. ఫీజు చెల్లింపునకు మే 7వతేదీ వరకు అవకాశం ఇచ్చారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులు డీఈఈ సెట్‌కు దరఖాస్తుకు అర్హులు. మే 20నుంచి ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలి. జూన్ 2,3 తేదీల్లో పరీక్ష నిర్వహిస్తారు. జూన్ 10న ఫలితాలు ప్రకటిస్తారని సుబ్బారావు పేర్కొన్నారు.

అభ్యంతరాలకు నేటితో ఆఖరు : డీఈవో

ఒంగోలు విద్య, ఏప్రిల్25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతులకు సంబంధించిన సీనియారిటీ జాబితాలపై అభ్యంతరాలు తెలిపేందుకు శనివారం తుది గడువు అని డీఈవో ఎ.కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్ యాజమాన్యా పాఠశాలల్లో పనిచేస్తున్న సెకండరీ గ్రేడ్ టీచర్లకు స్కూలు అసిస్టెంట్లుగా, స్కూలు అసిస్టెంట్లకు ప్రధానోపాధ్యాయులుగా ఉద్యోగోన్నతులకు సంబంధించిన సీనియారిటీ జాబితాలు జిల్లావిద్యాశాఖ వెబ్‌సైట్‌లో ఉన్నాయి. అన్ని సబ్జెక్టులకు సంబంధించిన సీనియారిటీ జాబితాలపై అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలన్నారు. జాబితాలో అభ్యంతరం ఎక్కడుందో పేర్కొంటూ తగిన ఆధారాలు కూడా అందజేయాలన్నారు.

నేటితో ముగియనున్న వైద్య ధ్రువీకరణ పత్రాల జారీ

ఒంగోలు విద్య, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): వచ్చేనెలలో జరగనున్న ఉపాధ్యాయ బదిలీల్లో ప్రాధాన్యత కేటగిరి కింద బదిలీ పొందేందుకు వైద్య ధ్రువీకరణ పత్రాల జారీ శనివారంతో ముగియనుంది. ఈనెల 24నుంచి ఒంగోలులోని రిమ్స్‌లో ఈ వైద్య ధ్రువీకరణ పత్రాలు జారీకి మెడికల్ బోర్డు పరీక్షలు నిర్వహిస్తున్నది. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని టీచర్లు మొదటి రోజు 230 మంది, శుక్రవారం 116 మంది వైద్య పరీక్షలకు హాజరయ్యారు. శనివారంతో ఈ మెడికల్ బోర్డు వైద్య పరీక్షల గడువు ముగుస్తుందని డీఈవో కోరారు.

ఇంటర్న్‌షిప్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): యువ ప్రకాశం పేరుతో వేసవిలో నిర్వహిస్తున్న ఇంటర్న్‌షిప్ కార్యక్రమాన్ని విద్యార్థినీ, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తమీమ్‌అన్సారియా పిలుపునిచ్చారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ సమావేశపు హాలులో శుక్రవారం యువజన సంక్షేమశాఖ కార్యాలయం ప్రచురించిన పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. 30 రోజుల పాటు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. వాటర్‌మేనేజ్‌మెంట్, హెల్త్, పంచాయతీరాజ్, ఉపాధి కల్పన, మహిళా శిశు ఆరోగ్య, రోడ్లు, భవనాలు, నగర అభివృద్ధి అంశాలపై అవగాహన కల్పిస్తామని తెలిపారు.

సమస్యలే ఇతివృత్తాలుగా నాటిక ప్రదర్శనలు



జ్యోతి ప్రజ్వలనలో జాష్టి వెంకట మోహనరావు, బాబూరావు,పలు కళాపరిషత్ ల అధ్యక్షులు



జనరల్ బోగీలు నాటికలో ఓ సన్నివేశం

మార్టూరులో రెండవరోజు కొనసాగిన రోటరీ కళాపరిషత్ నాటికపోటీలు

మార్టూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : మార్టూరులో శ్రీకారం రోటరీ కళాపరిషత్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి రెండో రోజు 15వ తెలుగురాష్ట్రాల నాటిక పోటీలను ప్రదర్శించారు. తొలుత శ్రీసాయి ఆర్ట్స్ కొలకలూరు వారిచే జనరల్ బోగీలు నాటిక ప్రదర్శితమైంది. మన కుటుంబాలు నిత్యం ప్రయాణించే రైలు జనరల్ బోగీలలో ప్రయాణించేవారి వివరాలు రైల్వే వారి దగ్గర ఉండాలని, జనరల్ బోగీలు సంఖ్య పెరగాలని, ఇలా లేనందువలన జరుగుతున్న ఇబ్బందులకు చక్కగా ఈ నాటికలో వివరించారు. తరువాత శ్రీచైతన్య కళాస్రవంతి విశాఖ పట్టణం వారు ప్రదర్శించిన (అ)సత్యం నాటిక రోజూ మన కళ్లెదుట జరుగుతున్న కొన్ని యథార్థ సంఘటనలను ఉదహరిస్తూ కళాకారులు నాటికను ప్రదర్శించారు. మన కంటికి కనిపించేదంతా సత్యంకాదు, కంటికి కనిపించనిదంతా అసత్యం కాదు అనే దృక్పథంతో నాటిక ప్రదర్శన సాగింది. చివరగా మనుషులు బంధాలు, అనుబంధాలు, వాటి విలువల మధ్య రక్షణగా, సంతోషంగా ఉంటారనే విషయాన్ని కళానికేతన్ వీరన్నపాలెం వారు ప్రదర్శించిన రుతువులేని కాలం నాటిక రోజూ మన కుటుంబాలలో జరుగుతున్న సన్నివేశాలను కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు.

జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభం

తొలుత నటరాజ విగ్రహం వద్ద జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో శ్రీకారం సంస్థ కార్యదర్శి జాష్టి అనూరాధ, రోటరీ అధ్యక్షుడు మద్దుమాల కోటేశ్వరరావు, ఎఫర్ట్ సంస్థ డైరెక్టర్ జాష్టి వెంకట మోహనరావు, అనంతవరం ఎన్‌టీఆర్ కళాపరిషత్ అధ్యక్షుడు గుదే పాండురంగారావు, వరగాని కళాపరిషత్ అధ్యక్షుడు నాగేశ్వరరావు, వీరన్నపాలెం కళాపరిషత్ అధ్యక్షుడు వైవీ చౌదరిలు పాల్గొన్నారు. అనంతరం జరిగిన సభలో రిలయన్స్ ఫౌండేషన్ జిల్లా మేనేజరు ఏవీ బాబూరావు మాట్లాడుతూ రోటరీ కళాపరిషత్ నాటిక పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ సభ్యులు ఈశ్వర ప్రసాద్, శానంపూడి లక్ష్మయ్య, జాష్టి సాంబశివరావు, ఇంటూరి ఆంజనేయులు, రావి అంకమ్మచౌదరి, మాదాల సాంబశివరావు, గుండవరపు వెంకటప్రసాద్ పాల్గొన్నారు.

నేడు ప్రదర్శించనున్న నాటికలు

ముగింపురోజు శనివారం రాత్రి విశ్వశాంతి కల్చరల్ హైదరాబాదు వారిచే స్వేచ్ఛ నాటిక,తరువాత అరవింద ఆర్ట్స్ తాడేపల్లి వారిచే విడాకులు కావాలి నాటిక, చివరగా శ్రీ మైత్రి కళానిలయం, విజయవాడ వారిచే బ్రహ్మస్వరూపం నాటికను ప్రదర్శిస్తారు.

ఆలోచింపజేసిన 'యాభై కోట్లు' నాటిక

ప్రదర్శించిన శ్రీకారం రోటరీ కళాపరిషత్ సభ్యులు

మార్టూరు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి) : వారు రంగస్థల కళాకారులు కాదు, ఏనాడూ నాటికల ప్రదర్శనలు చేయలేదు. వివిధ వృత్తులలో స్థిరపడిన ఉన్నత ఉద్యోగులు, వ్యాపారులు, రైతులు, వారందరూ మార్టూరులో శ్రీకారం రోటరీ కళాపరిషత్ సభ్యులు. వారికి కళారంగంపై ఆసక్తి ఉంది. కళాకారులను ప్రోత్సహించాలనే తపన ఉంది. ఈ ఉద్దేశ్యంతోనే గత 14 ఏళ్లనుంచి మార్టూరులో శ్రీకారం రోటరీ కళాపరిషత్ ఉభయ రాష్ట్రాల తెలుగు నాటిక పోటీలను నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది గురువారం నుంచి మార్టూరులో నిర్వహిస్తున్న 15వ తెలుగు రాష్ట్రాల నాటిక పోటీలలో కొంతమంది శ్రీకారం రోటరీ కళాపరిషత్ సభ్యులు ప్రదర్శించిన నాటిక యాభై కోట్లు ఆ తరువాత నాటిక ప్రేక్షకులను ఆకట్టుకోవడమే గాకుండా అందరినీ ఆలోచింపచేసింది. కేవలం డబ్బుసంపాదన వ్యామోహంలో మునిగిపోయిన భార్యాభర్తలు మానసిక ఒత్తిడికి లోనై వారు అనారోగ్యానికి గురవుతూ, వారి తల్లిదండ్రులను, పిల్లల భవిష్యత్తును పట్టించుకోకుండా, దీపం చుట్టూ తిరిగే మిణుగురు పురుగుల్లాగా,డబ్బు సంపాదనే ధ్యేయంగా జీవనం సాగిస్తున్న భార్యాభర్తలు చివరకు ఏం కోల్పోయారో, ఎంత సంపాదించినా ఈ తరువాత ఏమిటనే ఇతివృత్తంతో సాగిన ప్రదర్శన ప్రేక్షకులను మనస్సులను కదిలించింది. ఈ నాటికలో శ్రీకారం రోటరీ సభ్యులు ఒంగోలు పోక్సోకోర్టు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా పనిచేస్తున్న గొట్టిపాటి శ్రీనివాసరావు, ప్రభుత్వ ఉపాధ్యాయులు ఈశ్వరప్రసాద్, ప్రైవేటు కాలేజీ ప్రిన్సిపాల్ రావి అంకమ్మ చౌదరి, రైతు కుటుంబానికి చెందిన చెన్నుపాటి బసవరాములు, మాదాల సాంబశివరావులు తమ పాత్రల పరిధులు మేర చక్కగా నటించారు. అదేవిధంగా రోటరీ కళాపరిషత్ కన్వీనర్ ఎఫర్ట్ సంస్థ డైరెక్టర్ జాష్టి వెంకట మోహనరావు నాటికను రచించగా, ఎస్ జయరావు దర్శకత్వం వహించారు.



నాటికలోని సన్నివేశం

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకే మినీ స్టేడియం

ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

ఎన్టీఆర్ మినీ స్టేడియాన్ని పరిశీలించిన ఏలూరి

పర్చూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ క్రీడాకారులకు ప్రోత్సాహం అందించి జాతీయ స్థాయిలో తీర్చిదిద్దాలన్న సంకల్పంతో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో పెద్ద ఎత్తున కోట్లు వెచ్చించి ఎన్టీఆర్ మినీ స్టేడియాలను నిర్మిస్తున్నట్లు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు చెప్పారు. శుక్రవారం పర్చూరులో రూపుదిద్దుకున్న క్రీడా స్టేడియాన్ని ఆయన పరిశీలించారు. ఈకార్యక్రమంలో టీడీపీ నేతలు షేక్ పంపుద్దీన్, తంగెళ్ళ మల్లికార్జునరావు, తులసి శ్రీనివాసరావు, ఆకుల శ్రీనివాసరావు, కొల్లా శివరాం ప్రసాద్, కొల్లా శ్రీనివాసరావు, మానం హరిబాబు, పోపూరి శ్రీనివాసరావు, పఠాన్ సమీర్, పాల్గొన్నారు. దీనికి ముందు స్థానిక ఎంపీపీ యూపీ స్కూల్ ప్రాంగణంలో మహిళలకు నిర్వహించేందుకు ఏర్పాటు చేసిన కుట్టు మిషన్ శిక్షణా కేంద్రాన్ని ఏలూరి ప్రారంభించారు. అదేవిధంగా రూ.2కోట్ల నిధులతో ముస్లింల ప్రార్థనకోసం ఏర్పాటు చేస్తున్న మసీదు నిర్మాణ పనులను ఏలూరి పరిశీలించారు.



క్రీడాకారుల వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ఏలూరి

ప్రభుత్వ రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

నిరుద్యోగ యువతీ యువకులకు జీవనోపాధిని పెంపొందించుకునే విధంగా ప్రభుత్వం అందజేస్తున్న సబ్సిడీ రుణాలను సద్వినియోగం చేసుకోవాలని శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు కోరారు. పర్చూరులో ఏర్పాటు చేసిన (ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్) ఆహార ఉత్పత్తుల తయారీ కేంద్రాన్ని ఎమ్మెల్యే ఏలూరి ప్రారంభించారు. ఈకార్యక్రమంలో ఏపీఎం రామకృష్ణ పాల్గొన్నారు.

మాఫియాలే మట్టుబెట్టాయా?

రేషన్, లిక్కర్, ఇసుక వ్యవహారాల్లో విభేదాలు

స్కూటీ క్లూతో ఛేదన దశకు పోలీసు దర్యాప్తు

వీరయ్య హత్యకేసు పోలీసు దర్యాప్తులో పురోగతి

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ఇసుక, లిక్కర్, రేషన్ మాఫియాలే టీడీపీ యువ నాయకుడు ముప్పవరపు వీరయ్యచౌదరిని హత్యకు కారణమని తెలుస్తోంది. తాజా పోలీసు దర్యాప్తు ఆ విషయాన్ని తేటతెల్లం చేస్తోంది. హంతకులు వినియోగించిన స్కూటీ దొరకటంతో కేసు మిస్టరీ వీడిపోయే దశకు చేరింది. స్కూటీ క్లూతో శుక్రవారం మధ్యాహ్నం నుంచి పోలీసులు శరవేగంగా హత్యకు కుట్రదారులను, పాత్రదారులను గుర్తించే విషయంలో ముందడుగు వేశారు. అప్పటికే అదుపులో ఉన్న అనుమానితులతో పాటు మరికొందరిని శుక్రవారం మధ్యాహ్నం, రాత్రి అదుపులోకి తీసుకుని దర్యాప్తును వేగవంతం చేశారు. మరోవైపు హైదరాబాద్‌లో సైతం ఒకరిద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకుని ఒంగోలుకు తరలిస్తున్నారు. కుట్రదారులు, స్థానిక పాత్రదారులపై ఒక అవగాహనకు వచ్చిన పోలీసులు పరారీలో ఉన్న కిరాయి హంతకుల కోసం గాలింపు ముమ్మరం చేశారు. గత మంగళవారం రాత్రి వీరయ్య హత్యకు గురికాగా సరైన క్లూ దొరకక పోలీసులు సతమతమవుతున్న విషయం తెలిసిందే. దర్యాప్తులో భాగంగా రాజకీయ, వ్యాపార అంశాలపై దృష్టిసారించారు. తాజా సమాచారం మేరకు రాజకీయ అంశాలే తప్ప వ్యాపార లావాదేవీలకు సంబంధించిన వారి పాత్ర లేనట్లుగానే పోలీసులు భావిస్తున్నారు.

వీరయ్య హత్యకు గురైన వెంటనే ఆయన స్వగ్రామమైన అమ్మనబ్రోలుకు చెందిన రాజకీయ విరోధితో పాటు మరికొందరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మరుసటిరోజు అదే మండలానికి చెందిన మరో రౌడీషీటర్‌ను కూడా అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. ఎలాంటి క్లూ దొరకకపోవటంతో వ్యాపార లావాదేవీలపై కూడా దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం చీమకుర్తికి సమీపంలోని బైపాస్ కూడలి వద్ద రక్తపు మరకలు పడి ఉన్న స్కూటీ పోలీసు దర్యాప్తులో కీలకంగా మారింది. దానిని గమనించిన ఒకరు ఇచ్చిన సమాచారంతో పోలీసులు రంగంలోకి వెళ్లారు. స్కూటీని స్వాధీనం చేసుకుని తద్వారా దర్యాప్తును సాగించటంతో అనేక అంశాలు వెలుగులోకి వచ్చాయి.

గ్రామస్థుల పాత్ర గుర్తింపు

వీరయ్య హత్య కేసులో అతని సొంత గ్రామంలో ప్రత్యర్థి పాత్ర ఉండవచ్చన్న అనుమానంతో పోలీసులు విచారణ కొనసాగించారు.పోలీసులకు దొరికిన స్కూటీ ప్రత్యర్థికి సుపరిచితుడైన ఒంగోలు అన్నవరప్పాడు ప్రాంతానికి చెందిన వ్యక్తిదిగా గుర్తించారు. ఇతను ఇసుక వ్యాపారం కూడా చేస్తాడని సమాచారం. వెంటనే పోలీసులు గాలింపు చేపట్టగా అతను అజ్ఞాతంలో ఉన్నాడని వెల్లడైంది. మరోవైపు అమ్మనబ్రోలులో ఆది నుంచి వీరయ్యతో శతృత్వం ఉన్న మరికొందరిని కూడా అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు.

మాఫియా పాత్రా తోడైందా?

ఇదేసమయంలో హంతకులకు నాగులుప్పలపాడుమండలంలో రాజకీయ విరోధిగా ఉన్న రేషన్‌మాఫియా చేస్తున్న రౌడీషీటర్ సహకారం కూడా లభించిందన్న అంశంపై పోలీసులు మరోసారి విచారణ చేపట్టారు. ఇటు గ్రామంలోని విరోధులతో పాటు ఒంగోలు వ్యక్తి వంటి వారి సహకారం తోడుకావటంతో అదే తరహాలో హతుడు వీరయ్యకు రాజకీయ విరోధిగా ఉన్న రేషన్ మాఫియా డాన్ పాత్రను కూడా పరిగణనలోకి తీసుకుని అనేక అంశాలను రాబడుతున్నట్లు సమాచారం. వీరందరికి మధ్య కొద్దిరోజులుగా జరుగుతున్న సంభాషణలను పసిగట్టేందుకు కాల్‌డేటాను కూడా పరిశీలించారు. వారందరి మధ్య వందల ఫోన్‌కాల్స్ నమోదైనట్లు కూడా పోలీసులు గుర్తించినట్లు తెలిసింది.

దశాబ్దకాలం నుంచి వైషమ్యాలు

అమ్మనబ్రోలులో ప్రస్తుత అనుమానితులు కుటుంబం, హతుడు వీరయ్యల మధ్య ఆది నుంచి రాజకీయ వైరం ఉంది. అనుమానితుడి తండ్రి కూడా ఆరంభంలో మాజీ ఎమ్మెల్యే ఈదర హరిబాబు వర్గంలోనే ఉండేవారు. పీఏసీఎస్, పాలకేంద్రం అధ్యక్షుడిగా కూడా పనిచేశారు. ఆ తర్వాత టీడీపీలో వీరయ్య పాత్ర గణనీయంగా పెరిగింది. అప్పటి నుంచి ఇద్దరి మధ్య క్రమేపీ వైషమ్యాలు పెరిగాయి.2014 నుంచి వీరయ్య గ్రామంలోనేగాక మండలస్థాయిలో టీడీపీ పెత్తనాన్ని అందిపుచ్చుకున్నారు. ఆ కోవలోనే ఉప్పుగుండూరుకు చెందిన రేషన్ మాఫియా నాయకుడు టీడీపీ నుంచి వెళ్లి వైసీపీలో చేరి గత ప్రభుత్వంలో పెత్తనం చెలాయించారు. గ్రామంలోని వీరయ్య తన వ్యతిరేకులను పక్కన పెట్టారు. రౌడీషీటర్‌గా ఉన్న వైసీపీ నాయకుడు ఇటీవల టీడీపీలో చేరే ప్రయత్నాలు చేయగా వీరయ్య అడ్డుకున్నారు. అలాగే టీడీపీ అధినాయకత్వంతో వీరయ్యకు పూర్తిసంబంధాలు ఏర్పడ్డాయి. పైగా జిల్లా స్థాయి పదవిని చేపట్టబోతున్నట్లు ప్రచారం జరుగుతోందిఈ దశలో వీరయ్యను హతమార్చటం ఇటు రాజకీయ వైషమ్యాలతోపాటు ఆయన ఎదుగుదలపై ఈర్ష్య కూడా కారణమై ఉండవచ్చని పోలీసులు అంచనా వేస్తున్నారు. కాగా ప్రధాన అనుమానితుడు సతీమణి అమెరికాలో ఉంటుండగా, కొంతకాలంగా తాను కూడా అమెరికా పోతున్నట్లు అతను తన సన్నిహితులకు చెప్పినట్లు పోలీసులు తెలుసుకున్నారు. శుక్రవారం పోలీసులు పరిశీలన చేయగా ఈనెల 29న ఆయన అమెరికా వెళ్లేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్లు వెల్లడైంది.

గ్రామంలో పోలీసు పికెట్

సమాచారంతో గ్రామంలో వీరయ్య అభిమానులు ప్రత్యర్థులపై తిరగబడవచ్చన్న అనుమానంతో అమ్మనబ్రోలులోను, ఆ మండలంలోను పోలీసులు పికెట్లు ఏర్పాటు చేశారు. ఎస్పీ స్వయంగా ఆ గ్రామానికి వెళ్లి సమీక్ష చేస్తున్నారు.

ఆర్థిక సహకారంపై ఆరా

ప్రాథమిక సమాచారం తేటతెల్లంకావటంతో ఈ హత్యకు సంబంధించి ఆర్థిక సహకారం ఎవరైనా ఇచ్చారా అన్న అంశంపై కూడా పోలీసులు దృష్టిసారించారు. నలుగురిలో ఇద్దరు కిరాయి హంతకులని పోలీసులు బలంగా నమ్ముతున్నారు. రాత్రి 7.40 కల్లా హత్య చేసి 8 గంటలకల్లా మోపెడ్‌పై చీమకుర్తి బైపాస్ వద్దకెళ్లిన వారు వాహనాన్ని అక్కడ వదిలి బస్‌లో ఇతర ప్రాంతానికి వెళ్లినట్లు ప్రాథమికంగా గుర్తించారు. అందులో ఇద్దరు విజయవాడ నుంచి వెళ్తున్న కనిగిరి బస్ ఎక్కి కనిగిరిలో దిగారని అక్కడి నుంచి వేరే ప్రాంతాలకు వెళ్లారని నిర్ధారించుకున్నారు. ఆ ఇద్దరిని కిరాయి హంతకులుగా భావించి వారికోసం ప్రత్యేకబృందాలను రంగంలోకి దింపారు. ఇటు కిరాయి హంతకులకు, ఇతర అవసరాలకు పెద్దమొత్తంలో డబ్బు వెచ్చించినట్లు గుర్తించిన పోలీసులు ఆర్థిక సహకారం ఎవరు ఇచ్చి ఉంటారన్న అనుమానాలపై మరో దర్యాప్తు చేపట్టారు. అదే మండలానికి చెంది హైదరాబాద్‌లో ఉంటున్న ఒక సంపన్నుని సహకారం కూడా ఉండి ఉండవచ్చన్న అనుమానంతో పోలీసులు హైదరాబాద్‌లో కూడా దర్యాప్తు చేపట్టారు. స్థానికంగా వీరయ్యతో ఉన్న వైషమ్యాలను దృష్టిలో ఉంచుకుని ఆ వైపు నుంచి దర్యాప్తు చేస్తున్నారు. ఇదేసమయంలో కొద్దిరోజులుగా అమ్మనబ్రోలు ప్రాంతంలో వీరయ్యకు ప్రమాదం పొంచి ఉందన్న నానుడి కొందరి మధ్య నలిగినట్లుగా పోలీసులు గుర్తించారు. గ్రామానికి సంబంధించిన ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన సంభాషణ ఆడియోను పోలీసులు రాబట్టుకున్నట్లు కూడా సమాచారం. ఆ కోణంలో అమ్మనబ్రోలుకు చెందిన మరో ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. సంఘటన జరిగిన రోజు అనుమానితులు ఒంగోలులోనే ఉండటం అందులో ఒకరు పరారీలో ఉండటాన్ని ప్రత్యేకంగా పరిగణనలోకి తీసుకున్నారు. కిరాయి హంతకులను మాట్లాడటం, ఇతర వ్యవహారాలలో ఒంగోలుకు చెందిన వ్యక్తి పాత్ర ఉండవచ్చన్న అనుమానంతో ఒక పోలీసు బృందం దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది.

ఆపదకాలంలో సీఎం సహాయనిధి ఎంతో ప్రయోజనం : ఎమ్మెల్యే కొండయ్య

అవీఇవీ



లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందించిన ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : ఆపద సమయంలో సీఎం సహాయ నిధి నుంచి అందిస్తున్న సాయంతో ఉపయోగకరమని, రాష్ట్ర ప్రభుత్వం ప్రజాప్రయోజనాలకు నిరంతరం శ్రమిస్తున్నట్లు ఎమ్మెల్యే కొండయ్య చెప్పారు. శుక్రవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో సీఎం రూ.25,83,320 లక్షల సహాయనిధి మంజూరు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు వైద్య సహాయార్థం అందిస్తున్న సాయం, నిరంతరం అందుబాటులో ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శక్తి యాప్‌తో మహిళలకు పూర్తి రక్షణ



అవగాహన కల్పిస్తున్న ఎస్సై హరిబాబు

చీరాల, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : మహిళలు అధైర్యపడకుండా జీవన మనుగడ సాగించాలంటే రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన శక్తి యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని వన్‌టౌన్ ఎస్సై హరిబాబు చెప్పారు. శుక్రవారం పట్టణంలోని పలు ప్రధాన కూడళ్లు, వ్యాపార సముదాయాల వద్ద శక్తి యాప్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యాప్ అత్యంత అధునాతనంగా ఉందని, సకాలంలో సమస్యల నుంచి రక్షణ కల్పిస్తుందని వివరించారు. కార్యక్రమంలో ఏఎస్సై శివకుమారి, సిబ్బంది లోకేష్, సుబ్బారావు,సునీత పాల్గొన్నారు.

లారీని ఢీకొని మోటార్ సైకిలిస్టు మృతి



సంఘటనాస్థలం వద్ద పరిశీలిస్తున్న సీఐ సుబ్బరాజు

అద్దంకి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : మోటార్‌సైకిల్‌పై అద్దంకి నుంచి మైలవరం వెళ్తున్న జమ్మలమడక లింగయ్య(32) ముందు వెళ్తున్న లారీని ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు... అద్దంకి మండలం మైలవరానికి చెందిన లింగయ్య శుక్రవారం మధ్యాహ్నం అద్దంకి వచ్చి రాత్రి 7 గంటల సమయంలో ఇంటికి వెళ్తూ శాంతినగర్ సమీపంలో ముందు వెళ్తున్న లారీని గమనించకుండా వెనుక వైపు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రోడ్డు గోతులమయంగా ఉండటం కూడా ప్రమాదానికి కారణంగా తెలుస్తోంది. సంఘటనాస్థలాన్ని సీఐ సుబ్బరాజు పరిశీలించారు. భార్యనాగలక్ష్మి, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

కాలుజారి చెరువులో పడిన బాలుడు

కాపాడిన గొర్రెలకాపరులు.. ఆస్పత్రికి తరలింపు

అద్దంకిటౌన్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంపరాల గ్రామంలో చెరువు వద్దకు వెళ్లిన పదేళ్ల బాలుడు కాలు జారి లోపల పడిపోగా స్థానికులు కాపాడారు. తెలిపిన వివరాలకు మేరకు... గ్రామానికి చెందిన ముగ్గురు బాలురు చెరువు వద్దకు వెళ్లారు. వారిలో భరత్ అనే బాలుడు కాలు జారి చెరువులో పడిపోవడంతో మిగిలిన ఇద్దరు పరుగులు తీశారు. గమనించిన గొర్రెల కాపరులు చెరువులో దూకి బాలుడిని కాపాడారు. ప్రమాదానికి గురైన భరత్‌ను 108లో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెరుగైన చికిత్స కోసం ఒంగోలు, అక్కడ నుంచి గుంటూరు వైద్యశాలకు తీసుకువెళ్లినట్లు సమాచారం.



ప్రమాదానికి గురైన బాలుడు భరత్

పొగాకు రైతులను ఆదుకోవాలి



తహసీల్దార్ జీవీ సుబ్బారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

మేదరమెట్ల, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : నల్లబర్లీ, వైట్‌బర్లీ, వర్జీనీయా పొగాకు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కార్యాలయం వద్ద తహసీల్దార్ జీవీ సుబ్బారెడ్డికి రైతు సంఘం నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు ప్రతినిధులు మాట్లాడుతూ నల్లబర్లీ ఇంత వరకు కొనుగోలు మొదలు పెట్టలేదని, ధరలు కూడా గత సంవత్సరంతో పోలిస్తే చాలా తక్కువగా ఉన్నాయన్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఇప్పటికైనా స్పందించి పొగాకు రైతులను ఆదుకోవాలని రైతు సంఘం నాయకులు మోంద్రు అంజనేయులు, నాతాని హనుమంతరావు, రవీంద్రబాబు, జయరావు, ప్రసాదరావు, రైతులు కోరారు.

హానికర రసాయనాలతో అనారోగ్య సమస్యలు



అధికారులతో మాట్లాడుతున్న జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు కార్పొరేషన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కాల్షియం కార్బైడ్ వంటి హానికర రసాయనాలతో పండించిన పండ్ల వల్ల అనారోగ్య సమస్యలు వస్తాయని, దానిపై ఆహార తని ఖీ అధికారులు దృష్టి సారించాలని జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని జేసీ ఛాంబర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాల్షియం కార్బైడ్‌తో మామిడి ఇతర రకాల పండ్లు పండించడం వల్ల అనారోగ్య సమస్యలు వస్తాయని తెలిపా రు. తలతిరగడం, తరచూ దాహం, చికాకు, బలహీనత, వాంతులు, చర్మం పై పుండ్లు, ఇతర జీర్ణ కోశ వ్యాధులు వస్తాయని చెప్పారు. ఇథలిన్ గ్యాస్‌తో, రైపనింగ్ చాంబర్స్‌లో సహజన సిద్ధంగా పండించిన పండ్లు, ఆహార పదార్థాలపై పంచాయతీరాజ్ అధికారులతో కలిసి అవగాహన సదస్సులు నిర్వహించాలని ఆదేశించారు. జిల్లా ఆహార తనిఖీ అధికారి గరికపాటి ప్రభాకర్‌రావు, డీటీసీ సుశీల, అసిస్టెంట్ కమిషనర్ డి.కొండయ్య పాల్గొన్నారు.

మహిళ మెడలో బంగారు గొలుసు లాక్కెళ్లిన దొంగ


బాధిత మహిళలను విచారిస్తున్న సీఐ సుబ్బారావు

చీరాల, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : చీరాల పట్టణ పరిధిలోని మేడా వారి వీధిలో గుర్తు తెలియని దుండగుడు ఓ మహిళ మెడలో బంగారు ఆభరణాలు లాక్కొనివెళ్లాడు. అందిన వివరాల ప్రకారం.. ఆ ప్రాంతానికి చెందిన బెల్లంకొండ వెంకటశేషారత్నం మరో ఇద్దరు మహిళలు ఆటోలో ఇంటి సమీపంలో దిగారు. ముగ్గురు నడుచుకుంటూ వెళుతుండగా ఎదురుగా ద్విచక్రవాహనంపై హెల్మెట్‌తో వచ్చిన దుండగుడు శేషారత్నం మెడలో సుమారు 13 సవర్ల బంగారు ఆభరణాలు లాక్కుని పరారయ్యాడు. దీంతో బాధిత మహిళ, సహచరులు బిగ్గరగా కేకలు వేయడంతోపాటు పోలీసులకు సమాచారం చేర వేశారు. వన్‌టౌన్ సీఐ సుబ్బారావు సంఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పోక్సో కేసులో వైసీపీ నేత అరెస్ట్

గతంలోనూ గవిని శ్రీనివాసరావుపై పలు కేసులు

14 రోజులు రిమాండ్ విధించిన న్యాయమూర్తి


గవినిని రిమాండ్‌కు తరలిస్తున్న పోలీసులు

చీరాల, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : పోక్సో కేసులో చీరాల వైసీపీ నేత గవిని శ్రీనివాసరావును టూటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఓ మైనర్‌కు సంబంధించిన విషయంలో గవినివారిపాలెం కు చెందిన పిట్టు నాగరాజుపై పోక్సో కేసు నమోదైంది. అంతేకాకుండా వి చారణలో అతడిని వైసీపీ నేత గవిని శ్రీనివాసరావు ప్రేరేపించినట్లు గుర్తిం చి ఏ4గా కేసు నమోదు చేశారు. కేసు నమోదైన విషయాన్ని తెలుసుకున్న శ్రీనివాసరావు అనుచరుడు చీదరబోయిన గోపీతో హైదరాబాదు సమీపంలో తలదాచుకుంటున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేసి ఇద్దరిని కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారు. గతంలోనే శ్రీనివాసరావుపై పలు కేసులు ఉన్నాయి. అలాగే కేసులో మొదటి నిందితుడు పిట్టు నాగరాజు ఇప్పటికే రిమాండ్ ఖైదీగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కేసులో మరో వ్యక్తి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

భర్త చనిపోతే భార్య పెన్షన్ దరఖాస్తుకు అవకాశం

యద్దనపూడి/మార్టూరు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): పెన్షన్ తీసుకుంటున్న భర్త అనివార్య కారణాలు వలన చనిపోయినట్లయితే భార్య ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకునే వివరాలను యద్దనపూడి ఎంపీడీవో టి లక్ష్మీనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం పంపించిన విధి విధానాలను ఆయన వివరించారు. 2023 డిసెంబరు 1 నుంచి 2024 అక్టోబరు 31వతేదీలోపు అంటే ఈ మధ్య కాలంలో పెన్షన్ తీసుకుంటున్న భర్త చనిపోతే, అతని భార్య ప్రస్తుతం ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు ఫారాలతోపాటు భర్త ఆధార్ కార్డు, పెన్షన్‌బుక్, భార్య ఆధార్, రేషనుకార్డు, భర్త డెత్ సర్టిఫికెట్ ల జిరాక్స్ కాపీలను జతపరచాలని ఎంపీడీవో తెలిపారు.

నేడు చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో ర్యాలీ

చీరాల, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : కశ్మీర్‌లో ఉగ్రవాద దాడులను నిరసిస్తు నేడు చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించనున్నట్లు ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈక్రమంలో శనివారం మధ్యాహ్నం వరకు వస్త్ర దుకాణాలను మూసివేస్తున్నట్లు చెప్పారు.

బెల్లం అమ్మకాలపై నిబంధనలు పాటించండి

చీరాల, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : బెల్లం అమ్మకాలపై దుకాణదారులు నిబంధనలు పాటించాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు చెప్పా రు. శుక్రవారం కార్యాలయంలో నవోదయం 2.0 కార్యక్రమంలో భాగం గా దుకాణదారులతో సమావేశం నిర్వహించారు. పలు హెచ్చరికలు జారీ చేశారు.

నేటి నుంచి కళాంజలి నాటకోత్సవాలు

చీరాల, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మునిసిపల్ బాలికోన్నత పాఠశాలలో కళాంజలి నాటకోత్సవాలను శనివారం నుంచి బుధవారం వరకు నిర్వహించనున్నట్లు ప్రతినిధులు తెలిపారు. అందుకు సంబంధించిన కరపత్రాన్ని శుక్రవారం ఆవిష్కరించారు. అభిమానులు, పుర ప్రజలు పాల్గొనాలని కోరారు.

రైతులను విస్మరించిన వైసీపీ ప్రభుత్వం

రాక్షస పాలనలో వారికి వెలకట్టలేని నష్టం

పొగాకు రైతుల సమస్య పరిష్కారానికి కృషి

రూ.కోటి సబ్సిడీ యంత్ర పరికరాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు



ఎమ్మెల్యే ఏలూరికి చెక్కును అందజేస్తున్న ట్రస్ట్ చైర్మన్ శ్రీనివాసరావు

పర్చూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ రాక్షస పాలనలో అన్నదాతలకు తీరని నష్టం వాటిల్లిందని దాన్ని సరిచేయటం కోసం కూటమి ప్రభుత్వం అహర్నిశలు శ్రమిస్తోందని పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు చెప్పారు. శుక్రవారం పర్చూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో యంత్ర పరికరాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఏలూరి మాట్లాడుతూ అన్నదాతల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు. రైతుల సంక్షేమం కోసం అనేక రకాల పథకాలను రూపకల్పన చేస్తున్నట్లు చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వం రైతులకు అవసమైన ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ యంత్రపరికరాలను ఇవ్వకుండా మంగళం పలికిందన్నారు. కనీసం పంటల ఆరుతడులకు సక్రమంగా నీరు కూడా అందించిన దాఖలాలు లేవని విమర్శించారు. సీఎం చంద్రబాబు నాయుడు నేతృత్వంలో ఆయకట్టు చివరి భూములకు సైతం నీరు అందించేలా ప్రణాళికను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో కోటి రూపాయల వ్యయంతో రైతాంగానికి వ్యవసాయ యంత్రీకరణ పరికరాలు అందించినట్లు తెలిపారు. ఇందులో రూ.69 లక్షల సబ్సిడీ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. పొగాకు రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని అధైర్యపడాల్సిన అవసరం లేదన్నారు. త్వరలో క్రీడా ప్రాంగణం అందుబాటులోకి వస్తుందని చెప్పారు.నాగులపాలెం సమీపంలో నూతన హైవే నిర్మాణ పనులను ఎమ్మెల్యే ఏలూరి పరిశీలించారు.

ట్రై సైకిల్స్ పంపిణీ...

పర్చూరు మండలానికి చెందిన పలువురు దివ్యాంగులకు ట్రైసైకిళ్లను ఏలూరి చేతుల మీదుగా పంపిణీ చేశారు. అలాగే వెలుగు సహకారంతో రూ.10 లక్షల వ్యయంతో సబ్సిడీపై అందించిన కెమెరాలను ఎమ్మెల్యే ఏలూరి చేతులు మీదుగా లబ్ధిదారులకు అందజేశారు.

తల సేమియా బాధితులకు భరోసా

సాకేత్ ట్రస్టు ఆధ్వర్యంలో తలసేమియా బాధితులకు ఎమ్మెల్యే ఏలూరి చేతుల మీదుగా రూ.10 లక్షల రూపాయల ఆర్థిక సహాయాన్ని ట్రస్టు చైర్మన్ శ్రీనివాసరావుకు అందజేశారు.

ఊడిపడుతున్న శ్లాబ్ పెచ్చులు


అద్దంకి తహసీల్దార్ కార్యాలయంలో ఆందోళన చెందుతున్న ఉద్యోగులు, ప్రజలు

రెండు దశాబ్దాలకే మరమ్మతులు

పట్టించుకోకపోతే మరింత శిథిలావస్థకు చేరే అవకాశం

అద్దంకి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): అద్దంకి తహసీల్దార్ కార్యాలయం భవనం శ్లాబ్ పెచ్చులు ఊడిపడుతుండటంతో సిబ్బంది, ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రెండు దశాబ్దాల క్రితం అద్దంకి తహసీల్దార్ కార్యాలయం నూతన భవనం నిర్మాణం జరిగింది. ఇప్పటికే తహసీల్దార్ గదితో పాటు వరండాలోనూ తరచూ పెచ్చులు ఊడి పడుతున్నాయి. శ్లాబ్‌లో ఇనుప చువ్వలు కూడా బయటకు కనిపిస్తున్నాయి. దీంతో మరమ్మతులు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తే శ్లాబ్ కూలే ప్రమాదం కూడా ఉందని ఆందోళన చెందుతున్నారు. నిత్యం అధికారులు, సిబ్బంది, పెద్ద సంఖ్యలో అర్జీదారులు, రైతులు ఉండే తహసీల్దార్ కార్యాలయం శ్లాబు పెచ్చులు ఊడిపడుతున్నందున ప్రమాదం జరగకముందే ఉన్నతాధికారులు స్పందించి మరమ్మతులైనా చేయాలని పలువురు కోరుతున్నారు.


తహసీల్దార్ గది ముందు వరండాలో ఊడిన స్లాబ్ పెచ్చు


తహసీల్దార్ గదిలో ఊడిన పైకప్పు పెచ్చులు

అద్దంకిలో సైడ్ డ్రెయిన్లు క్లీన్


అద్దంకి పట్టణంలోని గుంజివారిపాలెంలో పూడిక తీస్తున్న కూలీలు

12 లక్షల రూపాయలతో పూడికతీత పనులు

అద్దంకి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి పట్టణంలోని మురుగు కాలువలలో పూడికతీత పనులు ప్రారంభమయ్యాయి. రెండు మేజర్ డ్రెయిన్లతో పాటు పట్టణం పరిధిలో ఉన్న అన్ని సీసీ డ్రెయిన్ల పూడికతీత పనులు చేపట్టారు. 12 లక్షల రూపాయల నిధులు కేటాయించి ప్రత్యేకంగా ఇతర ప్రాంతాల నుంచి కూలీలను తీసుకొచ్చి పూడికతీత పనులు చేస్తున్నారు. దీంతో సైడ్ డ్రెయిన్ లలో పూడికతీతకు అడ్డంకులు తొలిగి మురుగు సాఫీగా ముందుకు సాగనుంది. మురుగు వాసన సమస్య కూడా తగ్గనుంది.

వేసవిలో చిన్నారులు, వృద్ధులు అప్రమత్తంగా ఉండాలి


డాక్టర్ సిద్ధార్థ

పర్చూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో చిన్నారులు, వృద్ధులు అప్రమత్తంగా ఉండాలని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధార్థ చెప్పారు. రోజురోజుకూ వేసవి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో శుక్రవారం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో వడదెబ్బ బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రతలను తెలియజేశారు. డాక్టర్ సిద్ధార్థ మాట్లాడుతూ తీవ్ర ఉష్ణోగ్రతలుండే సమయంలో బయట తిరగకూడదన్నారు. మాంసాహారాన్ని తగ్గించి వాటి స్థానంలో తాజా ఆకుకూరలను తీసుకోవాలని చెప్పారు. నీరు, పళ్ల రసాలు, కొబ్బరి నీళ్లను మాత్రమే సేవించాలన్నారు. వడదెబ్బ తగిలిన వ్యక్తిని త్వరగా నీడ ఉండే ప్రదేశానికి చేర్చాలని, చల్లటి నీటిలో ముంచిన తడిగుడ్డతో సాధారణ ఉష్ణోగ్రత వచ్చేవరకు తుడవాలని సూచించారు. ఉప్పుకలిపిన మజ్జిగ, గ్లూకోజ్ ద్రావణం కానీ తాగించాలన్నారు. వేసవిలో రోజుకు 15 గ్లాసులకు తగ్గకుండా నీటిని తీసుకుంటే వేసవి బారి నుంచి రక్షించుకోవచ్చని చెప్పారు.

మలేరియా నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలి



అద్దంకిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

చీరాల, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : మలేరియా నివారించేందుకు ప్రజలు కృషి చేయాలని తద్వారా ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చని ఏరియా హాస్పిటల్ పీపీ యూనిట్ వైద్యాధికారులు యాకోబు, వీరబ్రహ్మం చెప్పారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా గురువారం నియోజకవర్గం పరిధిలోని పలు ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో చింతా శేషబాబు, రవికుమార్, వసంతవల్లి, బేబిమ్మ, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

మలేరియా అంతం మనతోనే అంటూ ర్యాలీ

యద్దనపూడి/మార్టూరు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మలేరియా అంతం మనతోనే అంటూ శుక్రవారం యద్దనపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ర్యాలీని డాక్టరు శ్రీహర్ష ప్రారంభించారు. ఈ సందర్భంగా హెల్త్ ఆఫీసర్ తంగెళ్ల విజయచంద్ర మాట్లాడుతూ అందరిలో మార్పు వస్తేనే మలేరియా అంతం అవుతుందని, ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే జరపాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఈవో వెంకటేశ్వరరెడ్డి, సూపర్‌వైజరు సునంద పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించండి

పంగులూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు దోమల నివారణతో వ్యాధులు దరిచేరవని పీహెచ్‌సీ వైద్యాధికారిణి బాలరాజేశ్వరి చెప్పారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా శుక్రవారం పంగులూరులో వైద్యాధికారులు, సిబ్బంది మలేరియా పట్ల అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ శివచెన్నయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ అనూరాధ, సీహెచ్‌వో భారతి, ఎల్‌టీ చందన, ఫార్మసిస్ట్ పద్మావతి, స్టాఫ్‌నర్స్ క్రాంతి, రాజారెడ్డి, రమాదేవి, ఆరోగ్య కార్యకర్తలు రామాంజమ్మ, మంగమ్మ, మాణిక్యం, లలిత, జయమ్మ, శకుంతల, ఎస్తేరు, శ్రావణి, రేణుక కోటేశ్వరి పాల్గొన్నారు.

మలేరియ రహిత సమాజం మన అందరి బాధ్యత

అద్దంకిటౌన్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మలేరియా రహిత సమాజం మన అందరి బాధ్యత అని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ మనోజ్ ప్రద్యుత్ అన్నారు. శుక్రవారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మోదేపల్లి పీహెచ్‌సీ, పట్టణంలోని గాజులపాలెం, కాకానిపాలెం ప్రాథమిక ఆ రోగ్య కేంద్రాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కీటక జనీత వ్యాధులపై, దోమల వలన వచ్చే మలేరియా, డెంగ్యూ, బోధకాలు, మెదడువాపు, చికెన్ గున్యా విధుల గురించి పట్టణంలోని ప్రధాన దారులలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇంటి చుట్టు మురుగునీరు, వాడని రోళ్లు, కూలర్లు, నీటి తొట్లు, పడవేసిన కొబ్బరి బోండాలలో నీటి నిల్వలు లేకుండా చూసుకోన్నారు. దోమతెరలు, వాడాలని, సాయంత్రం 6 తరువాత కిటికీలు, తలుపులు మూసివేయడం, వేప ఆ కు పొగ వేయడం, నీటి నిల్వలలో ఆ యిల్ బాల్స్ వేయడం ద్వారా దోమకాటును నివారించుకోవచ్చన్నారు. ఈకార్యక్రమంలో డాక్టర్ జయసింహా, డాక్టర్ శ్రీహర్ష, డాక్టర్ బాలరాజు, డాక్టర్ మాధురి, సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆ శా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉగ్రవాదుల దాడి హేయమైన చర్య



చినగంజాంలో నిరసన ప్రదర్శన చేస్తున్న జనసేన నేతలు

చినగంజాం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి) : పహల్గాంలో ఉగ్రవాదులు పర్యాటకులను హతమార్చడం హేయమైన చర్య అని రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పెదపూడి విజయకుమార్ చెప్పారు. జనసేన పార్టీ అధినేత కే పవన్‌కల్యాణ్ పిలుపు మేరకు స్థానిక సోపిరాల రైల్వేగేటు సెంటర్‌లోని జనసేన పార్టీ కార్యాలయం వద్ద నుంచి శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. జనసేన పార్టీ మండల అధ్యక్షులు సందు శ్రీనివాసరావు, బీజేపీ సీనియర్ నాయకులు ఉలిచి ఏసుబాబు, శిఖరం కోటయ్య, జనసేన పార్టీ ఉమ్మడి ప్రకాశం జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి తుమ్మలపెంట సతీష్, నాయకులు టి.ఆదినారాయణ, బొప్పన సాయి, గంటాలక్ష్మీనారాయణ, పెదసింగు వెంకటేష్, గంటా వెంకటేష్, నాగుర్, సురేష్‌లు పాల్గొన్నారు.

ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు నివాళులు అర్పిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ

మార్టూరు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి) : ఉగ్రవాదుల కిరాతక చర్యలకు పహల్గాంలో ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళులు అర్పిస్తూ, వారి కుటుంబాలకు ప్రగాడ సానుభూతి తెలియచేస్తూ శుక్రవారం రాత్రి మార్టూరు సెంటర్లో జనసేన పార్టీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సకల ఆంజనేయులు, ముప్పవరపు హనుమంతరావు, పసుపులేటి నాగరాజు, పానుగంటి హనుమంతరావు పాల్గొన్నారు.

అవీఇవీ

బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి


చెక్కును బాధిత కుటుంబానికి అందజేస్తున్న ఏపీజీబీ మేనేజర్ శీనానాయక్

బల్లికురవ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం బ్యాంకులలో ఖాతాలు కలిగిన వినియోగదారులకు అందిస్తున్న పలు రకాల బీమా పథకాలను సద్వినియెగం చేసుకోవాలని బల్లికురవ ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు మేనేజర్ కె. శీనానాయక్ చెప్పారు. ఇటీవల చెన్నుపల్లికి చెందిన పాలపర్తి ఏసురత్నం అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడికి ఏపీజీబీ బ్యాంకులో ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన్‌లో సభ్యత్వం ఉంది. ఏసురత్నం మృతి చెందటంతో బీమా ద్వారా రూ. 2 లక్షలను ప్రభుత్వం మంజూరు చేసింది. శుక్రవారం మేనేజర్ శీనానాయక్ మృతుడు భార్య అంజమ్మకు నగదు చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్లు సీహెచ్ రవీంద్రబాబు, సుహితా గ్రేస్, బిందు మాధవి పాల్గొన్నారు.

డ్రోన్ ద్వారా కట్టుదిట్టంగా శాంతిభద్రతలు


మాట్లాడుతున్న ఎస్సై వై నాగరాజు

బల్లికురవ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో ఎలాంటి ఘర్షణలు చోటుచేసుకోకుండా డ్రోన్ నిఘా ద్వారా కట్టుదిట్టంగా శాంతిభద్రతలను అదుపులోకి తీసుకొస్తున్నామని ఎస్సై వై నాగరాజు చెప్పారు. శుక్రవారం సాయంత్రం స్థానిక స్టేషన్లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో జరిగే అసాంఘిక కార్యక్రమాలపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వ్యక్తిగత విషయాలను కూడా రాజకీయపార్టీలు తమకు అనుకూలమైన పద్దతిలో పెద్దవి చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

27 మందిపై బైండోవర్ కేసులు

మండలంలో ఫ్యాక్షన్ గ్రామమైన వేమవరంలో వైసీపీ, టీడీపీలకు చెందిన 27 మందిపై తహసీల్దారు రవినాయక్ సమక్షంలో శుక్రవారం బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు ఎస్సై నాగరాజు చెప్పారు.

దాతల సహకారంతో కూలింగ్ వాటర్ చలివేంద్రాలు



భవానీ సెంటర్‌లో వేయిస్తంభాల గుడి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కూలింగ్ వాటర్ చలివేంద్రం


అద్దంకి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి పట్టణంలో పలువురు దాతలు స్వచ్ఛందంగా చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజల దాహార్తి తీరుస్తున్నారు. ఇప్పటికే అద్దంకి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని 9 ప్రాంతాలలో కూలింగ్ మినరల్ వాటర్ చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. అదే సమయంలో మరికొందరు దాతలు ముందుకు వచ్చి కూలింగ్ వాటర్ చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజల దాహార్తి తీర్చుతున్నారు. పాతబస్టాండ్ సెంటర్‌లో రాచమల్లు శివాంజనేయులు ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేసి కూలింగ్ మినరల్ వాటర్ బబుల్స్ ఉంచుతున్నారు. భవానీ సెంటర్‌లోని వేయిస్తంభాల గుడి ఆధ్వర్యంలో దేవాలయం ముందు కూలింగ్ వాటర్ చలివేంద్రం ఏర్పాటు చేశారు. అత్యధిక శాతం వ్యాపారులు తమ షాపుల వద్ద కూలింగ్ వాటర్ బబుల్స్ ఏర్పాటు చేసి దాహార్తి తీరుస్తున్నారు.

పదిలో ప్రతిభ చూపిన విద్యార్థినికి కలెక్టర్ అభినందన


విద్యార్థిని హర్షిణిని అభినందిస్తున్న కలెక్టర్ వెంకటమురళి


అద్దంకిటౌన్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్షలలో అత్యధిక మార్కులు సాధించి అద్దంకిలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని హర్షిణిని బాపట్ల జిల్లా కలెక్టర్ వెంకటమురళి శుక్రవారం తన కార్యాలయంలో అభినందించారు. మేడిశెట్టి వెంకటసాయిశ్రీహర్షిణి పదో తరగతి పరీక్షలలో 593 మార్కులు సాధించి మండలంలో ప్రభుత్వ పాఠశాల స్థాయిలో మొదటి స్థానం, బాపట్ల జిల్లా స్థాయిలో మూడవ స్థానంలో నిలిచింది. హర్షిణిని జిల్లా కలెక్టర్ వెంకట మురళి అభినందించి సత్కరించారు.

పండ్లతోటల పెంపకాన్ని ప్రోత్సహించాలి


మాట్లాడుతూ ఎంపీడీవో కె.స్వరూపారాణి

పంగులూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రతి గ్రామంలో పండ్లతోటల సాగు చేపట్టేలా రైతులను ప్రోత్సహించాలని ఎంపీడీవో కె.స్వరూపారాణి సూచించారు. పంగులూరు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పండ్లతోటల పెంపకం ప్రోత్సహించాలని కోరుతూ ఎన్‌ఆర్‌ఈజీఎస్, ఉద్యానవన, వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బందితో సంయుక్త సమావేశం నిర్వహించారు.ప్లాంటేషన్ మేనేజర్ కిరణ్ మాట్లాడుతూ మామిడి, జామ, సపోట, కొబ్బరి, సీతాఫలం, పెద్దరేగిపళ్ల మొక్కలు, డ్రాగన్ ఫ్రూట్ మొక్కలు అందజేస్తామని చెప్పారు. మూడేళ్లపాటు నిర్వహణ ఖర్చు రాయితీగా ఇస్తామన్నారు. ఈ నెల 30వ తేదీలోగా ఉపాధిహామీ పథకం అధికారులను సంప్రదించాలని కోరారు. ఈ సమావేశంలో ఉద్యానవన శాఖ ఏవో దీప్తి, వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి, ఏపీవో సంతోషం, ఎన్‌ఆర్‌ఈజీఎస్, వ్యవసాయ. ఉద్యానవన శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

శింగరకొండ ట్రస్ట్‌బోర్డు మాజీ చైర్మన్ వైసీపీకి రాజీనామా


కోట శ్రీనివాసకుమార్

అద్దంకి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి) : శింగరకొండ ట్రస్ట్‌బోర్డు మాజీ చైర్మన్, ఆర్యవైశ్యానాయకుడు కోట శ్రీనివాసకుమార్ శుక్రవారం వైసీపీకి రాజీనామా చేసినట్లు తెలిపారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు కీలకంగా వ్యవహరించిన కోట శ్రీనివాసకుమార్ శింగరకొండ ట్రస్ట్‌బోర్డు చైర్మన్‌గా పనిచేశారు. ఆడిటర్‌గా మంచి గుర్తింపు ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వైసీపీ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ వచ్చారు. ఈ నేపథ్యంలో తన రాజీనామా లేఖను శుక్రవారం జిల్లా అధ్యక్షుడు నాగార్జునకు పంపినట్లు తెలిపారు. వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. అతను త్వరలో ఏదో ఒక పార్టీలో చేరే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. కోట రాజీనామాతో అద్దంకి పట్టణంలోని ఆర్యవైశ్య సామాజిక వర్గంలో వైసీపీకి షాక్ తగిలినట్టే అని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఉష్ణోగ్రత వివరాలు

కేంద్రం	గరిష్టం	కనిష్టం
నెల్లూరు	38.6	28.2
కావలి	36	27
ఆత్మకూరు	38	28
ఉదయగిరి	40	26
కందుకూరు	37	28



కావలి: కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన చేస్తున్న కూటమి నేతలు, అధికారులు, ప్రజలు

ఉగ్రచర్యలపై ఆగ్రహం

కశ్మీర్ ఉగ్రవాద చర్యలను నిరసిస్తూ ఉగ్రమూకల కాల్పుల్లో అమరులైన వారి కుటుంబాలకు సానుభూతి తెలుపుతూ జిల్లావ్యాప్తంగా కొవ్వొత్తులతో ప్రదర్శనలు జరుగుతున్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు, రాజకీయ నాయకులు, ప్రజాసంఘాల నేతలు ఇలా ఎవరికివారుగా నిరసనలో పాల్గొని ఉగ్రవాదుల దుశ్చర్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం నెల్లూరుతోపాటు కావలి, బుచ్చిరెడ్డిపాళెం, బోగోలు, ఉదయగిరి తదితర ప్రాంతాల్లో నిరసన ప్రదర్శనలు జరిగాయి. శుక్రవారం రాత్రి కావలిలో ఎమ్మెల్యే వెంకట కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రదర్శన స్థానిక ఉదయగిరి బ్రిడ్జి సెంటర్ నుంచి ఐ లవ్ యూ కావలి సెల్ఫీ పాయింట్ వరకు కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. సెల్ఫీ పాయింట్ వద్ద కొవ్వొత్తులను ఉంచి అక్కడున్న జాతీయజెండాకు సెల్యూట్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్‌కుమార్, డీఎస్పీ పీ. శ్రీధర్, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, వివిధ ప్రజా సంఘాల నేతలు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్న నిరసన ప్రదర్శనలు

● ఉగ్రవాదుల కాల్పులను నిరసిస్తూ కావలిలోని జామియా మసీద్‌లో శుక్రవారం సాయంత్రం ముస్లింలు నిరసన వ్యక్తం చేసారు. దాడులకు పాల్పడిన ఉగ్రవాదులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

- కావలి, (ఆంధ్రజ్యోతి)



నెల్లూరు నగరంలో ఇన్సాఫ్ నాయకుల నిరసన





ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతుల కింద చెక్కు, రెఫ్రిజిరేటర్, టీవీని అందుకుంటున్న మస్తాన్‌బీ, గిరిబాబు, రాజేశ్వరి



'ఆంధ్రజ్యోతి లక్కీడ్రా' విజేతలకు
బహుమతుల పంపిణీ

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : 'ఆంధ్రజ్యోతి' పాఠకులకు కార్ అండ్ బైక్ రేసుకు సంబంధించి గత నెల 22వతేదీన జరిగిన లక్కీ డ్రా విజేతలైన ముగ్గురికి నెల్లూరులో బహుమతులు అందజేశారు. ప్రథమ బహుమతి పొందిన నెల్లూరు శివార్లలోని కొత్తూరు శ్రామికనగర్‌కు చెందిన షేక్.మస్తాన్‌బీకి ఆంధ్రజ్యోతి బ్రాంచ్ మేనేజరు కే.హరికృష్ణ హీరోహోండా బైక్‌కు సంబంధించిన చెక్కును అందజేశారు. అలాగే రెండో బహుమతికి కింద రెఫ్రిజిరేటర్‌ను కావలిలోని కోటంరెడ్డివారివీధికి చెందిన పొన్నూరు గిరిబాబుకు అందజేశారు. తృతీయ బహుమతిగా టీవీని నెల్లూరులోని వేదాయపాలెం జ్యోతినగర్‌కు చెందిన మేకల రాజేశ్వరికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎడిషన్ ఇన్‌చార్జి జి.రామకృష్ణ, సర్క్యులేషన్ మేనేజరు ఆర్.నాగేశ్వరరావు, అడ్వర్టయిజ్ మెంట్ మేనేజరు షేక్ అబ్దుల్ రహీం తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల డిప్యుటేషన్ రద్దు

● పాఠశాలల్లో చేరాలని ఆదేశాలు

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లా విద్యాశాఖలో వివిధ విభాగాల్లో డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న ఉపాధ్యాయులు, వర్క్ అడ్జస్ట్‌మెంట్ కింద వివిధ పాఠశాలల్లో పనిచేస్తున్న టీచర్లందరినీ తిరిగి వారి పాఠశాలల్లో చేరాలని డీఈవో బాలాజీరావు ఆదేశాలు జారీ చేశారు. ఉన్నతాధికా రుల ఆదేశాల మేరకు పని సర్దుబాటు, డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న 345 మంది, సమగ్రశిక్షలో పనిచేస్తున్న నలుగురు, జిల్లా పరీక్షల విభాగంలో పనిచేస్తున్న 8 మంది, డీఈవో కార్యాలయంలో పనిచేస్తున్న ఆరుగురు కలిపి మొత్తం 363 మందిని వారి పూర్వపు పాఠశాలల్లో చేరాలని ఆదేశిస్తూ వారిని రిలీవ్ చేశారు. దీంతో ఆయా ప్రాంతాల్లో పనిచేస్తున్న టీచర్లందరూ కూడా వారి స్థానాల్లో తిరిగి విధుల్లో చేరినట్లు సంబంధిత అధికారులు తెలిపారు.



బోగోలు మండలంలో రోగులకు అవగాహన కల్పిస్తున్న ఎంఎల్‌హెచ్‌పీలు

ఈ భారం ఇంకెన్నాళ్లు!?

- విలేజ్ హెల్త్ క్లినిక్‌లకు అందని అద్దె
- రూ.60లక్షలకుపైగా బాడుగ బకాయిలు
- విడుదలకాని మందుల రవాణా చార్జీలు
- కొన్ని నెలలుగా అందని ఇన్సెంటివ్‌లు
- ఎంఎల్‌హెచ్‌పీలపై ఆర్థిక భారం
- ఆదుకోవాలని వేడుకుంటున్న ఉద్యోగులు

నెల్లూరు (వైద్యం), ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : వైద్య ఆరోగ్యశాఖలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ కింద ఏర్పాటు చేసిన విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్స్ (ఎంఎల్‌హెచ్‌పీ) ఉద్యోగుల అవస్థలు అన్నీఇన్నీ కావు. భవన అద్దె బకాయిలతోపాటు పలు రకాల ఆర్థిక భారాలపై వారిలో తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. జిల్లావ్యాప్తంగా 495 విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఉండగా, వీటిలో 377 ఆరోగ్య కేంద్రాలు అద్దె భవనాల్లోనే నడుస్తున్నాయి. ఒక్కో కేంద్రం అద్దె రూ.3వేల వరకు చెల్లించాల్సి ఉంది. అయితే గతేడాది ఆగస్టు నుంచి అద్దె ఇవ్వకపోవడంతో రూ.60.32 లక్షలకుపైగా బకాయిలు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోతే తామేమీ చేయలేమని అధికారులు చేతులెత్తేస్తున్నారు. దీంతో భవన యజమానులకు సమాధానం చెప్పలేక ఉద్యోగులు అవస్థలు పడుతున్నారు

● మందుల రవాణా ఖర్చుల భారం

ప్రతి నెల ఎంఎల్‌హెచ్‌పీలు ఆరోగ్య శాఖ జిల్లా కార్యాలయానికి వచ్చి 42 రకాల మందులు తీసుకువెళ్లాలి. సీతారామపురం, దుత్తలూరు, ఉదయ గిరి, దుత్తలూరు వంటి దూర ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రానికి చేరుకుని ఆటోలలో మందులు, ఇతర పరికరాలను తీసుకువెళుతుంటారు. రవాణా చార్జీలు నెల్లూరు సమీప ప్రాంతాలకు రూ.2 వేలు, దూర ప్రాంతాలకు రూ.5వేలు కూడా ఖర్చవుతుంది. ఈ రవాణా ఖర్చులు జాతీయ ఆరోగ్య మిషన్ చెల్లించాల్సి ఉండగా ఆ దిశగా చర్యలు లేవు. వాస్తవంగా మందులు, పరికరాలను ఎన్‌హెచ్‌ఎం ప్రత్యేక వాహనాలలో ఆరోగ్య కేంద్రాలకు చేర్చాల్సి ఉన్నా జిల్లాలో ఆ పరిస్థితి లేదు. కనీసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు తమ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ నిధుల నుంచి అయినా ఈ చార్జీలు చెల్లిస్తే బాగుండేది. చేసేదిలేక ఎంఎల్ హెచ్‌పీలే ఈ రవాణా చార్జీలు భరించాల్సి వస్తోంది. అలాగే ప్రతి నెలా డీఎంహెచ్‌వో కార్యాలయంలో అధికారుల సమావేశం జరుగుతంది. ఆయా సమావేశాలకు ఎంఎల్‌హెచ్‌పీలు రావాల్సి ఉండగా ఈ ఖర్చు కూడా వారే భరించాల్సి ఉంటుంది.

● ఇన్సెంటివ్ ఎప్పుడిస్తారో!?

ఎంఎల్‌హెచ్‌పీలకు ఒక్కొక్కరికి రూ.25వేల వేతనం అందుతుండగా, దీంతోపాటు మరో రూ.13వేల నుంచి 15వేల వరకు ఇన్సెంటివ్ ప్రభుత్వం చెల్లించాలి. అయితే, కొన్ని నెలలుగా వారికి ఈ ఇన్సెంటివ్ అందడం లేదు. వచ్చే వేతనంలో రవాణా చార్జీలు, ఇతర ఖర్చులు రూ.5వేలు పోను మిగిలిన రూ.20వేలతోనే బతుకుబండి నడపాల్సి వస్తోందని ఎంఎల్‌హెచ్‌పీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తమను ఆర్థిక కష్టాల నుంచి తప్పించాలని వారు వేడుకుంటున్నారు. రులు వాస్తవాలు తెలుసుకుని వారి సమస్యలను పరిష్కరించాల్సి ఉంది.

ప్రభుత్వం నుంచి నిధులు రావాలి

ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాగానే విలేజ్ హెల్త్ క్లినిక్‌ల అద్దె బకాయిలు చెల్లిస్తాం. అలాగే ఎంఎల్‌హెచ్‌పీలకు రావాల్సిన ఇన్సెంటివ్‌లు కూడా చెల్లించేలా చర్యలు తీసుకుంటున్నాం. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి పూర్తిస్థాయిలో దృష్టి పెడుతున్నాము.

- డాక్టర్ సుజాత, డీఎంహెచ్‌వో



సుజల స్రవంతికి ఊపిరి

మళ్లీ టెండర్లు పిలిచేందుకు అధికారుల కసరత్తు

నెల్లూరు (జడ్పీ), ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గత ప్రభుత్వంలో ఆగిపోయిన సుజల స్రవంతి మంచినీటి పథకానికి కూటమి ప్రభుత్వం ఊపిరి పోస్తోంది. గ్రామాల్లో ఇంటింటికి కొళాయి ఏర్పాటు చేసి ప్రజలకు మంచినీటి ఇబ్బందులు తొలగించేందుకు గత టీడీపీ ప్రభుత్వంలో అప్పటి కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకానికి శ్రీకారం చుట్టారు. జిల్లాలో తొలి విడతగా 14 మండలాల్లో దాదాపు రూ.50 కోట్ల నిధులతో ఈ పథకానికి శ్రీకారం చుట్టారు. ఏఎస్ పేట, అనంతసాగరం, ఆత్మకూరు, బోగోలు, దగదర్తి, మర్రిపాడు, పొదలకూరు, దుత్తలూరు, జలదంకి, కలిగిరి, కొండాపురం, సీతారామపురం, ఉదయగిరి, వరికుంటపాడు, వింజమూరు మండలాల్లో 731 పనులు చేపట్టేందుకు అప్పట్లో శ్రీకారం చుట్టారు. అయితే, ఆత్మకూరు మండలంలో మాత్రమే పనులు పూర్తి చేయగా మిగిలిన మండలాల్లో అరకొరగా పనులు జరిగాయి. ఈ నేపథ్యంలో జరిగిన ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి రావడంతో సుజల స్రవంతి పథకానికి గ్రహణం పట్టింది. పల్లెవాసుల తాగునీటి కష్టాలు తీర్చడంపై అప్పటి ప్రభుత్వం దృష్టి పెట్టలేదు. దీంతో సుజల స్రవంతి పథకం పనులు ఎక్కడివక్కడ ఆగిపోయాయి. అయితే, గతేడాది జరిగిన ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అధికారంలోకి రావడంతో ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకానికి మళ్లీ మోక్షం కలుగుతోంది.



అనంతసాగరంలో సుజల స్రవంతి పథకం కింద ఏర్పాటు చేసిన నీటి ప్లాంట్

● మళ్లీ టెండర్ల ప్రక్రియ

గ్రామాల్లో పైప్‌లైన్లు ఏర్పాటు చేసి ఇంటింటికి తాగునీటిని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ పథకంపై గత ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని కేంద్రానికి వివరించి పథకం పూర్తికి మరింత గడువు తీసుకుంది. ఇందులో భాగంగా పనులపై ఇటీవల ఉన్నతాధికారులు సమీక్షించారు. ఆత్మకూరు మినహా మిగిలిన 13 మండలాల్లో కాంట్రాక్టర్లను అధికారులు రద్దు చేసి మళ్లీ టెండర్లు పిలిచేందుకు కసరత్తు చేస్తున్నారు. అయితే, గతంలో చేయాల్సిన పనులు ఐదేళ్ల తర్వాత చేయాల్సి ఉండటంతో రేట్లు పెరిగి ఉన్నందున మళ్లీ అంచనాలను మార్చాల్సిన అవసరం ఏర్పడుతోంది. దీంతో మళ్లీ అంచనాలను ప్రభుత్వానికి పంపేందుకు అధికారులు నివేదికలు సిద్ధం చేస్తున్నారు. వీటికి ఆమోదముద్ర లభిస్తే మళ్లీ టెండర్లు పిలిచి పనులు చేపట్టనున్నారు.

ఒకే యాప్.. ఒకే పాస్వర్డ్

లీప్ యాప్‌తో టీచర్లకు తగ్గిన పనిభారం

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) :వివిధ రకాల యాప్‌లలో వివరాలు నమోదుకు ఇబ్బందులు పడుతున్న ఉపాధ్యాయులకు లీప్ యాప్‌తో ఉపశమనం కలుగుతోంది. విద్యాశాఖ ఆధ్వర్యంలో లెర్నింగ్ ఎక్సలెన్సీ ఇన్ ఆంధ్రప్రదేశ్ (లీప్) యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. టీచర్లకు ఇచ్చిన హామీ మేరకు లీప్ యాప్ పేరుతో సమగ్ర సమాచారాన్ని ఒకేదానిలో నిక్షిప్తం చేసేలా తయారు చేసిన ఈ యాప్‌తో టీచర్లపై ఒత్తిడి కూడా తగ్గనుంది.

గత వైసీపీ హయాంలో విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించాల్సిన గురువులు నిత్యం యాప్‌లతో యాతన పడుతూ ప్రభుత్వ వేధింపులకు గురయ్యేవారు. పాఠశాలల్లో బోధన కంటే బోధనేతర పనులపై ఉపాధ్యాయులు ఎక్కువ సమయం గడపాల్సి వచ్చేది. నాడు ప్రవేశపెట్టిన వివిధ యాప్‌లలో వివరాలు నమోదు చేయడానికి తంటాలు పడేవారు. పిల్లలకు బోధించడానికి ఎనిమిది పిరియడ్లు ఉంటే ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది నిర్వహించా ల్సిన యాప్‌లకే రోజుకు మూడు, నాలుగు గంటలు సమయం పట్టేదని గురువులు గగ్గోలు పెట్టేవారు. దీంతో కూటమి ప్రభుత్వం టీచర్లు పడుతున్న ఈ సమస్యను పరిష్కరించడానికి లీప్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఉపాధ్యాయులు తమ ఫేస్ రికగ్నేషన్ ఐడీ (ముఖ ఆధారిత హాజరు ఐడీ) పాస్‌వర్డ్‌తో యాప్‌లో లాగిన్ కావచ్చు. ఈ యాప్‌లో స్కూల్, టీచర్, స్టూడెంట్, గవర్నెన్స్, కమ్యూనికేషన్, డ్యాష్‌బోర్డు అనే ఆరు విభాగాలు ఉంటాయని, ఇది టీచర్లకు ఎంతో ఉపయోగ కరమని అధికారులు తెలిపారు. నాడు వివిధ రకాలు యాప్‌లు ఉండడం, అవి పని చేయకపోవడం, పాస్‌వర్డ్ గుర్తుండకపోవడం, హాజరు కోసం గంటల తరబడి ఎదురుచూడడం వంటివి జరిగేవి. నేడు ఈ బాధలన్నీ తప్పడంతోపాటు ముఖ ఆధారిత హాజరు గుర్తింపు సంఖ్య పాస్వర్డ్ లీప్‌యాప్‌లో లాగిన్ అయ్యేలా ఏర్పాట్లు చేశారు. అలాగే వీటిలో బదిలీలు, ఉత్తర్వులు, నోటిఫికేషన్స్ తదితర వివరాలు కూడా యాప్‌లో అందుబాటులో ఉన్నాయని చెబుతున్నారు. ఒకే యాప్.. ఒకే పాస్‌వర్డ్‌తో ప్రస్తుతం పని చాలా తేలికగా ఉందని, అయితే సాంకేతిక పరంగా కొంత వేగవంతం చేస్తే మరింత సులభతరంగా ఉంటుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు.



నెల్లూరుపాళెం గిరిజన కాలనీలో సమస్యలను తెలుసుకుంటున్న మంత్రి ఆనం

పారిశ్రామిక ప్రగతే లక్ష్యంగా
రాష్ట్రంలో 50 ఎంఎస్‌ఎంఈ పార్కుల ప్రారంభం

- ఆత్మకూరు నుంచే శ్రీకారం చుట్టనున్న ముఖ్యమంత్రి
- 1న చంద్రబాబు పర్యటనకు విస్తృత ఏర్పాట్లు
- రాష్ట్ర మంత్రి ఆనం వెల్లడి

ఆత్మకూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : పారిశ్రామిక ప్రగతే లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రవ్యాప్తంగా 50 ఎంఎస్ఎంఈ పార్కులను ఆత్మకూరు నుంచి ప్రారంభించనున్నారని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. మే 1న సీఎం ఆత్మ కూరుకు రానుండగా, ఈ మేరకు శుక్ర వారం సాయంత్రం ఏర్పాట్లను మంత్రి ఆనం పరిశీలించారు. పట్టణంలోని బీసీ బాలికల గురుకుల పాఠశాల వద్ద, నారంపేట ఎంఎస్ఎంఈ పార్కు వద్ద హెలిప్యాడ్ స్థలాలను, ఇతర ఏర్పాట్లను పరిశీలించారు. నారంపేట ఎంఎస్ఎంఈ పార్కులో విద్యుత్, రోడ్లు, తాగునీరు తదితర మౌలిక వస తులు కల్పించి పెద్ద ఎత్తున పరిశ్ర మల ఏర్పాటుకు శ్రీకారం చుట్టేందుకే ముఖ్యమంత్రి పర్యటిస్తున్నారని వెల్ల డించారు. ఆత్మకూరులోని గిరిజన కాలనీలో సీఎం చంద్రబాబు స్వయంగా గిరిజన నివాసాలకు వెళ్లి పింఛన్లు అందజేస్తారని తెలిపారు. అలాగే ఏఎంసీ ఎదురుగా ఉన్న ప్రాగణంలో నిర్వహించే ప్రజావేదిక కార్యక్రమంలో ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరిస్తారని తెలిపారు. అనంతరం టీడీపీ కార్యకర్తల సమావేశంలో సీఎం పాల్గొని పార్టీ భవిష్యత్ కార్యాచరణ, పార్టీ బలోపేతంపై ప్రసంగిస్తారని చెప్పారు. మే 1న మేడే సందర్భంగా కార్మికులతో సీఎం ప్రత్యే కంగా సమావేశమై వారి సమస్యలను తెలుసుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో బి పావని, ఏపీఐఐసీ జడ్ఎం శివకుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకటరమణమ్మ, కమిషనర్ సి గంగాప్రసాద్, డీఎస్పీ కె వేణుగోపాల్, ఎంపీపీ వేణుగోపాల్‌రెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



ఆర్ఐవోగా వరప్రసాద్

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ ప్రాంతీయ పర్యవేక్షణాధికారి(ఆర్ఐవో)గా వరప్రసాద్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల జరిగిన బదిలీలు, పదోన్నతుల్లో భాగంగా నెల్లూరు ఆర్ఐవో (ఎఫ్ఏసీ)గా వరప్రసాద్‌ను నియమిస్తూ ఇంటర్‌బోర్డు కార్యదర్శి కృతిక శుక్లా ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆయన శుక్రవారం మధ్యాహ్నం నెల్లూరులోని ఇంటర్‌బోర్డు కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. గతంలో రెండేళ్లపాటు(2021-23) జిల్లాలో ఆర్ఐవో(ఎఫ్ఏసీ)గా పనిచేసిన వరప్రసాద్ ప్రస్తుతం వెంకటాచలం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు ఆర్ఐవోగా పనిచేసిన డాక్టర్ ఏ శ్రీనివాసులుకు చిత్తూరు డీఐఈవోగా పదోన్నతి కల్పించి కడప ఆర్జేడీగా అదనపు బాధ్యతలు అప్పగించారు. నూతన ఆర్ఐవో మాట్లాడు తూ జిల్లాలో ఇంటర్ విద్య ఉన్నతికి కృషి చేస్తానని, ప్రభుత్వ కళాశాలల పనితీరు మెరుగుపరిచి ఉత్తమ ఫలితాల సాధనకు ప్రణాళికలు సిద్ధం చేస్తామని చెప్పారు. ఇష్టానుసారంగా వ్యవహరించే ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలలపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	110
స్కిన్ చికెన్	200
స్కిన్‌లెస్	220

కోడిగుడ్ల ధర (100): 420



సీనియర్ సివిల్ న్యాయాధికారి బాధ్యతల స్వీకరణ

కావలి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా ధర్మవరం సీనియర్ సివిల్ న్యాయాధికారిగా విధులు నిర్వర్తిస్తూ కావలికి బదిలీపై వచ్చిన ఏ.గీతావాణి శుక్రవారం కావలి సీనియర్ సివిల్ న్యాయాధికారిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కావలి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాటా సురేంద్రరెడ్డి ఆధ్వర్యంలో ప్రధాన కార్యదర్శి ఎం.జయప్రకాష్, కోశాధికారి అభిషేక్, సీనియర్ న్యాయవాది కలికి శ్రీనివాసులురెడ్డి తదితరులు ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందచేసి దుశ్శాలువాతో సత్కరించారు.

న్యూస్ బాక్స్

రేపు దివ్యాంగులకు బ్యాటరీ ట్రై సైకిళ్ల పంపిణీ

కావలి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): కావలి నియోజకవర్గంలోని దివ్యాంగులకు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తన వీపీఆర్ ట్రస్ట్ ద్వారా ఈనెల 27వ తేదీన బ్యాటరీ ట్రైసైకిళ్లు పంపిణీ చేయనున్నట్లు టీడీపీ విభిన్న ప్రతిభావంతుల రాష్ట్ర ఉపాధ్యక్షుడు మండవ వెంకట్రావు ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ఉదయగిరి రోడ్డులో ఉన్న మినీ స్టేడియంలో జరిగే ఈ కార్యక్రమానికి ఫోన్ ద్వారా సమాచారం అందుకున్న దివ్యాంగులు ఉదయం 7 గంటలకే చేరుకోవాలని పేర్కొన్నారు. వారికి ల్పాహారం, భోజన వసతితో పాటు ఆటో రవాణా చార్జీలు కూడా అందజేస్తారని తెలిపారు. ట్రైసైకిల్ అందుకునే ప్రతి దివ్యాంగుడు వ్యక్తిగత సహాయకుడితో రావాలని తెలిపారు.

కేంద్ర ప్రభుత్వ వైఫల్యంతోనే మారణహోమాలు

బిట్రగుంట, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ వైఫల్యంతోనే దేశంలో మారణహోమాలు జరుగుతున్నాయని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎల్.సురేష్‌బాబు ఆరోపించారు. బోగోలు మండలం విశ్వనాథరావుపేటలోని ఆయన స్వగృహంలో శుక్రవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ పాలనలో కులమతాల పేరుతో కొట్టుకు చస్తున్నారని మండిపడ్డారు. మణిపూర్‌లో ఒక తెగపై మరో తెగకు చెందిన వారు దాడులు చేస్తూ కిరాతకంగా చంపుతున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కశ్మీర్‌లో ఉగ్రవాదులు రెచ్చిపోయి అమాయకులపై దాడులు చేసి హతమారుస్తుంటే బీజేపీ ఓట్లు దండుకునే రాజకీయం చేస్తుందని దుయ్యబట్టారు.

మంచినీటి సరఫరా పునరుద్ధరణ

లింగసముద్రం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాళ్లపాడు-రోళ్లపాడు మంచినీటి పథకం నుంచి అధికారులు మంచినీటి సరఫరాను శుక్రవారం ఉదయం పునరుద్ధరించారు. విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తుండగా పైపులు పగిలిన పోయాయి. ఈ కారణం గా మంచినీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, మంచినీటి పథకం నిర్వాహకులు పగిలిన పైపులకు గురువారం రాత్రి మరమ్మతులు పూర్తి చేసి నీటిని విడుదల చేయడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.

ముస్లింల కొవ్వొత్తుల ర్యాలీ

బిట్రగుంట, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లోని పెహల్గామ్‌లో ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన బాధిత కుటుంబాలకు మద్దతుగా శుక్రవారం సాయంత్రం ముస్లిం మైనార్టీ నాయకులు కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా షేక్.నూరుద్దీన్, జహీర్‌లు మాట్లాడుతూ ఉగ్రవాదాన్ని కూకటి వేళ్లతో సహా తొలగించాలని కోరారు. బోగోలు అంబేద్కర్ విగ్రహం వద్ద నుంచి రైల్వే ఎల్సీ గేటు 144, అరవపాలెం వరకు ఉగ్రవాదం నశించాలి అంటు నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ జిల్లా అధ్యక్షుడు దాసరి సునీల్, సుభానీ, సిరాజ్, గౌస్‌బాషా, బోగోలు, ఇబ్రహీంపేటకు చెందిన ముస్లింలు పాల్గొన్నారు.

పాలీసెట్ హాల్ టికెట్లు ఆన్‌లైన్‌లోనే తీసుకోవాలి

కావలి రూరల్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ఏపీ పాలీసెట్ ఎంట్రన్స్‌కు ప్రభుత్వం విడుదల చేసిన హాల్ టికెట్లను అభ్యర్థులు ఆన్‌లైన్‌లోనే తీసుకోవాలని రుద్రకోట పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సునీల్‌కుమార్ ప్రియ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 30వ తేదీన ఎంట్రన్స్ పరీక్ష నిర్వహిస్తారన్నారు. అభ్యర్థులు తమ హాల్‌టికెట్లను polycetap.nic.in వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పేర్కొన్నా రు. ఏ ఇతర ఆఫ్‌లైన్ లేదా పోస్టు ద్వారా పంపరన్నారు. రిజిస్ట్రేషన్ అయిన తరువాత ఫీ పేమెంట్ ఫెయిల్ అయిన అభ్యర్థులు తక్షణమే రుద్రకోట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని 9949022772ను సంప్రదించాలని తెలిపారు.

మాదక ద్రవ్యాలు సమాజానికి హానికరం

అల్లూరు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాలు సమాజానికి హానికరమని లోక్ అదాలత్ సభ్యుడు ఎం.మాల కొండారెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. యువత మాదకద్రవ్యాల వినియోగ నిషేధ చట్టంపై అవగాహన పెంచుకుని ఆరోగ్యంగా ఎదగాలని పేర్కొన్నారు. నల్ల మందు, గంజాయి, బ్రౌన్ షుగర్ వంటి మాదక ద్రవ్యాలకు బానిసలవుతుండడంతో ఆరోగ్యంపై పెనుప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. వీటివలన కలిగే దుష్ప్రభావాలపై యువతకు అవగాహన కల్పించేలా తగు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామని పేర్కొన్నారు.

యంత్రాలతో కోతలు..

వరిగడ్డికి ఇక్కట్లు!

● తీవ్రంగా పశుగ్రాసం కొరత ● రైతులకు భారంగా పశుపోషణ

వలేటివారిపాలెం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): రైతులకు వరిగడ్డి దొరక్క పశుపోషణ భారంగా మారింది. వ్యవసాయం పెద్దగా లాభసాటిగా లేకపోవడంతో ఎక్కువమంది రైతులు పాడి పోషణపై ఆధా రపడి జీవిస్తున్నారు. అయితే వారు పశువులను రక్షించుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. పశుగ్రాసం లేక పాల ఉత్పత్తి తగ్గిపోయిందని వారు చెబుతున్నారు. పశువులను పెంచలేక కబేళాలకు తరలిస్తున్నారు. వలేటివారిపాలెం మండలంలో 21 గ్రామ పంచాయతీల్లో 36 గ్రామాలు ఉన్నాయి.



దూరప్రాంతాల నుంచి వరి గడ్డి తెచ్చుకుంటున్న రైతులు

ఈ గ్రామాల్లో 14,682 గేదెలు, 480 ఎద్దులు, 25,738 గొర్రెలు, 7,063 మేకలు ఉన్నా యి. మండలంలో ఎలాంటి నీటి వనరులు లేవు. వర్షాధారంపై ఆధారపడి పశుగ్రాసం పెంచుతుంటారు ఈ ఏడాది సాధారణ వర్షపాతం కంటే తక్కువగా నమోదైంది, పొలాల్లో ఎక్కడా పచ్చిక లేదు. దీంతో రైతులు దూర ప్రాంతాలైన గుడ్లూరు, పొన్నలూరు, లింగ సముద్రం మండలాలలోని గ్రామాలకు వెళ్లి ట్రాక్టర్లతో వరిగడ్డి తెచ్చుకుంటు న్నారు.ఆయా గ్రామాల్లో యంత్రాలతో వరి కోయడం వల్ల వరిగడ్డి కొరత ఏర్పడిందని రైతులు చెబుతున్నారు. ప్రభుత్వం గ్రాసం రైతులను ఆదుకోవా లని వారు కోరుతున్నారు.

భారంగా పాడి పరిశ్రమ



వేసవిలో ఎండు గడ్డి లేక పశుపోషణ భారం గా మారింది. ఎండుగడ్డి లేక పాల ఉత్పత్తి తగ్గిపోయింది. దూరప్రాంతాలకు వెళ్లి ఎండు గడ్డిని తెచ్చుకుందామన్నా దొరకడం లేదు. ప్రభుత్వమే ఎండు గడ్డిని సబ్సిడీపై సరఫరా చేసి, ఆదుకోవాలి.

-రూపినేని మాల్యాద్రి, వలేటివారిపాలెం

ప్రభుత్వం పశుగ్రాసం అందించాలి



మాప్రాంతంలో వర్షాభావం వల్ల చెరువుల కింద వరి సాగు చేయలేదు. బోర్ల కింద అరకొరగా సాగు చేపట్టారు. అది వాళ్ల పశువులకే సరిపోవడడం లేదు. దీంతో దూర ప్రాంతాలకు వెళ్లి ట్రాక్టర్ వరిగడ్డి రూ.20 వేలు పెట్టి కొని తెచ్చుకుంటున్నాం. ప్రభుత్వం రాయితీ పశుగ్రాసం అందచేయాలి.

- చందాడి కోటయ్య, వలేటివారిపాలెం



స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలతో ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ బాషావలి

10 మద్యం సీసాల స్వాధీనం

కావలిరూరల్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): కావలి మండలం గౌరవరంలో నిర్వహిస్తున్న బెల్టు దుకాణంపై శుక్రవారం ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న జూటూరు కాంతారావును అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 10 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి ద ర్యాప్తు చేస్తున్నా రు. అనుమతి లే కుండా మద్యం వి క్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ దాడుల్లో సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ బాషావలి పాల్గొన్నారు.

ఆర్‌టీఈ యాక్ట్ బకాయిలు చెల్లించాలి

నెల్లూరు(విద్య, ఆంధ్రజ్యోతి) : ఆర్‌టీఈ యాక్ట్ ప్రకారం గత మూడే ళ్లగా ప్రైవేట్ స్కూళ్లలో ఉచిత విద్యను అభ్యసించిన విద్యార్థు లకు సంబంధించిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఏపీ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ (అప్సా) నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో శుక్రవారం డీఈవో బాలాజీ రావుకు వినతిపత్రం అందచేశారు. జిల్లా అధ్యక్షుడు కర్తం ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ మూడేళ్లగా ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయలేదన్నారు. ఈ నేపథ్యంలో రాబోవు విద్యాసంవత్సరంలో ఎన్‌రోల్‌మెంట్ చేసుకోవడం తమకు ఇబ్బందిగా ఉందని తెలిపారు. దీనికి డీఈవో స్పందిస్తూ బకాయిలను 3 నెలల్లో విడుదల చేస్తుందని చెప్పారు.

అంతర్ జిల్లా బదిలీలు నిర్వహించాలి

● ఎమ్మెల్సీ గాదెను కలిసిన పురపాలక పాఠశాలల ఉపాధ్యాయ సంఘం నాయకులు

కావలిటౌన్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి) : పురపాలక పాఠశాలల ఉపాధ్యాయులకు అంతర్ జిల్లా, అంతర్ యాజమాన్య బదిలీలు నిర్వహించాలని పురపాలక పాఠశాలల ఉపాధ్యాయుల సంఘం బాధ్యులు కోరారు. ఈ మేరకు శుక్రవారం విజయవాడలో ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడును కలసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఏడాది ప్రభుత్వం నిర్వహించే బదిలీల్లో పురపాలక ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని కోరారు. వివిధ జిల్లాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు సొంత జిల్లాలకు పోలేక అనేక ఇబ్బందులు పడుతున్నారని, పురపాలక ఉపాధ్యాయులకు కనీసం రిక్వెస్ట్ బదిలీలు స్పౌజ్, మ్యూచువల్, హెల్త్ సంబంధిత ఉపాధ్యాయులకు ఒక జిల్లా నుంచి మరొక జిల్లాకు, ఒకే జిల్లాలో పురపాలక పాఠశాల నుంచి నగరపాలక పాఠశాలకు బదిలీలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంఘం బాధ్యులు కొండారెడ్డి, కిరణ్, శ్రీను, వెంకటేశ్వర్లు, సాయి, కృష్ణ, సరళ, అరుణ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న పురపాలక పాఠశాలల ఉపాధ్యాయులు

ప్రత్యామ్నాయ పంటలతో ఉపయోగం

అల్లూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : ప్రత్యామ్నాయ పంటలతో రైతులకు రెండు విధాల ఉపయోగం ఉంటుందని మండల వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. నార్తుమోపూరులో శుక్రవారం రైతులకు ప్రత్యామ్నాయ పం టలు, భూసార పరీక్షలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా భూసార పరీక్షల నిమిత్తం రైతుల సమక్షంలో మట్టి నమూనాలను తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచు స్వాతి, పంచాయతీ కార్యదర్శి సిద్ధేశ్వరి, నాయకులు నెట్టం బాకు శ్రీనివాసులు, మర్రిబోయిన సురేంద్ర, హరీష్ పాల్గొన్నారు.



అల్లూరు : మట్టి నమూనాలు సేకరిస్తున్న వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు, సిబ్బంది

మట్టి నమూనా పరీక్షలతో ప్రయోజనం

కలిగిరి : రైతులు తమ పొలాల్లో మట్టి నమూనా పరీక్షలు చేయించుకోవడం ద్వారా ప్రయోజనాలు పొందవచ్చని వ్యవసాయాధికారి ఎం.సురేష్‌బాబు పేర్కొన్నారు. దీని ద్వారా పంట సాగులో ఎరువులను మోతాదులో వినియోగించుకుని పెట్టుబడుల ఖర్చు తగ్గించుకోవచ్చన్నారు. ఈ విషయమై శుక్రవారం వెలగపాడు, పెద్దకొండూరు రైతుసేవాకేంద్రాల పరిధిలోని గ్రామాల్లో మట్టినమూనాల సేకరణ చేశారు. అనంతరం వరికి ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీఏఏ వెంకటేశ్వర్లు, వీహెచ్ఏ అనూష, ప్రకృతి వ్యవసాయసిబ్బంది ప్రవీణ, రైతులు పాల్గొన్నారు.

నీటిని వృథా చేయొద్దు

● సన్నాహక సమావేశంలో కావలి కాలువ ఈఈ సుబ్రహ్మణ్యేశ్వర రావు

కావలి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): కావలి కాలువ కింద రెండో పంటకు విడుదల చేసే సోమశిల జలాలను వృథా చేయకుండా చర్యలు తీసుకోవాలని కావలి కాలువ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు సుబ్రహ్మణ్యేశ్వరరావు తెలిపారు. కావలి కాలువ కింద రెండో పంటకు మే నెల 5వ తేదీ నుంచి సోమశిల జలాలు విడుదల చేయనున్న నేపథ్యంలో ఆయకట్టుకు సాగునీటి పంపిణీపై సోమశిల అధికారులు శుక్రవారం పట్టణంలోని వెంగళరావునగర్‌లో ఉన్న సోమశిల కార్యాలయ ఆవరణలో నీటి సంఘాల అధ్యక్షులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి సంఘాల అధ్యక్షులు, సభ్యులు నీరు వృథాకాకుండా పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. నీటి విడుదల లోపు ముందస్తుగా బోర్ల కింద వరి నారుమళ్లు సిద్ధం చేసుకోవాలని చెప్పారు. సోమశిల ప్రాజెక్టు కమిటీ వైస్‌చైర్మన్ పీ.మధుమోహన్‌రెడ్డి, కావలి కాలువ డిస్ట్రిబ్యూటరీ చైర్మన్‌లు కండ్లగుంట మధుబాబునాయుడు, వంటేరు జయచంద్రారెడ్డిలు మాట్లాడుతూ ప్రాజెక్టు చరిత్రలో కావలి కాలువ కింద రెండో పంటకు 74 వేల ఎకరాలకు 8.5 టీఎంసీల నీటి కేటాయింపులు చేయడం ఇదే ప్రథమం అన్నారు. ఇందుకు కృషి చేసిన మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఉదయగిరి, కావలి ఎమ్మెల్యేలు కాకర్ల సురేష్, దగుమాటి కృష్ణారెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు. రూ.3.75 కోట్లతో జరుగుతున్న కావలి కాలువ పూడికతీత పనులు వేగవంతంగా నాణ్యతగా చేయించేలా అధికారులు చర్యలు చేపట్టి నీటి విడుదల లోపు పనులు పూర్తి చేయాలన్నారు. వ్యవసాయశాఖ ఏడీఏ నాగరాజు మాట్లాడుతూ పలురకాల ఆరుతడి పంటలు, వరిసాగులో సీజన్‌కు ఉపయోగపడే విత్తన రకాలపై నీటి సంఘాల అధ్యక్షులకు వివరించి వారు రైతులకు అవగాహన కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో కావలి కాలువ డీఈలు మహేష్, మధుసూదనరావు, మురళి, శరత్, ఇరిగేషన్ డీఈ రామారావు, జేఈలు, జలదంకి, కావలి, బోగోలు, దగదర్తి, విడవలూరు మండలాలకు చెందిన నీటి సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.



సాగునీటి విడుదలపై సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న సోమశిల కావలి కాలువ ఈఈ సుబ్రహ్మణ్యేశ్వర రావు

తండ్రీకొడుకులపై జనసేన నేత దాడి

● న్యాయం చేయాలంటూ రోడ్డెక్కిన గ్రామస్థులు

కలిగిరి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): తండ్రీ కొడుకులపై జనసేన నేత దాడి చేసిన ఘటన శుక్రవారం రాత్రి కలిగిరిలో జరిగింది. వివరాల మేరకు.. జిర్రావారిపాలెంకు చెందిన మలిరెడ్డి చెన్నకృష్ణారెడ్డి అలియాస్ శ్రీనివాసులురెడ్డి పట్టణలో సాయిబాబా జనరల్ స్టోర్స్‌లో గుమస్తాగా పని చేస్తున్నాడు. రాత్రి 7 గంటల సమయంలో కుమారుడు చంద్రకిషోర్‌తో కలసి మోటారుసైకిల్‌పై స్వగ్రామానికి వెళ్తూ మార్గమధ్యలో శివాలయం సమీపంలో రోడ్డుపై ఓ టిఫిన్ బండి వద్ద అల్పాహారం కట్టించుకొంటుండగా జనసేన మండలాధ్యక్షుడు బండారు లక్ష్మీనారాయణ అకారణంగా కర్రతో కొట్టాడు. దీంతో వారు బయలుదేరి వెళుతుండగా కుమారుడిని సైతం కొట్టాడు. ఈ విషయాన్ని బాధితులు స్వగ్రామంలోకి వెళ్లి అందరికీ చెప్పడంతో గ్రామంలోని మహిళలు, యువకులు, గ్రామస్థులు పెద్దఎత్తున పోలీస్ స్టేషన్‌కు చేరుకొని ఫిర్యాదు చేశారు. దాడి చేసిన వ్యక్తిని స్టేషన్‌కు తీసుకురావాలని. రాత్రి 9గంటల నుంచి 11గంటల వరకు కోరినా పోలీసులు స్పందించకపోవడంతో పోలీస్ స్టేషన్ ఎదురుగా రహదారిపై బైఠాయించి ధర్నా చేశారు. దీంతో ట్రాఫిక్ స్తంభించింది. మద్యం మత్తులో తమను కొట్టినా పోలీసులు పట్టించుకోలేదని బాధితులు ఆరోపించారు. ఎస్ఐ, సీఐలు స్థానికంగా అందుబాటులో లేకపోవడంతో వింజమూరు ఎస్ఐ వీరప్రతాప్ వచ్చి నిందితుడిని స్టేషన్‌కు తీసుకు వస్తానని చెప్పడం బాధితులు ఆందోళన విరమించారు.



అటవీ భూమిని వెనక్కు తీసుకోవాలి

● ఏపీ హేతువాద సంఘం అధ్యక్షుడు నార్నె

కందుకూరు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): గుడ్లూరు మండలం చేవూరు వద్ద జాతీయ రహదారి పక్కనే రామదూత ఆశ్రమం కోసం సర్వే నెంబరు 883లో 3 ఎకరాల అటవీ భూమిని కేటాయిస్తూ గతంలో జారీ చేసి ఉన్న జీవో 37ను రద్దు చేసి ఆ భూమిని తిరిగి స్వాధీనం చేసుకోవాలని కోరుతూ అటవీశాఖామంత్రి పవన్‌కళ్యాణ్‌కు విజ్ఞప్తి చేసినట్లు ఏపీ హేతువాదసంఘం అధ్యక్షుడు నార్నె వెంకటసుబ్బయ్య ఓ ప్రకటనలో తెలిపారు. అనాథలు, పేద పిల్లల కోసం స్కూల్ నడుపుతున్నట్లు చూయించి ఆ భూమిని తమ ఆశ్రమం కోసం పైరవీలు చేసి తెచ్చుకున్నాడని, అయితే భూమి కేటాయించిన ఉద్దేశ్యం నెరవేరకపోతే కేటాయింపు రద్దవుతుందని ఆ జీవోలోనే ఉన్నందున తక్షణం కోట్ల విలువైన అటవీ భూమిని స్వాధీనం చేసుకోవాలని పేర్కొన్నారు. ఇక్కడ స్కూల్ నడవడం లేదని, యజ్ఞాలు, యాగాల పేరుతో అమాయకులను దొంగస్వామి మోసం చేస్తున్నాడని, ఎవరైనా తనిఖీలకు వచ్చినపుడు చుట్టుపక్కల పిల్లలను తీసుకొచ్చి వీరంతా అనాథ పిల్లలే అని మోసం చేస్తున్నాడని పేర్కొన్నారు. ఆశ్రమం కోసం ఆక్రమించిన చెరువు పోరంబోకు భూమిని స్వాధీనం చేసుకోవాలని, అక్రమ నిర్మాణాలు ఉంటే కూల్చివేయాలని నాలుగేళ్ల క్రితం ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదేశాలు జారీచేసినా అతీగతీ లేదని, తక్షణం ఆ ఆదేశాలు అమలు చేయడంతోపాటు అటవీభూమిని కూడా స్వాధీనం చేసుకోవాలని తెలిపారు.

త్వరలో రిజర్వేషన్ కౌంటర్ పునఃప్రారంభం

● రైల్వే అధికారుల గ్రీన్ సిగ్నల్

బిట్రగుంట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): బిట్రగుంట రైల్వే స్టేషన్లో త్వరలో రిజర్వేషన్ కౌంటర్ పునఃప్రారంభం కానుంది. ఈ మేరకు రైల్వే అధికారులు గ్రీన్ సిగ్నల్ ఇస్తూ శుక్రవారం అనుమతి లేఖ విడుదల చేశారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బిట్రగుంట రైల్వే అభివృద్ధి కమిటీ సభ్యులు, రైల్వే రిటైర్డ్ ఉద్యోగులతో పాటు కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిల కృషి ఫలించింది. అయితే ఎప్పటి నుంచి రిజర్వేషన్ కౌంటర్ ప్రారంభిస్తారో ఇంకా స్పష్టత లేదు. కానీ ఈ కౌంటర్ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉంటుందని తెలిసింది. దీని కోసం కృషి చేసిన అందరికి బిట్రగుంట రైల్వే అభివృద్ధి కమిటీ నాయకులు షేక్.నూరుద్దీన్, మెతుకు రాజేశ్వరి, బత్తుల రవిచంద్రలు కృతజ్ఞతలు తెలిపారు.

టూరిస్టులపై ఉగ్రదాడులు మానవత్వానికే కళంకం

కందుకూరు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): కశ్మీర్ అందాలను తిలకించేందుకు కశ్మీర్ లోయకు వెళ్లిన టూరిస్టులపై ఉగ్రవాదులు జరిపిన దాడి మానవత్వానికే కళంకమని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బి.సురేష్‌బాబు అన్నారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఉగ్రవాదుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉగ్రవాదుల దాడులు ఉంటాయని ఇంటెలిజెన్స్ ముందుగానే హెచ్చరించినా ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరించడం భద్రత లోపానికి నిదర్శనమని, ఇలాంటి ఉగ్రదాడులు మళ్లీ జరగకుండా కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, భారత సమాజమంతా ఉగ్రదాడులను ఏకకంఠంతో ఖండించాల్సిన తరుణమని పేర్కొన్నారు. సమావేశంలో సీపీఐ నాయకులు వై. ఆనంద్‌మోహన్, బాలబ్రహ్మాచారి, ఉప్పుటూరి మాధవరావు, ఎం.రామయ్య తదితరులు పాల్గొన్నారు.

అందని గోకులాల బిల్లులు!

● చేసిన అప్పులకు భారమవుతున్న వడ్డీ ● ఆందోళనలో పశు పోషకులు

జలదంకి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): గోకులాల షెడ్లకు బిల్లులు అందక రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.. గత టీడీపీ ప్రభుత్వంలో అమలులో ఉన్న గోకులం షెడ్లు వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లు నిలిపివేసింది. కొత్తగా అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ కూటమి ప్రభుత్వం మళ్లీ పశువుల పెంపకందారులకు గోకులం షెడ్లు నిర్మాణ పథకాన్ని తిరిగి ప్రారంభించింది. 100 శాతం ఎంహెచ్ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో ఈ గోకులాలకు నిధులు మంజూరు చేసింది. పీఆర్, గ్రామీణాభివృద్ధి శాఖల పర్యవేక్షణలో పథకం ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా గత ఏడాది అక్టోబరు మాసంలో జిల్లాకు 1300 గోకులం షెడ్లు (పాడి గేదెలు, గొర్రెలు, మేకలు, కోళ్ల పెంపకం కోసం) మంజూరయ్యాయి. అందులో పాడిగేదెల షెడ్లు అధికంగా ఉన్నాయి. జిల్లాలో 1130 యూనిట్లు అధికారులు గ్రౌండింగ్ చేసి అబ్ధిదారులతో వేగవంతంగా క్షేత్రస్థాయిలో ఉపాధిహామీ సిబ్బంది సాంకేతికతను జోడించి పక్కాగా అత్యంత నాణ్యతగా నిర్మింపజేశారు. 6 గేదెలు ఉండే వసతి గోకులం షెడ్డుకు ప్రభుత్వం రూ.2.20 లక్షలు మంజూరు చేసింది. వీటికోసం అబ్ధిదారులు పోటీపడి దక్కించుకున్నారు. ఎట్టకేలకు షెడ్లు పూర్తయినప్పటికీ బిల్లులు మాత్రం చెల్లించలేదు. దీంతో లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



కమ్మపాలెంలో నిర్మించుకున్న గోకులం షెడ్డు

● **నేటికీ అందని బిల్లులు**

డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ మంత్రిగా ఉన్న పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కిందకు ఈ పథకం రావడంతో బిల్లులు ఆగవనే నమ్మకం అబ్ధిదారుల్లో ఉండడంతో అప్పులు చేసి మరీ గోకులం నిర్మాణాలు చేసుకున్నారు. కానీ షెడ్లు నిర్మించి నెలలు గడుస్తున్నా ఉపాధి అధికారులు అవిగో ఇవిగో వస్తున్నాయి బిల్లులు అంటూ కాలం వెళ్లదీస్తున్నారే తప్ప బ్యాంకు ఖాతాల్లో నగదు జమకావడం లేదు. దీంతో అబ్ధిదారులు మండల కేంద్రాల్లోని ఉపాధి కార్యాలయాల చుట్టూ బిల్లులు ఎప్పుడిస్తారంటూ తిరుగుతున్నారు. కాగా జిల్లాలో సుమారు రూ.24 కోట్ల బిల్లులు చెల్లించాల్సి ఉందని తెలిసింది.

విద్యార్థుల ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం

● పాఠశాలల సమీపంలో దుర్గంధం

బిట్రగుంట, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ఆరోగ్యం పట్ల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆ వేదన చెందుతున్నారు. బోగోలు మండలం విశ్వనాథరావుపేటలోని జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాల సమీపంలోని ప్రధాన కాలువ కొన్ని నెలలుగా పూర్తిగా దెబ్బతిని మురుగు నీరు నిల్వ ఉండి పందులకు నిలయంగా మారింది. కాలువలో చెత్తాచెదారంతో పాటు ప్లాస్టిక్ కవర్లతో అధ్వానంగా తయారైయింది. తరగతి గదుల సమీపం లో కాలువ ఉండటం వలన దుర్గంధం వెదజల్లుతుం దని విద్యార్థులు వాపోతున్నారు. పేరుకు మేజర్ పంచాయతీ అయినా ఎన్నో ఏళ్లక్రితం నిర్మించిన కాలువ దెబ్బతిన్న విషయం అధికారులకు తెలిసినా పట్టించుకోకపోవడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కాలువ మరమ్మతులు చేయించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు



నెల్లూరు (వ్యవసాయం), ఆంధ్రజ్యోతి : పశువైద్య సేవల్లో జిల్లాకు రాష్ట్ర, జాతీ య స్థాయిలో గుర్తింపు ఉంది. నెల్లూరు లోని బహువిధ పశువైద్యశాల(వీపీసీ) ద్వారా మూగజీవాలకు అందిస్తున్న సేవలకు గత ఏడాది రాష్ట్ర స్థాయిలో గుర్తింపు వచ్చింది. కుక్కలు, పిల్లులకు నిత్యం వ్యాధి నిరోధక టీకాలు, వైద్యం, శస్త్రచికిత్సలు అందుతున్నాయి. రోజుకు 125 నుంచి 150 జంతువులకు వైద్య సేవలు అందిస్తున్నట్లు ఉప సంచాల కుడు డాక్టర్ టీ సోమయ్య తెలిపారు. అందులో భాగంగా రాష్ట్ర స్థాయిలో అత్యధిక చికిత్సలు నిర్వహిస్తున్న వీపీసీగా గుర్తింపు లభించింది.



- వీపీసీ ఏడీగా పని చేస్తున్న డాక్టర్ ఎం మాలకొం డయ్య అంది స్తున్న సేవలకు 2022లో జాతీయ స్థాయిలో అవార్డు లభించింది. అత్య ధిక శస్త్ర చికిత్సలు చేసిన వైద్యుడిగా ఆయనకు ఈ అవార్డు దక్కింది. అదేవిధంగా 2022లో అల్లూరు ఏరియా వెటర్నరీ ఆసుపత్రి(ఏవీహెచ్) ఏడీగా పనిచేసున్న సమయంలో ఆయనకు రాష్ట్ర స్థాయిలోనూ అవార్డు లభించిం ది. పశువులకు మెరుగైన వైద్య సేవలు అందించడంతోపాటు ప్రభుత్వ పథకాలపై రైతులకు అవగాహన కల్పించడం, అర్హులైన వారికి అవి అందే లా చేయడంలో ఆయన కృషికి ఈ పురస్కారం నిదర్శనం.
- పశువుల కృత్రిమ గర్భధారణ పథకం నిర్వహణలో రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానంలో నిలిచినందుకు 2022లో పశుగణాభివృద్ధి సంస్థ కార్య నిర్వహణాధికారిగా పనిచేసిన డాక్టర్ టీ సోమయ్యకు రాష్ట్ర స్థాయిలో అవార్డు లభించింది. కృత్రిమ గర్భధారణ ద్వారా ఉత్తమ జన్యు లక్షణాలను అభివృద్ధి చేసి పాల ఉత్పత్తిని పెంచడంతోపాటు మేలురకమైన పశువులు పెరిగే అవకాశాలు ఎక్కువ. ముర్రా, ఒంగోలు, జెర్సీ, గిర్, ఆంబోతుల నుంచి సేకరించిన వీర్యాన్ని స్థానిక ఆవులు, గేదెల్లో ప్రవేశపెట్టి ఉత్తమ లక్షణాలు కలిగిన పశుసంపదను అభివృద్ధి చేయడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశ్యం. సోమయ్య ప్రస్తుతం పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ పనిచేస్తున్నారు.



పెంపుడు జంతువులను ఆరోగ్యంగా ఉంచడంలో కీలకపాత్ర పోషిస్తున్న పశు వైద్యుల సేవలు ఎనలేనివి. మూగజీవాలు అనారోగ్యానికి గురైతే వాటి బాధను అర్థం చేసుకుని అవసరమైన చికిత్స అందించే ఉదాత్తమైన వృత్తి వారిది. అలాంటి వృత్తిలో సేవలందిస్తున్న వారిని గుర్తు చేసుకుంటూ గౌరవించు కునేందుకు ప్రతి ఏడాది ఏప్రిల్ చివరి శనివారం ప్రపంచ పశువైద్య దినోత్సవం జరుపుకుంటున్నారు. ఈఏడాది కూడా 'జంతువుల ఆరోగ్యం కోసం ఒక జట్టు అవసరం' (యానిమల్ హెల్త్ టేక్స్ ఏ టీం) అనే సందేశంతో దినోత్సవం జరుపుకుం టున్నారు.

నెల్లూరు (వ్యవసాయం, ఆంధ్రజ్యోతి)

మూగజీవులకు ఆరోగ్య ప్రదాతలు

నేడు ప్రపంచ పశువైద్య దినోత్సవం

- వెటర్నరీ వైద్యుల విశేష సేవలు
- పెంపుడు జంతువులకు చికిత్స
- పాడి పరిశ్రమ వృద్ధిలో కీలకం
- సాంక్రమిక వ్యాధులపై అవగాహన

జిల్లాలో వ్యవసాయం తరువాత పాడి పరిశ్రమపై ఆధారపడి ఎంతో మంది రైతులు జీవనం సాగిస్తున్నారు. పశువులకు వ్యాధులు, ఇతర సమస్యలు రాకుండా నివారించడం, అవసరమైన చికిత్సలు అందిస్తూ వెన్ను, దన్నుగా ఉన్నారు పశువైద్యులు. కృత్రిమ గర్భధారణతో పాడి అభివృద్ధికి, రైతుల ఆర్థికాభి వృద్ధికి ఎంతో దోహద పడుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో రైతు ఇంటి వద్దే పశువులకు సేవలం దిస్తున్నారు. వ్యాధి నిరోధక టీకాలు, వ్యాధి నిర్ధారణ పరీక్షలు కూడా చేస్తున్నారు.



● జునోటిక్ వ్యాధులపై అవగాహన

జంతువుల నుంచి మనుషులకు వచ్చే జునోటిక్ వ్యాధులపై అవగాహన కల్పించడంలో పశువైద్యులు ముందుంటారు. ఇది పెంపకందా రులతో పాటు ఇతరులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎంతో ఉపయోగపడుతోంది. తద్వారా ప్రజారోగ్యాన్ని కాపాడుతున్నారు. ముఖ్యంగా పశువులు, కుక్కలు, పిల్లులు, పక్షులు, ఎలుకలు, మేకలు, గొర్రెలు, గబ్బిలాలు వంటి వాటి ద్వారా మనుషులకు వ్యాధులు వ్యాప్తి చెందుతాయి. ఆంత్రాక్స్, బ్రూసెల్లోసిస్, ప్లేగు, క్షయ, క్యూ జ్వరం, బర్డ్‌ఫ్లూ, ఎబోలా, నిపా వైరస్, రేబిస్ వంటి బ్యాక్టీరియల్, పరాన్నజీవి, వైరల్ జునోటిక్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా వైద్యులు అందిస్తున్న సేవలు అభినందనీయం.

● విలువైన సేవలు

కుక్కలు, పిల్లులు, కుందేళ్లు పెంచుకోవడం ఎంతో మందికి సరదా. కాలక్షేపం కూడా. వాటితో కాసేపు గడిపితే ఒత్తిడి దూరమవుతుందని ఎంతో మంది భావిస్తుంటారు. అయితే వాటిని ఎంత మంచి వాతావరణంలో, పౌష్టికాహారం ఇచ్చి పెంచుకున్నా ఒక్కోసారి అనారోగ్యానికి గురవుతుంటాయి. అప్పుడు గుర్తుకు వచ్చేది పశువైద్యులు మాత్రమే. ముఖ్యంగా పాడి పెంపకందారులకు వీరందించే సేవలు ఎంతో విలువైనవి. గాయపడిన వాటికి చికిత్స చేయడమే కాకుండా పశువులు, జంతువులు ఎందుకు అనారోగ్యానికి గురయ్యాయో తెలుసుకుని వాటికి అవసరమైన చికిత్సలు అందిస్తున్నారు. అటువంటి పశువైద్యులకు జంతు ప్రేమికులు కృతజ్ఞతలు తెలియజేయాల్సిన రోజు ఇది.



సమతామూర్తి పేట ఉత్సవం

రామానుజులకు తిరుమంజనం

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో భగవద్రామానుజ స్వామి 1008వ అవతార ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శుక్రవారం ఉదయం తిరుమంజన సేవ, సాయంత్రం మంగళ శాసనోత్సవం, అనంతరం పేట ఉత్సవం కన్నుల పండువగా జరిగాయి.

మధుసూదన్‌రావు కుటుంబానికి అండగా ఉంటాం

- రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక సలహాదారు సతీష్‌రెడ్డి



మధుసూదనరావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ప్రభుత్వ ప్రత్యేక సలహాదారు సతీష్‌రెడ్డి, కావలి ఎమ్మెల్యే వెంకట కృష్ణారెడ్డి

కావలి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ఉగ్ర దాడిలో బలైన సోమిశెట్టి మధు సూదనరావు కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని డీఆర్‌డీవో మాజీ చైర్మన్, రాష్ట్రప్రభుత్వ ప్రత్యేక సలహాదారు జీ.సతీష్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డితో కలిసి మధుసూదన్‌రావు కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాధిత కుటుంబం మానసిక, ఆరోగ్య పరిస్థితి తెలుసుకుని వారికి అండగా ఉంటామని చెప్పడానికి కావలికి వచ్చామన్నారు. స్థానిక ఎమ్మెల్యే నిత్యం ఆ కుంటుబం యోగ క్షేమాలు తెలుసుకుంటూ వారికి తోడుగా ఉంటారన్నారు. రాబోయే రోజుల్లో వారి కుటుంబానికి ఏ రకమైన సహాయం కావాలో తెలుసుకుని ప్రభుత్వంతో మాట్లాడి ఆ సహాయం అందిస్తమన్నారు. కావలి ఎమ్మెల్యే కృష్ణారెడ్డి మాట్లాడుతూ మధుసూదనరావు మరణం పట్టణానికి శోకాన్ని మిగిల్చిందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు గుత్తికొండ కిషోర్, పోతుగంటి అలేఖ్య, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి, నేతలు సురేంద్రరెడ్డి, భరత్‌కుమార్, అమరా వెంకటసుబ్బారావు, జనసేన నేత సమ్మన వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

పాలీసెట్ హాల్‌టికెట్ల విడుదల

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాల కోసం ఈనెల 30న నిర్వహించే పాలిసెట్‌కు సంబంధించిన హాల్‌టికెట్లు విడుదలయ్యాయని నెల్లూరులోని వెంకటేశ్వరపురం ప్రభుత్వ బాలుర పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ రామారావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. polycetap.nic.in వెబ్‌సైట్ ద్వారా హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు సమీపంలోని పాలిటెక్నిక్ కళాశాలల్లో సంప్రదించాలని సూచించారు.

నెల్లూరులో వ్యభిచార కేంద్రాలపై దాడులు

నెల్లూరు (క్రైం), ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : నగరంలో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న వ్యభిచార కేంద్రాలపై శుక్రవారం పోలీసులు దాడులు నిర్వహించి పలువురు విటులను అరెస్ట్ చేసి సెక్స్ వర్కర్లను హోమ్‌కు తరలించారు. పోలీసుల సమాచారం మేరకు. అల్లీపురానికి చెందిన పొట్టెయ్య అలియాస్ పొట్టయ్య అల్లీపురం, కిసాన్‌నగర్‌కు చెందిన ముగ్గురు మహిళలు ఏడాది కిందట మధురానగర్‌లో మూడిళ్లను అద్దెకు తీసుకున్నారు. పలు ప్రాంతాల నుంచి సెక్స్‌వర్కర్లను తీసుకువచ్చి గుట్టుచప్పుడు కాకుండా వ్యభిచారం నిర్వహిస్తున్నారు. ఈ విషయమై నవాబు పేట ఇన్‌చార్జ్ ఇన్‌స్పెక్టర్ సాంబశివరావుకు సమాచారం అందడం తో శుక్రవారం నవాబుపేట ఎస్ఐ శివయ్య తన సిబ్బందితో కలిసి మూడు ఇళ్లపై దాడి చేశారు. ముగ్గురు నిర్వాహకులను, నలుగురు విటులను అరెస్ట్ చేయడంతోపాటు రూ.3,770 నగదును స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు సెక్స్‌వర్కర్లను అదుపులోకి తీసుకుని హోమ్‌కు తరలించారు. పరారీలో ఉన్న మరో నిర్వాహకురాలి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

- నగరంలోని కొండాయపాలెం కావేరినగర్‌లోని వ్యభిచార కేంద్రంపై వేదాయపాలెం ఇన్‌చార్జ్ ఇన్‌స్పెక్టర్ టివి సుబ్బారావు దాడిచేశారు. కేంద్ర నిర్వాహకుడు కిసాన్‌నగర్‌కు చెందిన షేక్ ఖాజావలి, ఇద్దరు విటులను అరెస్ట్ చేశారు. సెక్స్‌వర్కర్లను అదుపులోకి తీసుకొని హోమ్‌కు తరలించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

నెల్లూరు(క్రైం) : నెల్లూరులోని ఇందిరాభవన్ రోడ్డులో ఓ వైద్యశాల సమీపాన శుక్రవారం గుర్తుతెలి యని వ్యక్తి మృతి చెందాడు. 40 నుంచి 45 సంవత్సరాల వయ సున్న వ్యక్తి మరణించాడు. మృత దేహంపై నలుపు రంగు ప్యాంటు, ఎరుపు, లేత బులుగురంగు చారల ఫుల్ హ్యాండ్స్ చొక్కా ఉన్నాయి. సమాచారం అందుకున్న సంత పేట పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. మృత దేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సిలిండర్ ధరకన్నా ఎక్కువ తీసుకుంటే చర్యలు

- ఏజెన్సీ నిర్వాహకుల సమీక్షలో జేసీ కార్తీక్

నెల్లూరు (హరనాథపురం), ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : గ్యాస్ సిలిండర్ డెలివరీ బాయ్స్ వినియోగదారుల వద్ద గ్యాస్ ధర కన్నా అధికంగా వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని జాయింట్ కలెక్టర్ కార్తీక్ హెచ్చరించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో గ్యాస్ ఏజెన్సీల నిర్వా హకులతో సమీక్ష జరిపారు. డెలివరీ బాయ్స్ వినియోగదారుల నుంచి గ్యాస్ నిర్ణీత ధర కన్నా అధికంగా వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని చెప్పారు. ఈ పద్ధతిని నిర్వాహకులు కట్టడి చేయాలన్నారు. లేకపోతే గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటా మని హెచ్చరించారు.

రుణాల కోసం దళారులను నమ్మొద్దు

- ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నెల్లూరు (హరనాథపురం), ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ కార్పొరేషన్ రుణాల కోసం దళారులను నమ్మవద్దని ఆ కార్పొరేషన్ ఈడీ బాలసాని శ్రీనివాసులు ఓ ప్రకటనలో దరఖాస్తుదారులను కోరారు. కమీషన్ ఇస్తే లోన్ ఇప్పిస్తాం అనే శీర్షికతో శుక్రవారం ఆంధ్రజ్యోతి ప్రచురించిన కథనానికి ఆయన స్పందించారు. ఎస్సీ కార్పొరేషన్ బ్యాంకు లింకేజీ రుణాలకు సంబంధించి ఓబీఎం ఎంఎస్ ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైందని తెలిపారు. ఇది పూర్తిగా ఆన్‌లైన్ ప్రక్రియ అని, దళారులకు ఎలాంటి అవకాశం లేకుండా, అర్హులే నేరుగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. వారి సెల్ నెంబర్‌కు ఓటీపీ వచ్చే సదుపాయం ఉందని తెలిపారు. ప్రస్తుతం రుణాలకు సంబంధించి రిజిస్ట్రేషన్ ప్రక్రియ మాత్రమే జరుగుతోందని స్పష్టం చేశారు. దరఖాస్తు దారులకు సందేహాలుంటే నేరుగా తనను ఫోన్ 98499 05971 నెంబరులో సంప్రదించాలని కోరారు.

ఆసుపత్రిలో వీల్‌చైర్లు రోగులకా.. మందులకా..?



వీల్‌చైర్‌లో తరలిస్తున్న మందులు

ఉదయగిరి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మూడు జిల్లాల సరిహద్దు ప్రాంతమైన ఉదయగిరిలోని పేదలకు ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రమే దిక్కు. వైద్యశాలకు వచ్చే వృద్ధులు, నడవలేని రోగులు, దివ్యాంగులను వీల్‌చైర్‌లో కూర్చోబెట్టి వైద్యుల దగ్గరకు, వారు ఏదైనా పరీక్షలు రాస్తే అక్కడికి తీసుకెళ్లాలి. అయితే శుక్రవారం వైద్యశాలకు ఇద్దరు వృద్ధులు వివిధ రుగ్మతలతో బాధపడుతూ కర్ర, వారి బంధువుల సహాయంతో వైద్యశాలకు వచ్చారు. అక్కడ సిబ్బంది వారిని మరిచి వీల్‌చైర్‌లో మందులు తరలిస్తున్నారు. ఆ కుర్చీలున్నది రోగులకా.. లేక మందులు తరలించేందుకా అంటూ పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. మందులు తరలించినా నడవలేని రోగులు వచ్చిన సమయంలో వారిని వైద్యుల దగ్గరకు తీసుకెళ్లాల్సిన బాధ్యతను విస్మరించారన్న విమర్శలు వ్యక్తమయ్యాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోగులకు పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

హాస్టల్ విద్యార్థులకు కలెక్టర్ ప్రశంసలు



ప్రశంసా పత్రాలు అందుకున్న విద్యార్థులతో కలెక్టర్ ఆనంద్, సోషల్ వెల్ఫేర్ డీడీ శోభారాణి

నెల్లూరు (హరనాథపురం), ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల విడుదలైన ఇంటర్మీడి యట్, పదో తరగతి పరీక్షల ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్ల విద్యార్థు లను కలెక్టర్ ఆనంద్ అభినందించారు. ఆయన చాంబర్‌లో శుక్రవారం ఆయా విద్యార్థులకు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఇంటర్మీడియట్ సెకండ్ ఇయర్ ఎంపీసీ పరీక్షల్లో 961 మార్కులు సాధించిన నెల్లూరు సాంఘిక సంక్షేమ హాస్టల్ విద్యార్థిని యాదల సంగీత, సీఈసీలో 927 మార్కులు సాధించిన బద్దిపూడి మేఘన, పదో తరగతిలో 574 మార్కులు సాధించిన వింజమూరు సాంఘిక సంక్షేమ బాలికల హాస్టల్ విద్యార్థిని ఏ నందిని, 568 మార్కులు సాధించిన ఉలవపాడు సాంఘిక సంక్షేమ బాలికల హాస్టల్ విద్యార్థిని ఎన్ కాజోల్ లక్ష్మీ అగర్వాల్, 565 మార్కులు సాధించిన ఆత్మకూరు సాంఘిక సంక్షేమ బాలుర హాస్టల్ విద్యార్థి ఒంటేరు సాయి ధనుష్ తదితరులకు అభినందనలు తెలిపారు. ఇదే ఒరవడి కొనసాగించి భవిష్యత్తులో మంచి చదువులు చదువుకొని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షిస్తూ వారికి ఆశీస్సులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి శోభారాణి, తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ హయ్యర్ ఆప్షన్ తిరస్కరణ ఆపాలి

- ఈపీఎఫ్ కార్యాలయం వద్ద ధర్నా



ఈపీఎఫ్ ప్రాంతీయ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఆర్టీసీ కార్మికులు, విశ్రాంత ఉద్యోగులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : పెన్షన్ హయ్యర్ ఆప్షన్ తిరస్కరణను ఆపాలని, కేంద్ర ప్రభుత్వం పలు సమస్యలను పరిష్కరించాలని ఆర్టీసీ కార్మిక నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్, రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నెల్లూరులోని ఈపీఎఫ్ ప్రాంతీయ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం ఈపీఎఫ్ ఇన్‌చార్జి కమిషనర్ సుబ్రహ్మణ్యంకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి కట్టా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సుప్రీం కోర్టు తీర్పును ఉల్లంఘిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా పెన్షన్ హయ్యర్ ఆప్షన్ దరఖాస్తులను తిరస్కరించిందని ఆరోపించారు. మూడు నెలల ముందు హయ్యర్ ఆప్షన్ మొత్తం చెల్లింపునకు నోటీసులు ఇవ్వాల్సి ఉండగా పది, పదిహేను రోజుల ముందు వెబ్‌సైట్లో పెట్టి ఆ తర్వాత ఈపీఎఫ్‌వో తిరస్కరించి చేతులు దులుపుకుందని విమర్శించారు. దీనివల్ల వేలాది మంది నష్ట పోయారన్నారు. కనీస పెన్షన్‌ను రూ.9 వేలుగా నిర్ణయించాలని, ఈపీఎఫ్‌కు కూడా కరువు భత్యం, వేతన ఒప్పందాలను లింకు చేయాలని, చివరి నెల జీతంలో సగం పెన్షన్‌గా ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు రాజశేఖర్, వెంకటేశ్వర్లు, చంద్రయ్య, కృష్ణారావు, ఖాజావల్లి తదితరులు పాల్గొన్నారు.

మలేరియాకు గురికావద్దు

- డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత
- నెల్లూరులో అవగాహన ప్రదర్శన



మలేరియా అవగాహన ప్రదర్శనను ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత

నెల్లూరు (వైద్యం), ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : మలేరియా వ్యాధికి గురికాకుండా ప్రతీ ఒక్కరు జాగ్రత్తపడాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత సూచించారు. శుక్రవారం మలేరియా నివారణ దినం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ నెల్లూరులో అవగాహన ప్రదర్శన నిర్వహించింది. దీనికి డీఎంహెచ్‌వో జెండా ఊపి ప్రారంభించారు. డీఎంహెచ్‌వో కార్యాలయం ఉంచి ఏబీఎం కాంపౌండ్ వరకు ఈ ప్రదర్శన సాగింది. డాక్టర్ సుజాత మాట్లాడుతూ ఎనాఫిలస్ ఆడదోమ కుట్టడం వల్ల మలేరియా వ్యాధి సోకుతుందని చెప్పారు. చలి, వాంతులు, జ్వరంతో కూడిన లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించి మలేరియా నిర్ధార ణ పరీక్ష చేయించుకోవాలని సూచించారు. వైద్య ఆరోగ్యశాఖ మలేరియా నివారణకు నిబద్దతతో కృషి చేస్తోందని చెప్పారు. మలేరియా నివారణ విభాగం జిల్లా అధికారి హుస్సేనమ్మ మాట్లాడుతూ దోమలు కుట్టకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదన పు వైద్యాధికారి డాక్టర్ ఖాదర్ వలి, నోడల్ అధికారి డాక్టర్ దయాకర్, ఏఎంవో నాగార్జునరావు, డెమో కనకరత్నం, జిల్లా పీఎంపీ అసోసియేషన్ అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మైనింగ్ మాఫియాకు కొమ్ముకాస్తున్న తహసీల్దార్‌పై చర్యలు చేపట్టాలి

- అఖిల భారత రైతు కూలీ సంఘం ఆందోళన

సైదాపురం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): దళితులకు అన్యాయం చేస్తూ మైనింగ్ మాఫియాకు కొమ్ముకాస్తున్న తహసీల్దార్ రమాదేవిపై జిల్లా కలెక్టర్ చర్యలు చేపట్టాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కన్వీనర్ డీపీ పోలయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో దళితులు స్థానిక వీధుల్లో ర్యాలీ నిర్వహించి బస్టాండ్ సెంటర్‌లో రాస్తారోకో చేపట్టారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని ఆందోళన చేశారు. ఈసందర్భంగా పోలయ్య మాట్లాడుతూ మండలంలోని ఊటుకూరు గ్రామంలో దళితుల ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ భూములకు యాజమాన్యం హక్కు కల్పించి, దళితులపై మైనింగ్ మాఫియా పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని, భూస్వాముల ఆధీనంలో ఉన్న సర్వే నెంబర్ 356, 359లో 400 ఎకరాల ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుని దళితులకు పంపిణీ చేయాలని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఐదు రోజుల పాటు నిరవధిక ధర్నా చేపట్టామన్నారు. సమస్యలను తహసీల్దార్‌కు విన్నవించేందుకు వెళ్లినా పట్టించుకోకుండా తలుపులు వేసుకుని పోలీసుల ద్వారా బలవంతంగా బయటకు పంపించారన్నారు. దళితులకు న్యాయం చేయకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గడ్డం వెంకటేశ్వర్లు, భారత కార్మిక సంఘాల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు కె రమేష్, మహిళా నాయకు రాలు మమత, నాగమణి, కోటయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌కు అనుగుణంగా బేళ్లు తెండి!

- పొగాకు రైతులతో బోర్డు ఈడీ విశ్వశ్రీ



పొగాకు వేలం ప్రక్రియను పరిశీలిస్తున్న విశ్వశ్రీ, వేణుగోపాల్ తదితరులు

కందుకూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : పొగాకు వేలం కేంద్రాలలో ధరలకు అనుగుణంగా ఆయా గ్రేడ్‌లను వేలంకు తెచ్చుకోవటం ద్వారా రైతులు లాభం పొందాలని పొగాకుబోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి. విశ్వశ్రీ, బోర్డు కార్యదర్శి దివి వేణుగోపాల్ సూచించారు. తేలిక నేలల ఆర్ఎం ఎం. లక్ష్మణరావుతో కలిసి శుక్రవారం కందుకూరులోని రెండు పొగాకు వేలం కేంద్రాలను వారు సందర్శించారు. నోబిడ్‌లు, సీఆర్‌లు అధికంగా ఉంటున్నట్లు గుర్తించిన వారు ప్రస్తుత మార్కెట్‌ను దృష్టిలో ఉంచుకుని పొగాకును తెచ్చుకోవాలని రైతులకు సూచించారు. అలాగే వేలం కేంద్రాలకు వచ్చే ముందు తేమ, వేడి, సాఫ్ట్ లేకుండా బేళ్లను తెచ్చుకుంటే నోబిడ్‌ల సమస్యను చాలావరకు నివారించవచ్చని సూచించారు. అలాగే గ్రేడింగ్ విషయంలో కూడా జాగ్రత్తలు తప్పనిసరి అని, గ్రేడింగ్ సరిలేని బేళ్లను తెస్తే వేలంకేంద్రాలను నడపటం కష్టంగా మారుతుందని అన్నారు. అనంతరం విశ్వశ్రీ, వేణుగోపాల్‌లు వ్యాపార ప్రతినిధులు, బోర్డు అధికారులతో సమావేశం నిర్వహించి రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, నోబిడ్‌లు తగ్గేలా చూడాలని కోరారు.

కుట్టుమిషన్ల నిధుల దుర్వినియోగం

- జేసీకి బీసీ యువజన సంఘం ఫిర్యాదు



జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సుభాష్‌యాదవ్

నెల్లూరు (హరనాథపురం), ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : బీసీ మహిళల కుట్టు మిషన్లకు ప్రభుత్వం కేటాయించిన నిధులు దుర్వినియోగం అయ్యాయని, దీనిపై విచారణ జరిపించాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మద్దులూరు సుభాష్ యాదవ్ కోరారు. ఈ మేరకు శుక్రవారం జాయింట్ కలెక్టర్ కార్తీక్‌కు కలెక్టరేట్‌లో వినతిపత్రం ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీ మహిళలకు ఆర్థిక చేయూతనిచ్చే ఉద్దేశంతో కుట్టుమిషన్లు ఇచ్చి, టైలరింగ్ నేర్పించడం కోసం ప్రైవేటు ఏజెన్సీలకు రూ.100 కోట్లు కేటాయించిందని చెప్పారు. అయితే ఆ నిధులు దుర్వినియోగం అయ్యా యని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాషన్ బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి కంచర్ల హరీష్, రాష్ట్ర నాయకులు రాచూరు మురళీకృష్ణ యాదవ్, జమ్మళ్ల లక్ష్మీకాంత్ యాదవ్, జిల్లా విద్యార్థి నాయకుడు కువ్వాకొల్లి వెంకటసాయి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.